ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ — సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
కందర్ప రామచంద్రరావు
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి

సంపుటి 14 - సంచిక 6
**నవంబర్ 2010**
**విడిప్రతి రూ॥ 10.00**
**సం॥ చందా రూ॥ 120**
**3 సం॥ చందా రూ॥ 350**
**10 సం॥ చందా రూ॥ 1116**

Please send drafts in favour of
SRI VEDAMATA
GAYATRI TRUST
BUSINESS DIVISION,
HYDERABAD


## జీవిత సత్యం

జీవితం అశాశ్వతం అని తెలిసినవారే సత్యం అంటే ఏమిటో తెలుసుకోగలుగుతారు. సత్యస్వరూపాన్ని, ధర్మాన్ని అనుభవంలోకి తెచ్చుకున్నవారు జీవితం ఒక నీటి బుడగ అని చెప్పారు. ఈ క్షణంలో ఉండి, మరుక్షణంలో మాయం అయ్యే జీవితం కోసం ప్రాకులాడడం అనవసరం అన్నారు. అశాశ్వతమైన దాని కోసం ఆరాటపడేవారు అమితమైన నష్టాన్ని, కష్టాన్ని అనుభవిస్తారు. కాని జీవిత సత్యాన్ని తెలుసుకున్న వారు శాశ్వతమైన జీవితం కోసం పరితపిస్తారు.

జీవిత సత్యాన్ని తెలుసుకుని జీవిస్తున్న ఒక ఫకీరును పాదుషా బంధించి జైలులో పెట్టాడు. ఫకీరు ఎప్పుడూ పాదుషా ఎదుట సత్యాసత్యాల గురించి చర్చించేవాడు. అవి విని పాదుషా అతడిని జైలులో పెట్టించాడు. ఆయనకు సత్యం వినడం ఇష్టంగా ఉండేది కాదు. ఇదంతా గమనించిన ఫకీరు మిత్రుడొకడు "సత్యాన్ని గురించిన నీ మాటలే నిన్ను బంధింప చేశాయి. చర్చించకుండా ఉండాల్సింది" అన్నాడు. దానికా ఫకీరు పెద్దగా నవ్వాడు. "నేను భగవంతుని నమ్ముకున్న నాటినుండి సత్యాన్నే పలుకుతున్నాను. దాన్ని వదలడం నా వల్ల కాదు. పరమాత్ముని సత్తాయే అంత. సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకున్నవారు ఎవరూ మరలా అసత్యం పలుకలేరు. సత్యాన్ని ఎదిరించిన వారికి జీవితమే లేదు. ఈ జైలు బాధ కొంత కాలమే" అన్నాడు.

ఈ సంభాషణ అంతా జైలులో ఒక సిపాయి విన్నాడు. నేరుగా పాదుషాకు చేరవేశాడు. వెంటనే పాదుషా "ఆ వెర్రి బాగుల ఫకీరుకు చెప్పు. ఈ జైలు శిక్ష కొంత కాలమే కాదు. ఇది జీవిత ఖైదు అని చెప్పు అన్నాడు. సిపాయి వెళ్లి చెప్పాడు. మరింత పెద్దగా నవ్వాడు. "అరే భాయి! నా జీవితం కొంత కాలమే కాదని మీ పాదుషా నిర్ణయించగలడా? శిక్ష కోసం నా జీవితాన్ని పెంచగలడా? జీవిత సత్యాన్ని తెలుసుకోగలిగిన వారు ఈ విధమైన మాటలు పలుకరు. వారు సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకుంటారు. జీవితం అనేది ఒక కల. అంతకు మించి ఏమీ లేదు. అదే జీవిత సత్యం" అంటూ ముగించాడు.

★★★

పత్రిక అందనివారు ఈ క్రింది నంబరును సంప్రదించగలరు.
**9949111175**

పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్‌ను సంప్రదించగలరు. **9989659905**

[redacted]ుని ధనం ఉపయోగించని ఎరువుతో సమానం.

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | **సంపాదకీయం :** జీవిత సత్యం | 1 |
| 2. | **విషయసూచిక-సద్గురు వచనామృతం :** కర్మయోగ రహస్యం | 2 |
| 3. | **వేదమంత్రం :** మానవ ధర్మం | 3 |
| 4. | **గాయత్రీ విద్య :** గాయత్రీ మంత్ర సాధన, అంతరంగ కాయకల్పం | 4 |
| 5. | **బాలల భవితకు బంగారు బాట-13 :** కార్యసాధనకు కావలసినది సహనం | 6 |
| 6. | **ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ :** ప్రథమ మండలం - **చతుర్థోధ్యాయం :** జీవనదేవతా సాధన | 7 |
| 7. | **యుగ గీత-3 : మొదటి అధ్యాయం-ఉత్తరార్థం :** ఆత్మసంతాపం | 9 |
| 8. | **ప్రత్యేక వ్యాసం : దీపావళి పర్వదిన సందర్భంగా :** నిరాశ అనే చీకటిని ఆశ అనే చిరుదీపాలతో ప్రాలదోలుదాం | 13 |
| 9. | **సూర్య విజ్ఞానం-2 :** ఆదిదేవ నమస్తుభ్యం, దివాకర నమస్తుభ్యం | 15 |
| 10. | **మరపురాని ఉపదేశం పూజ్యులైన గురుదేవుని దయాగుణం** | 18 |
| 11. | **గాయత్రి-24 శక్తిధారలు (18) :** ప్రాణాగ్ని | 19 |
| 12. | **జనసైన్యం** | 20 |
| 13. | **మనం-మన ఆరోగ్యం :** పాటించవలసిన నియమాలు | 21 |
| 14. | **సాధనా విజ్ఞానం :** లోచూపు అలవరచుకో | 24 |
| 15. | **వ్యక్తి నిర్మాణం :** ఆత్మ విశ్వాసం పెంచుకోండి | 26 |
| 16. | **పరమపూజ్య గురుదేవులు తమ సూక్ష్మీకరణ సాధన అనంతరం కార్యకర్తలకందించిన నిర్దేశనం** | 27 |
| 17. | **కృషికి వివేకము, వివేచన తోడైతే సంపదలు మనవెంటే** | 29 |
| 18. | **ఆరోగ్యమే మహాభాగ్యం :** హోమియో వైద్య సేవ | 30 |
| 19. | **కుటుంబ నిర్మాణం :** కుటుంబంలో స్వర్గతుల్య వాతావరణం | 32 |
| 20. | **వేమన వేదం - నవజీవన నాదం** | 34 |
| 21. | **ఆదిశక్తి యొక్క లీలా కథలు-5 :** కవచ సాధనతో సంపూర్ణ ఫలితం | 36 |
| 22. | **పూజ్య గురుదేవుల అమృతవాణి :** మీ దగ్గరే ఉన్న నన్ను ఎక్కడ వెతుకుతారు? | 38 |
| 23. | **నా వారితో నా మాట : 2011-2012 (శతాబ్ది సం॥)** ఇంకా 100 రోజులు మాత్రమే ఉన్నాయి | 41 |
| 24. | **దేవ సంస్కృతి విశ్వ విద్యాలయం :** సమయ ప్రబంధనము | 44 |
| 25. | **వార్తలు** | 45 |
| 26. | **అక్షరాల ఆట :** పదగాయత్రి-1 | 48 |




## సద్గురు వచనామృతం

## కర్మయోగ రహస్యం

సమాజానికి చేసే నిస్వార్థ సేవయే కర్మయోగం. ఇది హృదయాన్ని శుద్ధి చేస్తుంది. ఆత్మజ్ఞానమనే దివ్యజ్యోతిని పొందటానికై అంతఃకరణానికి యోగ్యత కల్పిస్తుంది. కావలసినది ఏమిటంటే ఏ విధమైన ఆశ, అహంభావం లేకుండా మానవ జాతికి సేవ చేయవలసి ఉంటుంది. కర్మయోగంలో కర్మయోగి అన్ని కర్మలనూ వాటి ఫలితాలను భగవంతునికి సమర్పిస్తాడు. భగవంతునితో ఏకమై, ఆశను త్యజించి, జయాపజయాలను సమానంగా స్వీకరిస్తూ పని చేస్తూ ఉండుటయే కర్మయోగం.

కర్మయోగికి హృదయం విశాలంగా ఉండాలి. అతనికి కుటిలత్వం, నీచత్వం, లోభం, అహంకారం ఏ మాత్రం ఉండకూడదు. అతనికి లోభం, కామం, క్రోధం మరియు అభిమానం ఉండకూడదు. ఈ దోషాలు ఏ మాత్రం కనబడినా, వాటిని ఒక్కొక్కటిగా తొలగించే ప్రయత్నం చేయాలి.

**ఇతరులు మీ ఎడల ఎలా ప్రవర్తించాలని కోరుకుంటారో మీరు ఇతరుల ఎడల ఆ విధంగానే వ్యవహరించాలి.** ఈ నీతి వాక్యాన్ని గుర్తుంచుకోండి. నిత్య జీవితంలో ఇది మీ ఆచార నియమం కావాలి. మీరు అనుచితమైన పని చేయనపుడు మీకు అపరిమిత ఆనందం లభిస్తుంది.

ప్రతిరోజూ ఎన్ని సత్కార్యాలు చేయగలరో అన్నీ చేయండి. నిద్రపోయే ముందు రోజంతా చేసిన పనులను సమీక్షించుకోండి. రోజూ ఆధ్యాత్మిక డైరీ రాయండి. సత్కార్యాలు చేయుట ఆధ్యాత్మిక జీవితానికి ఉషోదయం.

*– అఖండజ్యోతి, మార్చి, 1955*

*అనువాదం : శ్రీ ఊటుకూరి సత్యనారాయణగుప్త*

## పండుగలు

**నవంబరు 2010**

| | |
|---|---|
| 05-11-2010 | దీపావళి |
| 10-11-2010 | నాగుల చవితి |
| 14-11-2010 | బాలల దినోత్సవం (నెహ్రూ జయంతి) |
| 21-11-2010 | కార్తీక పౌర్ణమి, గురునానక్ జయంతి |

**డిసెంబరు 2010**

| | |
|---|---|
| 17-12-2010 | గీతా జయంతి |
| 21-12-2010 | శ్రీ దత్త జయంతి |
| 25-12-2010 | క్రిస్మస్ |

ప్రేమను ద్వేషంతో పొందలేము.

[redacted]

వేద మంత్రం

# మానవ ధర్మం

**అమహుతః పునరేహివిద్యానుదయనం పథః ।**
**ఆరోహణమా క్రమణం జీవతో జీత్యోయనమ్ ॥**

**– (అధర్వణ వేదం 8/1/6)**

**భావార్థం :** మానవుడా! నీవు ఎల్లప్పుడూ ఉన్నతి పొందుతూ ఉండాలి. ఇదే నీ ధర్మం. చిన్న చీమవంటి జీవులు కూడా ఉన్నతి కొరకై నిమగ్నమై ఉంటాయి. నీవు కూడా అలాగే ఉన్నతిని పొందే ఉపాయాలను తెలుసుకుని, నిరంతరం అభివృద్ధి చెందుతూ ఉండు.

**సందేశం :** ప్రపంచంలో జ్ఞాన విజ్ఞానాల విషయంలో ఎంతో అభివృద్ధి జరుగుతోంది. రకరకాల సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. కాని వాటివల్ల సుఖం, శాంతి లభించటం లేదు. మనుష్యులను మంచి మనుష్యులుగా తయారు చేయడం విజ్ఞానం వల్ల జరగదు. అది ఆధ్యాత్మికత వల్లనే సాధ్యం.

ఉన్నతులుగా, మంచివారిగా తయారుచేసే ఆధ్యాత్మికత అంటే ఏమిటి? ఉపాసన, సాధన, ఆరాధన అనే త్రివేణిలో మునకలు వేస్తేనే మనుష్య జీవనం సఫలం అవుతుంది. ఈశ్వరుని దివ్య గుణాలను మనలోపల ధరించుటయే ఉపాసన. దివ్య సిద్ధాంతాలను ఎదురుగా ఉంచుకుని, వాటి ఆధారంగా కర్తవ్యాన్ని నిర్ణయించుకోవాలి. కర్తవ్యాన్ని పరిశీలించుకుంటూ ఆచరణలోనికి తేవాలి. పెద్ద పెద్ద ఆకర్షణలు, ప్రలోభాలు పిలుస్తున్నా, ఆపదలు చుట్టుముట్టినా స్థిరమైన మనస్సుతో కర్తవ్యాన్ని నిర్వహించాలి. సాధన అంటే తన గురించి తాను చేసుకునే తపస్సు, బ్రహ్మచర్యం మొదలైనవి. సాధనతో, సంయమంతో శరీరాన్ని, మనస్సును అదుపులో ఉంచుకోగలగాలి. "ఆరాధన" అంటే సేవ. దీనిలో అన్ని వేళలా ఇతరుల మంచిని కోరుకుంటూ పరులకు ఉపయోగపడే పనులు చేస్తుండాలి. స్వార్థము కొరకుకాక సమాజ ఉన్నతిని కోరుకోవాలి. సమాజ ఉన్నతినే తన ఉన్నతిగా భావించాలి. ఈ మూడింటిని ఆచరించినవారే ఉన్నతిని సాధించగలుగుతారు. స్వర్గీయ వాతావరణాన్ని నిర్మించగలుగుతారు. అందరికీ సుఖశాంతులను అందించగలుగుతారు.

మానవ జీవితం విచిత్రమైంది. దీనిలో పశువుకన్నా హీనంగా దిగజారవచ్చు. దేవతలను మించి ఎదగనూవచ్చు. ఈరెండింటిలో ఏది కావాలో మనమే నిర్ణయించుకోవాలి. దిగజారడం అనేది చాలా సులువు. కాని ఉన్నతమైన దేవత్వాన్ని సాధించాలంటే ప్రభలమైన పురుషార్థం కావాలి. నదిలో చేపవలె ఎదురీదటానికి సాహసాన్ని కూడగట్టుకోవాలి. మానవుడు తన జీవితంలో ఎల్లప్పుడూ ఉన్నతి మార్గాన్నే పట్టుకోవాలి. భగవంతుని యొక్క నిర్దేశం ఏమంటే "ఉద్యానంతే పురుష నావయానమే" "ఓ మానవుడా నీవు జీవితంలో పైకి ఎదుగు, క్రిందికి దిగజారవద్దు" అని.

జీవితంలో ఉన్నతమార్గంలో పయనించడానికి పరమేశ్వరుని ఆశ్రయం అవసరం. ఆయన దైవీగుణాలను మన ఆచరణలో చేర్చుకొనుటయే ఏకైక మార్గం. ఇందుకోసం మానవత్వ సాధన చేయాలి. మానసిక భావాల సవరణ, ఆత్మనిరీక్షణ అనువాటిని జీవితంలో అంగాలుగా చేసుకోవాలి. ఇంతేకాక జాగరూకత, అప్రమత్తతల అవసరాన్ని గుర్తించాలి. వాటి ద్వారానే నియమపాలన చేయగల్గుతాం. మానవుని మానవత్వం అతని మానసిక భావాల ద్వారా, ఔన్నత్యం ద్వారానే తెలుస్తుంది.

ఈ ధర్మపాలన వల్లనే మనిషి మానవుడు అవుతాడు. ఈశ్వరీయ ప్రయోజనాన్ని నెరవేర్చగలుగుతాడు.

★★★

## సత్సంగం - గంగా సమానం

*శ్రీరామకృష్ణ పరమహంస సతీమణి శారదాదేవి మహిళలకు ప్రత్యేకంగా సత్సంగ కార్యక్రమాన్ని నిర్వహించేది. వారిలో అధికశాతం స్త్రీలు ధార్మిక స్వభావులు, సంపన్న గృహాలకు చెందినవారు ఉండేవారు. కాని ఒక వేశ్య కూడా సత్సంగానికి రావడం ప్రారంభించింది. అది చూసి మిగతా మహిళలు చెవులు కొరుక్కోసాగారు. ఆమె రావడం పట్ల తమ అభ్యంతరాన్ని తెలుపుతూ శారదామాతకు ఫిర్యాదు చేశారు. విషయం విన్న మాతాజీ "సోదరీమణులారా! సత్సంగం గంగ వంటిది, ఆ గంగలో కప్పలు, చేపలు ఉన్నంత మాత్రాన గంగ అపవిత్రం కావటం లేదు కదా! కొద్దిపాటి మాలిన్యానికే అశుద్ధమయ్యే గంగ ఇంకేమి పవిత్రం? మీరు సత్సంగ స్థాయిని, శక్తిని తెలుసుకోవడానికి ప్రయత్నించండి. సత్సంగాన్ని గంగామాతగా భావించి దానిలో మీరు మునిగి మీరు పునీతులవ్వండి. ఇతరులను తరించనివ్వండి" అని అన్నారు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**[redacted] అనే సామ్రాజ్యం భావనలోనే విరాజమానం.**

గాయత్రీ విద్య

# గాయత్రీ మంత్ర సాధన-అంతరంగ కాయకల్పం

"నన్ను నరకంలోకి పంపండి – నేను అక్కడ కూడా స్వర్గాన్ని నిర్మించగలను" అన్నాడట ఎమర్సన్ మహానుభావుడు. ఎంత ఆత్మస్థైర్యము, పవిత్రత ఉంటే అంత ధైర్యంగా పలకగలరు? స్వర్గం అంటే ఎక్కడో లేదు మన అంతఃకరణలోని భావంలోనే ఉంది. సమదృష్టిలో, వినయంలోనే స్వర్గం ఉంది. అస్తవ్యస్త వ్యవహారము, నిషిద్ధకర్మలే నరకం. మన వ్యక్తిత్వమే బాహ్య ప్రపంచంలో పరిస్థితులకి రూపం పోస్తుంది. ఉన్నతమైన పవిత్రమైన వ్యక్తిత్వం శాంతినిండిన స్వర్గాన్ని సృష్టిస్తుంది. అంతరంగంలోని ఉచ్చ–నీచ భావనలు బాహ్య ప్రపంచంలో స్వర్గ నరకాలని సృష్టిస్తాయి.

గాయత్రీ మహా మంత్రంలోని మూడవ పాదం "ధియో యోనః ప్రచోదయాత్" పవిత్ర బుద్ధికి నిర్మల జీవనానికి ప్రేరణ ఇస్తుంది. మానవునికి సద్బుద్ధి ఉండటమే ఒక సంపద. సద్బుద్ధి ద్వారానే సంస్కారవంతమైన, ఉన్నతమైన, పవిత్ర వ్యక్తిత్వం నిర్మాణం జరుగుతుంది. నరుడు నారాయణగా మారాలంటే అతనికున్న సద్బుద్ధి సహకరిస్తేనే జరుగుతుంది. సామాన్య మానవుణ్ణి ఒక ఉన్నత శిఖరం మీదకు చేర్చగల సామర్థ్యం సద్బుద్ధికే ఉంది. ఆధ్యాత్మ ప్రపంచంలో పరిశోధన ఫలంగా మనకు లభించిన ఈ నిధిని "గాయత్రీ మహామంత్రం" అంటారు. ఈ మహామంత్ర జపం, పురశ్చరణ, ఆరాధన మనిషిలోని బుద్ధిని స్వచ్ఛపరిచి, పవిత్రీకరించి ఉత్కృష్ట స్థితికి తీసుకుపోతుంది. కామక్రోధ మోహ మద మాత్సర్యాలలో చిక్కుకున్న బుద్ధి మనిషిని అథః పాతాళాలకు అణచివేస్తుంది. గాయత్రీ మహామంత్రం 'ధీ' శక్తిని ప్రేరేపిస్తుంది. ఉత్తమ మార్గంలోనికి **ప్రచోదయాత్** నెట్టివేస్తుంది. మహామంత్రం చివరి పాదంలో అంతఃకరణ శుద్ధి కోసం, సన్మార్గగామిని చేయడం కోసం పరమాత్మునికి చేసే ప్రార్థన ఉంది. మన దృష్టి నరకం కంటే నీచమైనది. పరిస్థితులు నరకప్రాయంగా అనిపించినప్పటికి మన ఆలోచనలు అంతకంటే చెడుగా ఉండవచ్చు. ప్రపంచం అద్దం వంటిది. దానిలోకి తొంగిచూస్తే మన ప్రతిబింబం కనిపిస్తుంది. కోపిష్టి మనిషికి సర్వ జన సముదాయం కొట్టుకుంటూ, తిట్టుకుంటూ ఉన్నట్లు కనిపిస్తుంది. అబద్ధాలకోరుకు అందరూ అబద్ధాలు చెప్తున్నట్లే అనిపిస్తుంది. విశ్వాసఘాతకునికి అందరూ విశ్వాసఘాతకులలాగా కనిపిస్తారు. పనిపాటలేకుండా తిరిగే సోమరికి ప్రపంచంలో మనుష్యులందరూ ఊరికే తిరుగుతున్నట్లనిపిస్తుంది. వ్యభిచారులు, దొంగలు బందిపోట్లు, పిచ్చివంటి మనోవికారాలు కలిగిన వ్యక్తులు అందరూ తమవలే ఉన్నారనుకొని వారిపై దోషారోపణ చేస్తూంటారు. కళ్ళు తెరచి, తనతప్పు తాను తెలుసుకొంటే చెడ్డవాళ్ళుగా కనపడిన వారంతా మంచివాళ్ళుగా కనిపిస్తారు.

తప్పులు వెదకడం ప్రారంభిస్తే ప్రతివ్యక్తిలోనూ లోపాలే కనిపిస్తాయి. మనకు వాళ్ళు ఎప్పుడు, ఎక్కడ, ఎంత ఉపకారం చేసారో గుర్తు చేసుకొంటే ఆ ఉపకారాల బరువు మనమీద ఎంత ఉందో తెలుస్తుంది. దృష్టి వక్రంగా ఉంటే మన బంధువులలో, స్నేహితులలో కూడా లోపాలు కనిపిస్తూనే ఉంటాయి. భార్య పొరపాటున ఏదైనా తప్పు చేస్తే ఇక దాన్ని పదే పదే ఎత్తి చూపిస్తూ ఉంటే భార్య పనికిమాలిన దానిలాగా కనిపిస్తుంది. ఆవిడ చేసిన సేవలన్నీ గంగలో కలిసిపోతాయి. అమ్మ–నాన్న ఎప్పుడైనా పరుషంగా మాట్లాడితే ఇకవారు చేసిన త్యాగాలు, బలిదానాలు క్షణంలో మర్చిపోతారు. వాళ్ళు పిల్లలకి శత్రువులుగా కనిపిస్తారు. మనవాళ్ళు–మిత్రుల విషయంలో కూడా ఇలానే జరుగుతుంది. చిన్న పొరపాటునే పట్టుకు వ్రేలాడితే క్రోధం పెరిగిపోతుంది. వారి మంచితనం అంతా మర్చిపోతారు. చెడు గురించి ఎక్కువగా తలచుకొంటూ ఉంటే మిగిలేది దుఃఖమే! దానికి బదులు మన దృష్టి కోణాన్ని మార్చుకొంటే ప్రపంచమంతా స్నేహంతో, ప్రేమతో ఆనందంలో నిండి ఉన్నట్లు కనిపిస్తుంది.

స్వచ్ఛమైన దృష్టికోణం లేకపోవడం వల్ల సమస్యలు అరటిపిలకల్లా పుట్టుకొస్తూ ఉంటాయి. ఏదైనా ఒక వస్తువు మనకి లేకపోయినా, సంపాదించడం కష్టమయినా దేవుణ్ణి, అదృష్టాన్ని దుమ్మెత్తిపోస్తాం. కాని ప్రతిక్షణం భగవంతుడు మనకిచ్చే ఆనందాన్ని, సుఖాన్ని మర్చిపోతాం, గుర్తించం. బాధ, దుఃఖం రాగానే కుంగిపోతాము. బాధలు సమస్యలు మనలోని శక్తిని, ధైర్యాన్ని పీల్చి వేస్తాయి అనే మాట ఆలోచించరు. ఈశ్వరుడు కరుణామయుడు. ప్రపంచంలోని జీవకోటి అంతా వారి సంతానమే! తండ్రి బిడ్డలపై కఠినంగా ప్రవర్తిస్తాడా? ఎండా–

[redacted] అన్ని జాడ్యాలకు మూలం బద్ధకం.

వానా, వెలుగు-చీకటి, కష్టం-సుఖంలానే ఒక ఆపద వచ్చిందంటే దాని వెనక ఒక లాభం, ఒక సుఖం ఉందని గుర్తించలేరు. ఉపాధ్యాయుడు రెండు దెబ్బలు వేసినా తల్లి-తండ్రి రెండుమాటలని దండించినా, వైద్యుడు కత్తిపుచ్చుకుని శరీరంలో కుళ్ళిన భాగాన్ని కోసి తొలగించినా మన మంచి కోసమే! కష్టాల వెనుక భగవంతుని చల్లని ఆశీర్వాదం, వరాలు దాగి ఉన్నాయని మర్చిపోకూడదు. ఈ అవగాహన గాయత్రీ ఉపాసన వల్లే మనకు ప్రాప్తిస్తుంది. గాయత్రీ ఉపాసకులు ఏ భయంకర ఘటనకు భయపడరు. దారిలో వచ్చిన అవరోధాన్ని సునాయాసంగా తొలగించే ప్రయత్నం చేస్తారు. అంతరంగ దృష్టి మహత్వం వలన ఘటనలు రోజూ మారుతూ ఉంటాయని నమ్ముతారు. అవి ఎండా-నీడ లాగా భావిస్తారు. వాటిని పట్టించుకోరు. జీవితం అంటే శాంతికి, సంతోషానికి, ఆనందానికి నిలయం. ఆడుతూ-పాడుతూ జీవితం గడుపుతారు. శోక, మోహ, దుఃఖ, భయ, క్రోధ, ఆవేశాలలో చిక్కుకోరు. కర్తవ్యమనే మార్గంలో నిక్షిప్తంగా ముందుకు పోతూ ఉంటారు. మానసిక ఉద్వేగాలకి లోనుకారు.

సాధకునికి ఎదురైన బాధలను, సమస్యలను ఎదుర్కొనడానికి కావలసిన శక్తిని గాయత్రీ మంత్రంలోని చివరి పాదం ప్రసాదిస్తుంది. అతని ధ్యాస కర్తవ్యపాలనయందే ఉంటుంది. ఆధ్యాత్మికతకు మూలమైన లక్ష్యం అంతరంగాన్ని సంస్కరించుకోవడం, పరిశోధన చేసుకోవడం. గాయత్రీలోని మూడవ చరణం ఇచ్చే సందేశం ఇదే! గాయత్రీ ఉపాసన వలన అనుకూల ప్రతికూల పరిస్థితులను సమాన రూపంలో చూడగల సామర్థ్యం వస్తుంది. మంచిగా బతకాలని వాంఛించడం, ఎల్లవేళలా పరిస్థితులను తెలివిగా ఉపయోగించుకోవడం, దౌర్భాగ్యమయిన స్థితిని కూడా ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉండడం గాయత్రి నేర్పిస్తుంది. దుర్భర కష్టాలు మన పురుషార్థాన్ని, సహనాన్ని పరీక్షించేందుకు, వచ్చాయనుకొని, వాటిని చూసి భయపడకుండా ఉంటే దుఃఖం కలుగదు. మన సంతోషాన్ని అడ్డుకోదు. ఆనందంగా ఉండటమే మన స్వభావంగా అనుకొంటే, సద్బుద్ధిని ఆశ్రయిస్తే, చిన్న చిన్న విషయాలకి మనసు చిట్లిపోదు. జీవితం ఆటగా భావించాలి. క్రీడాకారుడు ఉత్సాహంతో ఆడతాడుగాని జయాపజయాలు లక్ష్యపెట్టడు. జీవితం నాటకంలో పాత్రలా నడిపివేయాలి. ఆటగాడుగా, నటుడుగా జీవితాన్ని గడిపేయాలి. మన బాధలు, కష్టాలు ఎందరికో వచ్చిన వానికంటే చాలా చిన్నవి. ఇలా అనుకొని ఉన్న సౌకర్యాలతో తృప్తిపడాలి. దుఃఖాలను పట్టించు కోకూడదు.

గాయత్రి చివరి చరణం అంతఃకరణాన్ని పరిశోధించి, మార్పు చేస్తుంది. సద్భావనలను తెలుసుకొనే శక్తి మనసుకు కలిగిస్తుంది. బాహ్య ప్రపంచంలో కనపడే నరకం వంటి పరిస్థితులను, స్వర్గీయ పరిస్థితులకు మన దృష్టికోణమే ఆధారం. జీవితంలో విజయం సంపాదించాలంటే మనస్సును గుప్పిటలో పెట్టుకోవాలి. అప్పుడు ప్రపంచమంతా సత్, చిత్, ఆనందమయంగా కన్పిస్తుంది. గాయత్రీ మంత్రం మనకిచ్చే వరం ఇదే! అది ప్రాప్తిస్తే ప్రతివారు ఎమర్సన్ లాగానే "నన్ను నరకంలో పడవేసిన నేను అక్కడ స్వర్గం నిర్మిస్తాను" అని చెప్పగలుగుతారు. గాయత్రీ ఉపాసనలో ఇటువంటి ఆత్మస్థైర్యం తప్పక ప్రాప్తిస్తుంది. గాయత్రి అంతరంగానికి, బాహ్య ప్రకృతికి శ్రీరామరక్ష వంటిది. ఉపాసనే ఊతకర్ర.

*- అఖండజ్యోతి, నవంబర్, 2005*

*- అనువాదం : శ్రీమతి జ్ఞాన ప్రసూన*

## అహంకారం పోవాలి

*ఒక సాధువు, బందిపోటు ఒకే రోజున మరణించడం సంభవించింది. వారు యమధర్మరాజు సభలో హాజరు పరచబడ్డారు. దొంగ తను చేసిన తప్పులను ఒప్పుకొని తగిన శిక్షణ విధించమని శిరస్సు వంచి నిలబడ్డాడు. సాధువు తన పుణ్యకర్మలను చెప్పుకుంటూ, తక్షణం స్వర్గద్వారాలు తెరచి ఉంచమని ఆదేశించాడు. యమధర్మరాజు దొంగతో ఈ రోజు నుండి నీవు సాధువుకు సేవ చేయి, ఇతని సత్సంగం వలన నీలో ఉద్భవించిన సద్భావనలు మరింత ప్రకాశవంతం అవుతాయని అన్నాడు. దొంగ ఆనందంగా అంగీకరించాడు. కాని సాధువు ఆ ఆదేశాన్ని తిరస్కరించి ఇతని సాంగత్యం వలన భ్రష్టుపట్టిపోతాను. కాబట్టి మీ నిర్ణయం నాకు నచ్చలేదు అన్నాడు. యమధర్మరాజు గంభీరంగా తలపంకించి "అయితే ఈ రోజు నుండి నీవే ఈ దొంగకు సేవ చేయి అప్పుడు గొప్పవాడిననే అహంకారం నీలో నశిస్తుంది" అన్నాడు.*

*ఎంతటి తీవ్రసాధనలు చేసినప్పటికి అంతరంగం లౌకిక ఆకాంక్షలతో నిండి ఉండేవారికి చివరకు ఇదే గతి పడుతుంది.*

*- ప్రజ్ఞాపురాణం నుండి*

**[redacted]ఃఖాలు మన చేసిన పాపాల ఫలితాలు.**



### బాలల భవితకు బంగారు బాట-12

# కార్యసాధనకు కావలసింది సహనం

విజయకుమార్ ఉద్యోగం వెతుక్కుంటూ వెళ్లి ఒక అధికారిని కలిశాడు. ఆ అధికారి విజయకుమార్ విద్యావంతుడనీ, తెలివిగలవాడనీ, సహనశీలి అనీ, బుద్ధిమంతుడనీ ముందుగానే విని ఉన్నాడు. సాదరంగా ఆహ్వానించాడు. ఇతని విద్యార్హతలన్నీ పరిశీలించాడు. తాను సర్దుతూ ఉన్న బీరువాను చూపించి "నాయనా! కాస్త నా పనిలో సహాయం చేయగలవా?" అడిగాడు. విజయకుమార్ వినయంగా బీరువాను చక్కగా సర్దిపెట్టాడు. అతడు సర్దుతూ ఉన్నంతసేపు పనిలో చూపించే నేర్పును, ఓర్పును పరిశీలించాడు అధికారి. "మంచిది నాయనా! రేపు వచ్చి కనిపించు అన్నాడు. మరునాడు ఆనందంతో వచ్చి కలిశాడు విజయకుమార్. ఆమాటా ఈ మాటా మాట్లాడి చివరలో ఏదో పని అప్పచెప్పాడు. విజయ్ పని పూర్తి చేశాడు. కాని అధికారి మాత్రం ఉద్యోగం సంగతే ఎత్తలేదు. "రేపు రా నాయనా!" అన్నాడు. విజయకుమార్ లేచి వెళ్లిపోయాడు.

వరుసగా 4,5 రోజులు ఇలాగే జరిగింది. అవసరం తనది. పైగా సహజంగా వినయశీలి. అందువల్ల ఓపిగ్గా వస్తూనే ఉన్నాడు. కానీ మనస్సులో కొద్దిగా బాధకలిగింది. ఐనా 6వ రోజు బయలు దేరి వస్తున్నాడు. త్రోవలో ఒకతను నెత్తిమీద పాలకుండ, భుజం మీద ఖాళీ కావడితో వస్తూ కనిపించాడు. అతను అటూ ఇటూ చూసి నెత్తి మీద కుండను క్రింద పెట్టాడు. ఆ కుండ బరువుకు తగిన ఒక బండరాయిని తీసుకున్నాడు. కావడిలో రెండు వైపులా రెండూ పెట్టుకున్నాడు. భుజానికి ఎత్తుకున్నాడు. విజయకుమార్‌కి ఇది వింతగా అనిపించింది. ఎందుకు ఇలా చేస్తున్నావని అడిగాడు. "నేను రోజూ రెండు కుండలతో పాలు తెస్తూ ఉంటాను. ఈ రోజు ఒక్క కుండ మాత్రమే దొరికాయి. నెత్తిమీద పెట్టుకోవడం అలవాటు లేక నడవలేకపోతున్నాను. పాలు చిందిపోతున్నాయి. అందువల్ల బండరాయి పెట్టుకున్నాను'' అని చెప్పాడు. విజయకుమార్‌కి ఒక్కసారిగా ఏదో స్ఫురించింది. ఉత్సహంగా నడుచుకుంటూ ముందుకు సాగాడు." పాలు అమ్ముకోవడానికి రాళ్లు మోస్తున్నాడు అంటే అర్థం ఏమిటి? అనుకున్నది సాధించాలంటే సహనం కావాలి. ప్రతి చిన్న విషయాన్ని భారం అనుకోకూడదు. అవసరం లేకపోయినా రాయిని మోయడం వల్ల పాలకుండ చిందకుండా నిలకడగా ఉంది'' అని ఆలోచించుకుంటూ గమ్యాన్ని చేరుకున్నాడు.

ఎప్పటిలాగానే ఆ రోజూ ఏదో పని అప్పగించాడు. రోజూకన్నా హుషారుగాను, జాగ్రత్తగానూ పని పూర్తి చేసి వెళ్లిపోయాడు. ఈ విధంగా ఒక వారం గడిచిపోయింది. ఒక రోజు వెళ్లిపోబోతున్న విజయకుమార్‌ని వెనక్కు పిలిచాడు. కూర్చోమన్నాడు. ఆపాయింట్‌మెంట్ ఆర్డర్ చేతిలో పెట్టాడు. అతని నేర్పును, ఓర్పును మెచ్చుకున్నాడు.

"నీ సహనాన్ని పరీక్షించడానికే ఇన్ని రోజులూ నీ చేత పనులు చేయించుకున్నాను. రేపటి నుండి నీవు చేయబోయే పనికి ఓర్పు చాలా అవసరం. ఓర్పుతో పాటు పనిలో నీ నైపుణ్యాన్ని గమనించాను. ఇదే ఓర్పుతో నేర్పుగా నీ పనిని చేసుకో. నీకు మంచి భవిష్యత్తు ఉంది. నేను పెట్టిన ఈ పరీక్షలో నీవు పూర్తిగా గెలిచావు. వచ్చి విధులలో చేరిపో" అంటూ భుజం తట్టి పంపించాడు.

విజయకుమార్ విజయగర్వంతో ఇంటి ముఖం పట్టాడు. ''అవసరాన్ని బట్టి కార్యసాధకుడు ఒకసారి నేలమీద పడుకుంటాడు. మరొక్కసారి పూల పాన్పుమీద పడుకుంటాడు. ఒకసారి శుభ్రమైన బట్టల్ని ధరిస్తాడు. మరొక్కసారి మురికి బట్టల్ని ధరిస్తాడు. ఒకసారి రుచికరమైన ఆహారాన్ని భుజిస్తాడు. మరొక్కసారి గంజి నీళ్లతోనే సరిపెట్టుకుంటాడు. ఏది ఏమైనా సాధకుడు తన లక్ష్యాన్ని మరచిపోడు" భర్తృహరి చెప్పిన సుభాషితాన్ని మననం చేసుకుంటూ ఇంటికి వెళ్లాడు.

బాలలూ! విన్నారు కదా! **లక్ష్యాన్ని సాధించాలంటే సహనం ఉండి తీరాలి.**

**కం॥తలచిన దానిని సాధించ**
**వలెనంచు తగిన పనులను వరుసగ చేయన్**
**తెలియని విఘ్నాలు కలుగు**
**అలయక చేయుచు విజయము నందుము బాలా!**

– మధుర కవయిత్రి, పొన్నూరు హైమవతీ శాస్త్రి

[redacted] ధన సంపాదనలో తృప్తి ఉండాలి.

ప్రజ్ఞోపనిషద్ : ప్రథమ మండలం-చతుర్థోధ్యాయం

# జీవన దేవతా సాధన

**తృతియే దివసే సత్ర ఆరణ్యక ఋషిః స తు**
**శృంగీ పూర్వ ప్రసంగం తం స్మారయన్నాహ్నికం తతః** (1)

శృంగి ఉవాచ–
**ప్రాప్తీక్షిత్వాం నవీనాం తాం జిజ్ఞాసా నతిపూర్వకమ్**
**కాసా దేవతా యస్యా నరస్తూపాసనేన హి** (2)
**ప్రత్యక్షం ఫలమాప్నోతి సుఖీ భవతి సోన్నతః**
**మహాప్రజ్ఞో పిప్పలాదో జగాద మానవస్య హి** (3)

**టీకా :–** మూడవ రోజు ఆరణ్యక సత్రంలో శృంగి ఋషి క్రిందటి రోజు చెప్పిన విషయములు గుర్తుచేస్తూ క్రొత్త విషయములను వినయపూర్వకంగా వివరిస్తున్నారు. శృంగి అడిగాడు– ఏ దేవత ఉపాసన వల్ల ప్రత్యక్ష ఫలములను, సుఖమును, ఉన్నత స్థితిని పొందగలరు?

**జీవనం దేవతా నూనం ప్రత్యక్షమన్యదేవతాః**
**పరలోకే కృపాం కుర్వన్నాత్మనో జీవనం పరమ్** (4)
**సుసంస్కృతం చ సజ్జం చ కర్తుంచేత్క్రియతే భృశమ్**
**ఉపాసనా తతస్తస్యా లాభాస్త్వస్మిన్ హి జీవనే** (5)
**ప్రాప్యన్తే పరలోకేపి సన్దేహో నాణురప్యహో**
**అత ఆవశ్యకం యత్తజ్జీవనం సంస్కృతం భవేత్** (6)

**టీకా :–** మానవ జీవనము స్వయంగా ప్రత్యక్ష దేవతే. అన్య దేవతల కృప పరలోకంలో లభిస్తుంది. కాని తన జీవనమును అందముగా, సంస్కార వంతము కొరకు చేసే ఉపాసన వలన లాభం ఈ జీవితంలోనే కాక పరలోకంలో కూడా లభిస్తుంది. దీనిలో అణుమాత్రమైనా సందేహం లేదు. ఈ విధంగా జీవితమును సంస్కారవంతంగా తీర్చి దిద్దుకోవడం ఆవశ్యకము.

శృంగి ఉవాచ–
**సోత్సుకజ్ఞాతుమైచ్ఛత్స ఋషిః శృంగీ కథం చసః**
**దేవో జీవనరూపీ తు పూజ్యేభ్యోర్చ్యో విబోధమ్** (7)
**ఉపచారః క్వోత్ర గ్రాహ్యో యద్ వరదానం దదాతుసః**
**ప్రసన్నః కాని చైవాయం వరదానాని యచ్ఛతి** (8)
**ఉపేక్షయా చ రుష్టశ్చేత్తతో హానిశ్చ కీదృశీ**
**ఆపతత్యపి చెత్క్రుద్ధో దురాచారఫలేన సః** (9)
**కస్యాశంకా హ్యనిష్టస్య మహాభాగ విబోధయ**
**మూర్మప్రసంగమేత త్తు విస్తారాదృషిపుంగవ** (10)
**విధేస్తస్య నహి జ్ఞానం సర్వసాధారణస్య తు**
**మర్మస్పర్శీనానేన ప్రశ్నేన స ఋషీశ్వరః** (11)

**టీకా :–** జీవన దేవత పూజ, అభ్యర్థన ఎలా చెయ్యాలో తెలుసుకోవాలనే ఆతృతతో శృంగిఋషి ఉన్నారు. ఆమె వరదానం పొందటానికి, ప్రసన్నం చేసుకోవడానికి ఎటువంటి పద్ధతి అవలంబించాలి? జీవన దేవత ప్రసన్నురాలైతే ఏ వరదానం ఇస్తుంది? మనం పట్టించుకోకపోతే లేదా ఆమెకు కోపం వస్తే ఎటువంటి అరిష్టం కలుగవచ్చు? ఓ ఋషిశ్వరా! ఈ రహస్యములను మాకు వివరంగా అర్థం అయ్యేటట్లు చెప్పండి. దీని విధివిధానములు సామాన్య జనులకు తెలియనే తెలియదు. ప్రశ్నలకు ఋషి శ్రేష్ఠుడు పిప్పలాదుడు గంభీరంగా ఈ విధంగా అన్నాడు.

**మహాప్రజ్ఞాః పిప్పలాదః సగాభీర్య జగాద చ**
**జిజ్ఞాసవః ఇహ శృంగియుతా మాన్యా మనీషిణః** (12)
**ధ్యానేన శ్రూయతాం దేవః జీవనం ఫలదాయకః**
**ప్రత్యక్షం తేన సార్థ చ వ్యవహారో యథా యథా** (13)
**హస్తామలకవత్స స్వం ప్రభావం పరిచాయయేత్**
**ప్రభావం తస్య మహత్త్వం ద్రష్టుం సర్వత్ర సంభవేత్** (14)
**జీవనం భరితం నూనమనుదానైరజస్రగైః**
**యేషాం సదుపయోగేన పరిణామాః సముత్సాహాః** (15)

**టీకా:–** శృంగి ఋషి, ఉపస్థితులైన మనీషులారా ధ్యాన పూర్వకంగా వినండి. జీవన దేవత ప్రత్యక్ష ఫలదాయిని. దీనితో చేసే ప్రతి పని తన ప్రభావమును అప్పటికప్పుడు స్పష్టంగా చూపిస్తుంది. దృష్టి సారిస్తే దీని ప్రభావ మహత్వమును ప్రతి చోట చూడవచ్చు. జీవనం అంతులేని బహుమతులతో అనుక్షణం నిండి ఉన్నది. దీనిని సదుపయోగం చెయ్యడం వల్ల ఉత్సాహం పెంపొందించే ఫలితాలు ప్రాప్తిస్తాయి.

**భ్రాంన్తేర్వశానుగాస్తస్య మహత్వం నైవ మానవాః**
**జానన్తియాః సమాశ్రితోపలబ్ధిర్దైవ జీవనమ్** (16)
**జీవ్యతేత్రామృతం యచ్చ ప్రాపయన్యస్తతాం తు తత్**
**అసంయమస్య ఛిద్రేభ్యశ్చ్యావయన్తస్తు హన్త తే** (17)
**నింబుకం చ్యుతనీరం తేనుగచ్ఛన్తస్తథైవ చ**
**కంకాలశేషకామాస్తే దారిద్రయం దూషయన్తితు** (18)

[redacted] వాడిని నిందించకు, అతడే నీకు మార్గదర్శి.

**టీకా :-** మనుష్యులు దీని మహత్యమును భ్రాంతి కారణం వల్ల అర్థం చేసుకోలేదు. జీవనమును సవ్యంగా జీవించరు. వీరు అమృతాన్ని అసంయమ ఛిద్రముల (రంధ్రాలు) ద్వారా పోగొట్టుకొని అస్తవ్యస్తం చేసుకుంటారు. రసం పిండిన నిమ్మకాయ డిప్పలవలె అయిపోతారు. దరిద్రతతో ఏడుస్తూ కూర్చుంటారు.

**జీవనం కామధేనుర్గౌః పాతుం దుగ్ధం తదీయకమ్**
**కఠినం నో సరన్ధ్రేషు పాత్రేషు యది దుహ్యతే (19)**

**తర్హి సౌభాగ్యలాభస్తు కథం తస్యాప్తుమిష్యతే**
**అసంయమస్య ఛిద్రాణి రోద్ధుం శక్యాని చేత్తదా (20)**

**హానిః సా న భవేద్యస్యా కారణాదీశ్వరేణ నా**
**నిర్మితః సర్వసంపన్నో దరిద్రాతీహ దీనవత్ (21)**

**సంఘర్షస్థేయశక్తిః సా క్షీయతే తు యతస్తతః**
**మానవః సహతే కాష్టాన్యనేకాని చ సర్వతః (22)**

**టీకా:** జీవనమే కామధేనువు, దీని పాలు త్రాగేందుకు ఏమి కష్టం లేదు. కాని చిల్లి ఉన్న పాత్రలోకి పిండితే దీని సౌభాగ్యం ఎలా లభ్యమవుతుంది. అసంయమాలనే చిల్లులను మూసివేస్తే జీవనం యొక్క లాభాలను పొందగలరు. లేకపోతే ఈశ్వరునిచే సర్వసంపన్నునిగా తయారుచేయబడ్డ మనిషి దీనుడుగా, దరిద్రుడుగా తయారవుతాడు. అనేకానేక కష్టములను సహించవలసి వస్తుంది.

**ఋషిః శృంగీ పప్రచ్ఛాతః పరం కతివిధాని తు**
**అసంయమస్య ఛిద్రాణి భగవన్నభిమతాని తే (23)**

**కథం తేభ్యో జీవనస్య రసశ్చ్యోతతి మానవాః**
**గృహ్ణన్త్యసంయమంకిం తే పరిణామాత్ విదన్తి నో (24)**

**విబోధయ రహస్యం మే భూతలం స్వర్గతాం వ్రజేత్**
**సమాప్తిం దుఃఖదారిద్రయం యేన గచ్ఛేచ్ఛ సర్వదా (25)**

**టీకా :** శృంగి ఋషి తిరిగి ప్రశ్నించారు. అసంయమనే చిల్లులు ఎన్ని రకాలు? వాటి వల్ల జీవనము ఏ విధంగా రసవిహీనమవుతుంది? ఈ అసంయమాలను మనుష్యులు ఎందుకు పాటిస్తారు? దాని వల్ల వచ్చే దుష్పరిణామాలను ఎందుకు అర్థం చేసుకోరు? ఈ రహస్యములను అర్థం చేసుకుంటే ఈ భూమి స్వర్గం అవుతుంది. దుఃఖం, దరిద్రం సమసిపోతాయి.

**పిప్పలాదః ప్రశమయన్నోత్సుక్యం సారగర్భితమ్**
**ఉత్తరం ప్రాదదాత్తత్ర వాచా సంయతయా తతః (26)**

పిప్పలాద ఉవాచ–
**ప్రసన్నముద్రయోవాచ సమ్పదో జీవనస్య తు**
**క్షేత్రాణి సన్తి చత్వారి శ్రూయతాం తన్మునీశ్వరాః (27)**

**శక్తిరిన్ద్రియసంబద్ధా శక్తిః సమయసంయుతా**
**విచారశక్తిస్తుర్యా చ శక్తిః సాధన రూపిణీ (28)**

**ఆధ్యాస్తిస్త్రః ప్రదత్తాస్తా ఈశ్వరేణ ప్రయత్నతః**
**తిస్రుణాం భౌతికే క్షేత్రేతుర్యార్జ్యా పౌరుషాశ్రయా (29)**

**టీకా :** మహాప్రాజ్ఞ పిప్పలాదుడు సారగర్భిత వాణితో, ప్రసన్న ముద్రతో ఉత్సాహంగా ఇలా చెప్పారు. జీవన సంపదకు నాలుగు క్షేత్రాలు ఉన్నాయి. 1. ఇంద్రియ శక్తి 2. సమయశక్తి 3. ఆలోచనా శక్తి 4. సాధనా శక్తి. మొదటి మూడు ఈశ్వరుడు ఇచ్చినవి. నాల్గవది ఈ మూడింటిని కలిపి భౌతిక క్షేత్రంలో పురుషార్థం (ప్రయత్నం) ద్వారా సంపాదించుకోవాలి.

**ఇంద్రియేషు దశస్వేవ ప్రధానే ద్వే తథేన్ద్రియే**
**జిహ్వోపస్థేతి సంజ్ఞే చహారంజిహ్వా వివేకతః (30)**

**గలాధశ్చారయత్యేషా శబ్దానుచ్చారయత్యపి**
**రతిర్మాస్త్యుపస్థస్య సన్తతేః కారణాత్తథా (31)**

**స్త్రా వత్యాగః సంయమస్తు జిహ్వాయాస్తనుస్వాథ్యదః**
**మనోబలం తథాక్షుణ్ణం జనేన్ద్రియ సంయమాత్ (32)**

**జిహ్వా సంయమజోజీర్ణో దౌర్బల్యం వర్ధతే యతః**
**రతికర్మణి తథాతుర్యమయోగ్యాం సంతతిః తథా (33)**

**యౌనరోగాశ్చిన్తనం చ వికృతం వర్ధయత్యలమ్**
**ఉభయాసంయమే స్వాస్థ్యం శారీరం మానసం పతేత్ (34)**

**టీకా :** పది ఇంద్రియములలో రెండు ముఖ్యమైనవి. ఒకటి జిహ్వా (నాలుక) రెండవది జననేంద్రియం. జిహ్వా ఆహారాన్ని రుచి చూచి గొంతులోకి పంపుతుంది, మాట్లాడటానికి పనికివస్తుంది. జననేంద్రియముల పని రతికర్మ ద్వారా సంతానోత్పత్తి, మూత్ర విసర్జన. జిహ్వా సంయమం (రుచి మీద అదుపు) శారీరక ఆరోగ్యానికి అవసరమౌతుంది. జననేంద్రియం సంయమం (అదుపు) వల్ల మనోబలం క్షీణించదు. నాలుక మీద అదుపు లేకపోవడం వల్ల అజీర్తి, దుర్బలత, రోగాలు ఎక్కువవుతాయి. రతి కర్మలో ఆతృత వల్ల పనికిరాని సంతానం, రోగములు, వికృత ఆలోచనల పెరుగుతాయి. ఈ రెండింటి అసంయమము వల్ల శారీరక మానసిక ఆరోగ్యం పాడవుతుంది.

*– గురుదేవుల వాఙ్మయం నుండి*
*అనువాదం : శ్రీమారెళ్ళ కామరాజు*

[redacted] సుఖాన్ని పంచిపెట్టు, దుఃఖం దానంతటదే కట్టు.

## యుగ గీత-3 : మొదటి అధ్యాయం - ఉత్తరార్ధం

# ఆత్మ సంతాపము

పరమపూజ్య గురుదేవుల ఆలోచనా సరళికి అనుగుణ్యమైన శ్రీమద్భగవద్గీత యొక్క వాఖ్యానాన్ని ధారావాహికగా అందివ్వడానికి ప్రయత్నిస్తున్నాము. యుగశక్తి గాయత్రి ఆగస్టు 2010 సంచిక నుండి సమగ్ర గీత యొక్క వ్యావహారిక సమీక్షని అందిస్తూ సాగుతోంది. కిందటి సంచికలో మొదటి అధ్యాయమైన విషాద యోగము యొక్క పూర్వార్ధముపై చర్చించాము. ఎలాంటి పరిస్థితి ఎదురైనా సమగ్రంగా ఆలోచించాలని వేదవ్యాస మహర్షి గీత యొక్క శ్లోకాల ద్వారా మనకి నేర్పిస్తున్నారు. పరాక్రమము, వీరత్వము, బలము అవసరమే. కాని వివేకపూరిత ఆలోచనతో జీవన సంగ్రామంలో అడుగుపెడితే ఎక్కడా ఎటువంటి కష్టం రాదు. భవిష్యత్తులో ధైర్యవంతులు, దృఢసంకల్పం కలవారు, శౌర్యం నిండిన లోకనాయకులు చాలా అవసరం. ఇటువంటి వారే నిజమైన శిష్యత్వాన్ని జాగృతపరచి లోకశిక్షణ మొదలుకొని నవనిర్మాణం కూడా చేయగలరు. ఈ లక్షణాలన్నీ అర్జునుడిలో కనిపిస్తాయి. అర్జునుడు మనందరికీ ఒక ఆదర్శ నాయకుడి రూపంలో ప్రత్యక్షమవుతాడు. ఈ సందర్భంలోనే మొదటి అధ్యాయాన్ని గురించి మరింత తెలుసుకుందాం.

మొదటి అధ్యాయం యొక్క గొప్పతనమేమిటంటే ఇరు సైన్యాలలోని యోధుల పరిచయంతో పాటు వారి మానసిక స్థితుల విశ్లేషణ కూడా చక్కగా ఇవ్వబడింది. ఆ తరువాత అర్జునుడు తనకు సారథిగా ఉన్న శ్రీకృష్ణ భగవానునితో ఇలా అన్నాడు. హే దేవా! నన్ను రెండు సేనల మధ్యకు తీసుకుని వెళ్ళు, **'సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయమే చ్యుత' (21),** యుద్ధ క్షేత్రంలో రణకాంక్షతో నిలిచి ఉన్న విపక్షాల యోధులను చక్కగా పరిశీలించి ఎవరెవరితో ఏ విధంగా యుద్ధం చేయాలి అనేది చూసుకునేంత వరకు రథాన్ని అక్కడే నిలుపు.

ఇది విషాదానికి ముందు వచ్చే స్థితి. మొదట్లో చర్చించిన విధంగా, అన్ని పరిస్థితులను సమగ్రంగా విశ్లేషణ చేసిన స్థితి. ఈ ప్రారంభిక సమీక్ష తరువాత మనం ఇప్పుడు అర్జునుడి మానసిక స్థితి గురించి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. అర్జునుడిని దుర్యోధనుడితో పోల్చే ప్రయత్నం చేద్దాం. మొదట్లో దుర్యోధనుడు భీష్మ పితామహుడితో, ద్రోణాచార్యుడితో చేసింది వ్యంగ్య వర్ణనే కాదు, మమకారంతో తమ శౌర్యాన్ని ఎక్కడ మర్చిపోయారో అని పరోక్షంగా ప్రశ్నించడం. అతని ఈ ప్రవృత్తి వల్లనే అతనిలో శిష్యత్వం కాదు కదా మానవత్వం కూడా వికసించేలేకపోయింది. పాండవులలో యుధిష్ఠరుడున్నాడు, కాని అతను ధర్మరాజు అకర్మణ్యుడు. అతను తలచుకుంటే మహాభారత యుద్ధమే ఆగిపోయేది. వివాహమైన తరువాత ద్రౌపతితో పాటు పాండవులు తిరిగి వచ్చాక భీష్ముడు రాజ్యశాసనసభను నిర్వహించి పాండు పుత్రులకు రాజ్యం ఇచ్చేయాలని తీర్పునిచ్చాడు.

భీష్ముని మాటలను ఎవరూ కాదనలేదు, ఎదురు చెప్పలేదు, ఖండించలేదు. ఎవ్వరూ ఎదురు చెప్పనప్పుడు యుధిష్ఠరుడు లేచి ధృతరాష్ట్ర పుత్రులకు రాజ్యంలోని సగభాగంపై అధికారమున్నదని అన్నాడు. అంతే, అదే రోజు మహాభారతానికి బీజం పడింది, చరిత్ర లిఖించబడింది. దుర్యోధనుడు కాని యుధిష్ఠరుడు కాని ఆలోచనపరులు కాదు, వ్యవహారకుశలరూ కాదు. అర్జునుడు మాత్రమే రెండు సైన్యాల మధ్య నిలుచుని సమగ్ర విశ్లేషణ చేయడానికి సిద్ధపడ్డాడు. చూడబోతే ఇదంతా భగవంతుని లీల అనే అనిపిస్తుంది. ఈశ్వరుని ఆజ్ఞ లేనిది ఆకు కూడా కదలదంటారు. అందుకే కాబోలు ఎవరినైతే దుర్యోధనుడు కొంత సేపటి క్రితం వ్యంగ్యంగా విమర్శించాడో అటువంటి బంధువుల మధ్య గురువు అర్జునుడిని నిలబెట్టాడు.

సారధి, యోగిరాజు అయిన శ్రీ కృష్ణుడు అర్జునుడి రథాన్ని సరిగ్గా ద్రోణాచార్యుడు, భీష్మపితామహుల ఎదురుగా నిలిపాడు. భీష్ముడిని చూడగానే అర్జునుడికి తన చిన్నతనం గుర్తుకొచ్చింది. ఆయన తనకు పితామహుడు. ఎప్పుడైనా ఆయన్ని నాన్న అని పిలిస్తే, నేను మీ నాన్నకే నాన్నను, తాతను నాయనా అనే వారట భీష్ముడు. అప్పుడాయన్ని తాత అంటూ పిలిచి ఆయన ఒడిలో కూర్చుని గడ్డంతో ఆడుకునేవాడట. ఆ ఆప్యాయత దొరకడం అర్జునుడి సౌభాగ్యం. హిమాలయాలంతటి ఔన్నత్యం ఉన్న వ్యక్తిత్వం కలవాడు భీష్ముడు. పాండవులను కౌరవులను కలపడానికి సర్వాన్నీ త్యజించి తన జీవితాంతం ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఆ మమకారంతో అర్జునుడిని చిన్ననాటి జ్ఞాపకాలు బాధపెట్టాయి. ఎప్పుడైతే మనల్ని జ్ఞాపకాలు బాధపెడుతున్నాయో,

[redacted] మంచి భావాలే మనిషిలోని లోపాలు తొలగిస్తాయి.

పదే పదే ఆత్మవిమర్శ చేసుకోవడానికి వివశులను చేస్తున్నాయో, అప్పుడు మన కషాయ కల్మషాలను కడుగుకునే సమయం ఆసన్నమైనట్టు గుర్తించాలి. ఎప్పుడైనా మనం పరమపూజ్య గురుదేవులు, పరమవందనీయ మాతాజీల నిర్దేశాలను స్మరించినప్పుడు వారి ఆప్యాయత, మమకారం గుర్తుకు వచ్చినప్పుడు మనస్సు ఏడుస్తుందా? అయితే అదొక శుభసూచకం. ఆ స్మరణతో మనల్ని మనం పరిశోధించుకోగలిగితే ఈ గీతోపదేశం సార్థకమైనట్టే. ఈ స్థితిని చేరుకోవడం శిష్యత్వ వికాసానికి చాలా అవసరం.

అర్జునుడు ఆలోచించసాగాడు, నేను ఎవరితో యుద్ధం చేయాలి. నన్ను ఒళ్ళో కూర్చోబెట్టుకుని ఆడించిన తాతతోటి, ఏకలవ్యుడి బొటనవేలు తీయించి తనను సర్వశ్రేష్ఠ ధనుర్ధారినిగా చేసిన ద్రోణాచార్యునితోటి. ఈ మాత్రపు ఆలోచనలకే అతనిని ప్రగాఢ విషాదం అలుముకుంది. గౌతమ బుద్ధుడు సిద్ధార్థుని నుండి బుద్ధునిగా పరిణితి చెందే సంపూర్ణ వృత్తాంతాన్ని ఎడ్విన్ అర్నాల్డ్ అనే రచయిత 'లైట్ ఆఫ్ ఏషియా' అనే పుస్తకంలో పొందుపరచాడు. సిద్ధార్థుడు మొదటిసారి శవంతో పాటు నడుస్తు ఏడుస్తున్న మనుషుల్ని చూసి అలా ఎందుకు ఏడుస్తున్నారని అడుగుతాడు. అందుకు అతని రథసారథి, జ్ఞాపకాలు బాధను కలిగిస్తాయని చెప్తాడు. ఆ చనిపోయినవాని స్మృతులు మరీ మరీ గుర్తుకొచ్చి అందరికీ ఏడుపొస్తోంది. అప్పుడు సిద్ధార్థుడంటాడు, ఇటువంటి గుర్తులను కూడా అంటిపెట్టుకుని ఏడుస్తూ జీవించడం మాత్రం ఎందుకు? అసలు జీవన్ముక్తి, బంధన విముక్తి అని ఎవరూ ఆలోచించలేదా అన్న ప్రశ్నే ఆయనలో ఆత్మబోధను వికసింపచేసి ఆ బోధే వారిని రూపాంతరం కావిస్తుంది.

రెండు సైన్యాల మధ్య నుంచున్న అర్జునుడు కూడా జ్ఞాపకాల్లో మునిగిపోయాడు. భీష్మ పితామహుని ఆప్యాయతను, ద్రోణాచార్యుని శిక్షణ, త్యాగం గురించి ఆలోచిస్తున్నాడు. తన పుత్రుడైనా అశ్వద్ధామకు బ్రహ్మాస్త్రం ఇప్పించి, తనను మాత్రం సర్వశ్రేష్ఠ ధనుర్ధారిని కావించి బ్రహ్మాస్త్ర సిద్ధి కలిగేటట్లు తీర్చిదిద్దిన ద్రోణుడు ఈయనే. జీవితాంతం కఠిన నియమాలతో బ్రహ్మచర్య వ్రతం పాటించిన భీష్మ పితామహుడు పాండవులని సంరక్షించిన జ్ఞాపకాలు మళ్ళీ మళ్ళీ అర్జునుని స్మృతి పథంలోకి వచ్చిన అతనిని బాధ పెడుతున్నాయి.

ఈ అధ్యాయంలోని 27వ శ్లోకంలోని ఉత్తరార్థము, 28-29వ శ్లోకాల వివరణ –

**తాన్సమీక్ష్య స కౌంతేయః సర్వాన్ బంధూనవస్థితాన్**
**కృపయా పరయావిష్టో విషీదన్నిదమబ్రవీత్**
**దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితం**
**సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి**
**వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే**

**భావం :** సమరభూమికి వచ్చియున్న బంధువులను అందరినీ చూసి కుంతీపుత్రుడైన అర్జునుడు అత్యంత కరుణతో శోక సంతప్తుడై ఇట్లు పలికెను. ఓ కృష్ణా! సమరోత్సాహముతో రణరంగమున నిలిచియున్న ఈ స్వజన సమూహమును జూచి, నా అవయవములు పనిచేయుట లేదు. నోరు ఎండిపోవుచున్నది. శరీరమునందు వణుకు, గగుర్పాటు కలుగుచున్నవి.

విషాదపూరితుడై, మనసు వికలమైన అర్జునుని నోటి నుండి ఇటువంటి పలుకులు వెలువడ్డాయి. లేకపోతే అర్జునుడు నరపిశాచాల కోవలోకి వచ్చేవాడు, నిర్దయుడు అనిపించుకునేవాడు కానీ అతడు నరమానవుడు, దేవమానవుడు కావాలనుకుంటున్నవాడు. శిష్యత్వాన్ని వికసింపచేసుకుని మహామానవుడు కావాలనుకుంటున్నాడు. అర్జునుడు ఆలోచనా పరుడు, నిర్విచార స్థితికి చేరుకునే స్థితిలో ఉన్నాడు. ఆలోచనాహీనుడు తన జీవిత లక్ష్యం గురించి ఆలోచించలేడు. కాని అర్జునుడు వీటన్నిటికీ అతీతుడు, కాబట్టి అతడు విషాదగ్రస్తుడవడం స్వాభావికమే.

తరువాతి శ్లోకంలో అర్జునుడు తన మానసిక స్థితిని కృష్ణుడికి ఇలా వివరిస్తాడు. హే కేశవ! నా చేతిలోంచి గాండీవం జారిపోతోంది, చర్మం తపించిపోతోంది, మనస్సు భ్రమకు గురియైనట్లు అనిపించుచున్నది. కనుక ఇక్కడ నిలబడలేకపోవుచున్నాను. పెక్కు అపశకునములు కనబడుచున్నవి. యుద్ధమున స్వజన సమూహమును చంపుటచే శ్రేయస్సు కలుగునని అనిపించుట లేదు. ఓ కృష్ణా! నాకు విజయము గానీ, రాజ్యము గాని, సుఖములు గాని అక్కరయే లేదు. గోవిందా! ఈ రాజ్యమువలనగాని, ఈ భోగములవలన గాని, ఈ జీవితమువలన గాని ప్రయోజనమేమి? (30,31,32 శ్లోకాలు)

మనో వైజ్ఞానిక దృష్టికోణంలో చూస్తే అర్జునుడి ఈ స్థితి అత్యంత విలక్షణమైనదిగా కనిపిస్తుంది. ఎన్నో సార్లు కౌరవుల చేతుల్లో దెబ్బలు తిని, ధర్మరాజైన యధిష్ఠరుని నీతి వల్ల వెనకంజ వేసారు. యుద్ధం మొదలయ్యే వరకు కూడా ఎంతో

[redacted]వానుని కిరణాలు, ఆరోగ్యానికి ఉపకరణాలు.

పరాక్రమవంతునిగా మాట్లాడాడు అర్జునుడు. కాని యుద్ధ భూమికి చేరాక ఎదురుగుండా తనవారిని, బంధువులను చూసి వ్యాకులుడై తన స్వధర్మాన్ని మరచి విలపిస్తాడు. ఇటువంటి స్థితి మనందరి జీవితాలలో కూడా ఎప్పుడో అప్పుడు వస్తుంది. గురుసత్తా ఎప్పుడూ ప్రతికూల పరిస్థితులను కల్పించి వాటితో మహాభారతాన్ని సృష్టించి స్వధర్మాన్ని గుర్తుచేస్తూ ఉంటుంది. కాని మనమేమనుకుంటాము నేను లోకసేవ చేయడానికి వచ్చాను, కాని ఇదేంటి ప్రతిసారి అవినీతికి వ్యతిరేకంగా పోరాడాల్సివస్తోంది. ప్రతి చోట విరోధాన్ని భరించల్సి వస్తోంది. ఇదే మహాభారతం, ఎట్టి పరిస్థితుల్లో కూడా వెనకడుగు వేయకూడదు.

పరమపూజ్య గురుదేవుల రచనలలో అర్జునుడిని ఒక ఆదర్శవంతునిగా, కార్యకర్తగా, లోకసేవకునిగా చూస్తాము. ఆయన పలుచోట్ల మనందరిని ఉద్దేశించి అర్జునుడిని ఒక పాత్రగా చూపించారు. 1971 అక్టోబరు-నవంబరు "ప్రజ్ఞా అభియాన్" పత్రికలో గురుదేవులు ఇలా వ్రాసారు. గీతలోని కృష్ణార్జున సంవాదం ద్వాపర యుగంలో జరిగింది. కాని పరిస్థితులను పరిశీలిస్తే అది ఇప్పటి ఈ కాలానికి కూడా ఆ సంవాదం అన్వయించుకోవచ్చు. అప్పటిలాగే పరిస్థితులు ఇప్పుడూ వికటించాయి. సామంతపు రాజ్యాలతో అస్తవ్యస్తమైన భారతీయ సమాజాన్ని ఒకే దేశముగా చేయడమే కాక భగవానుడు భారతాన్ని మహాభారతంగా, విశాలమైన భారతదేశంగా రూపుదిద్దాలనుకున్నాడు. అందుకే ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో యుద్ధ రచనతోపాటు రచనాత్మక నిర్ణయం తీసుకుని విశాల మహాభారత రాజసూయ యజ్ఞ సంరచన చేసారు. ఈ ప్రయోజనం సిద్ధించాలంటే భగవంతునికి ఒక సమర్ధుడైన సహకారి కావలసివచ్చాడు. అందుకు ఆయనకి ఒక్క పాత్ర మాత్రమే సరైనదిగా తోచింది. అదే అర్జునుడు. పరామర్శతో పాటూ సుదూరంలోని శ్రేయస్సు అనే సత్పరిణామాన్ని అర్జునుడు చూడలేకపోతున్నాడు. అతని మనస్సు, మస్తిష్కం మోహ బంధంతోనే నిండి ఉన్నాయి. అందుకని అతను తన, ఇతరుల లాభ నష్టాల జాబితాను ముందుంచుతున్నాడు. పారలౌకిక లాభాలు చూడలేక సంధిగ్ధంలో పడవేసే మహత్తరమైన తన బాధ్యతను నిర్వర్తించడానికి ఒప్పుకోవటం లేదు. జీవితం గడవడానికి ఏదో విధంగా పొట్ట నింపుకోవడం తప్ప మరే ఇతర విషయాలూ కనిపించటం లేదు. భగవంతుడు అర్జునుని మానసిక దుర్బలతను అర్థం చేసుకుని తన ఆదర్శవాద ఉపదేశాలతో ఆ దుర్బలతను తొలగించాడు.

శిష్యత్వం లేని మనిషి యొక్క మానసిక స్థితే అర్జునుడిలో కనిపిస్తుంది, ఎందుకంటే శ్రీ కృష్ణుడు ఎప్పుడూ అతనికి గురువుగా దర్శనమివ్వలేదు. మనిషిని దగ్గరగా చూడడమే కాదు, గురువులోని గురుత్వాన్ని అర్థం చేసుకోవడానికి మనలోని జడత్వాన్ని కూడా తొలగించుకోవాలి. విషాదం మనస్సులోని జడత్వాన్ని తొలగిస్తుంది. జన్మజన్మల చెడుసంస్కారాలను కడిగిపారేస్తుంది. జీవాత్మ తనని తాను వికసింపచేసుకోవడానికి విషాద స్థితిలోకి వెళ్తుందని శ్రీ అరవిందుల వారు రాసారు. కాబట్టి ఇది కూడా అర్జునుడు కల్పించుకున్న స్థితే అయి ఉండాలి.

మనందరిలో కూడా ఎప్పుడో అప్పుడు ఈ స్థితి వస్తుంది. మనమేం చేయాలి, ఆలోచనలలో క్రాంతి తేదలుచుకుంటే రోడ్ల ఎక్కాలా? మనం నిమిత్తమాత్రులమన్న విషయం అర్థం చేసుకోలేకపోతున్నాం. జరగాల్సిన పనులను మన యుగధర్మంగా మాత్రమే నిర్వర్తిస్తున్నాము. అర్జునుడిలాగా విషాదంతో, ఆత్మ సంతాపంతో మన మానసిక జడత్వాన్ని తొలగించుకోగలిగితే మనలోని నిజమైన శిష్యుడు బైటకి రాగలడు. మెడికల్ సైన్సు కూడా అప్పుడప్పుడు ఏడవడం మంచిదని చెబుతుంది. మన ఆత్మహీనత, దైన్యం గురించి కాస్త ఆలోచించడం, విచారించడం చాలా మంచిదే. కాని ఈ ప్రక్రియ మనలను భావోద్వేగ పరచకుండా, సుపాత్రులను చేసి, ప్రసన్న మనస్కుడైన గురువుతో విషాదగ్రస్తులైన మనలను కలిపితేనే అది సార్థకం అవుతుంది. మన విషాద మానసిక స్థితిలోనే ప్రసన్న మనస్కుడైన గురువు పలుకుతాడు.

33వ శ్లోకం నుండి 36వ శ్లోకం వరకు అర్జునుడు ఒకే మాట చెప్తాడు. ఇటువంటి రాజ్యంతో మనకేంటి పని? ఇటువంటి భోగాలు మనకెందుకు? అసలు బ్రతకడం వల్ల లాభం ఏమిటి? తన విషాదానికి తానే తర్కాన్ని చూపిస్తున్నాడు, అసలు కృష్ణుడ్ని మాట్లాడనివ్వటం లేదు. త్రిలోకాల సుఖాలు లభించినా వీరిని మాత్రం నేను చంపలేనంటాడు.

**అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిం ను మహీకృతే.** వినేది స్వయంగా వాసుదేవుడు, శ్రీకృష్ణ భగవానుడని తెలిసి కూడా కులవినాశనం మొదలుకుని స్త్రీలు చెడిపోవడం, జాతిధర్మము-కుల ధర్మము నశించిపోవడం, నరకంలో పడడం వరకు శాస్త్రసమ్మతమైన అనేక విషయాలు చెప్పుకుంటూపోతున్నాడు. ఆఖరికి నన్ను ధృతరాష్ట్ర పుత్రులు చంపినా కూడా అది మంచిదే అంటాడు. జీవనయాపనకు భిక్షాటనైనా చేయడానికి సిద్ధపడ్డ అర్జునుడి మనస్సులో ఈ వైరాగ్యం ఎక్కడనుండి పుట్టింది?

**[redacted]లం స్వల్పం, చేయాల్సిన పనులు అనేకం.**

వైరాగ్యం మూడు రకాలని శ్రీరామకృష్ణ పరమహంస చెప్పారు. ఒకటి నిజమైన వైరాగ్యం, రెండు స్మశాన వైరాగ్యం, మూడవది చనిపోయిన తరువాతి వైరాగ్యం. చనిపోయాక వచ్చేది కాలంతో వచ్చే వైరాగ్యం, స్మశాన వైరాగ్యం స్మశానం వరకే పరిమితమై ఉంటుంది. శవం బూడిద కాగానే లౌకిక కబుర్లు మొదలవుతాయి. అర్జునుడికి వచ్చిన వైరాగ్యం కూడా కాలంతో వచ్చింది. యుద్ధభూమిలో నిలుచుని సిద్ధాంతాల గురించి మాట్లాడుతున్నాడు. అర్జునుడి మానసిక స్థితిని గమనిస్తే విషాదం మధ్యలో ఒక క్రాంతి పుట్టినట్టు కనిపిస్తుంది.

అర్జునుడు స్వజనులు, పరిజనులు, పరాయివారు ఈ ముగ్గురినీ విడిగా గుర్తించడంలో అసమర్థుడైయ్యాడు. అందుకే ఈ విషాదం పరాకాష్ఠ స్థితికి చేరి తను స్వయంగా నిర్ణయాన్ని ప్రకటిస్తాడు, 'నేను యుద్ధం చేయను' శిష్యుడు పూర్తిగా సమర్పించుకోకుండా, తాను స్వయంగా నిర్ణయాలు తీసుకున్నంత సేపూ తనే నూటికి నూరు పాళ్ళు సరి అని భావిస్తాడు. అర్జునుడు తన స్వజనుల గురించి వివరిస్తూ ప్రతిసారి తన మోహాన్ని, తనకు తెలిసిన శాస్త్రజ్ఞానాన్ని మధ్యలో ప్రదర్శిస్తున్నాడు. ఈ మోహం, జ్ఞానం పోయేదాకా శిష్యుడు పుట్టలేడు. అర్జునుడు గాండీవాన్ని వదిలేసి రథానికి వెనక భాగంలోకి వెళ్ళి కూర్చోవడం పిరికితనం, పలాయనవాదం. వీరుడు, భావనాశీలుడు అయినప్పటికీ అర్జునుడు మోహితుడెలా అయ్యాడు? ఆలోచనలలో హీనత్వం మోహం, అకర్మణ్యత ఈ మూడు శిష్యునికి దారిలో వచ్చే అడ్డంకులు. మోహించదలుచుకుంటే శ్రేష్ఠత్వాన్ని, ఆదర్శాలని మోహించాలి, అంతేకాని మరణధర్మానికి లోబడి ఉన్న స్వజనులను కాదు. నీతినీ, ధర్మాన్నీ మోహించాలి. అవినీతిని, అధర్మాన్నీ కాదు. గీత యొక్క ఈ మొదటి అధ్యాయాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తే పూర్తి సత్యమంతా ఒకే విషయంలో దాగి ఉందని తెలుసుకుంటాము. మనము సమర్పిత కర్మనిష్ఠులము, జ్ఞానులం కావాలి.

నువ్వు అర్జునుడివై కీర్తిని పొందాలనుకుంటే తక్షణం పని చేయి అన్నారు పరమపూజ్య గురువుగారు. నువ్వు చేయకపోతే మరొకరు చేసేస్తారు. మనం పని చేయకపోయినా ఇంత పెద్ద విరాట్ దైవీ ప్రణాళిక ముందుకు సాగదా? పని ముందుకు సాగుతుంది, కాని మనము అర్జునుడిగా మారకుండా ఉండిపోతాము. అఖండ జ్యోతి, ఏప్రిల్ 1972 పత్రికలో గురుదేవులు ఇలా రాసారు. 'ఆత్మసత్తా చాలా గొప్పది. అయినప్పటికీ అగ్రదూత తమ భూమిక నిర్వహించడంలో అడ్డుపడుతున్న ఆ క్షుద్రత ఏంటి? సమర్థుడిని అసమర్థుడిగా మార్చే ఈ వ్యామోహం ఇంతకీ భవబంధనమా? లేక చెడు సంస్కారమా? ఇది పరాక్రమము, పౌరుషము చూపించాల్సిన వేళ. శౌర్యము, ధైర్యము చూపించాల్సిన వేళ. ఇటువంటి విషమ పరిస్థితులలో ఈ యుగపు అర్జునుల చేతి నుండి గాండీవం ఎందుకు జారిపోతోంది? వారి నోళ్ళు ఎందుకు ఎండిపోతున్నాయి? చమటలెందుకు కారుతున్నాయి? సిద్ధాంతవాదమేమన్నా హరికథా కాలక్షేపమా? కృష్ణుడికి విసుగు పుడుతోంది.

కృష్ణుడి విసుగు అర్జునుడిపై ప్రదర్శించడం దగ్గరనుండి అతనిలో శిష్యత్వాన్ని జాగృతపరచే ప్రక్రియ రెండవ అధ్యాయమైన 'సాంఖ్య యోగం'లో చూస్తాము. ఆ వివరణ వచ్చే సంచికలో చదువుతాము. దానికి ముందు మనం ఒకటి అర్థం చేసుకోవాలి, అర్జునుడి సందేహాలు నిజంగా తన మనస్సునుండి, తన వేదన వ్యాకులత స్థితులలో నుండి పుట్టినవా లేదా అని శ్రీకృష్ణుడు గమనిస్తున్నాడు. ఆత్మ సంతాపం నుండే ఈ ఆత్మవ్యాకులత పుట్టుకొచ్చింది. ఇది శిష్యత్వం వికసించే, గురువు ఉద్భవించే సమయం. అసాధారణమైన కాలమిది. ఆ యుగపు అర్జునుడికి అతని భగవంతుడైన శ్రీకృష్ణుడి నుండి లభించిన మార్గదర్శనమే మనమంతా కూడా ఆశిస్తున్నాము. నేడు కూడా మనం యుగగీత ఆధారంగా ఆ మార్గదర్శనం అందుకోబోతున్నాం.

– అనువాదం : శ్రీమతి జయలక్ష్మి

## నక్కలలోను సహకారం

ప్రిన్స్ క్రోపాట్కిన్ తన పుస్తకాలలో ఒక వింత సంఘటన వ్రాశారు. ఒకసారి అడవిలో రైల్వేలైను వేయబడుతుంది. పని చేస్తున్న కూలీలు తమ భోజనాన్ని ఒక చోట ఉంచి పని చేసుకుంటుండేవారు. వెనుకనుంచి వచ్చిన నక్కలు భోజన పదార్థాలన్ని తినేసేవి. ఇలా కాదని చెట్టుకు తగిలించినా అన్నం మూటలు మాయమయ్యేవి. చివరకు ఒక ఎత్తైన స్థంభాన్ని కట్టి దానికి అన్నం మూటలు వ్రేలాడేసేవారు. అయినప్పటికి నక్కలు సర్కస్‌లో చూపించినట్లు ఒకదానిపై ఒకటి ఎక్కి అన్నం మూటలను అందుకుని పారిపోయేవి. ఈ బుద్ధి కుశలత, అనుకున్నది సాధించటం, వాటి కృషి, పట్టుదల చూచి ప్రజలు ఆశ్చర్యచకితులయ్యారు.

– ప్రజ్ఞాపురాణం నుండి

ఉపవాసమే దివ్యమైన ఔషధం.

దీపావళి పర్వదిన ప్రత్యేక వ్యాసం

# నిరాశ అనే చీకటిని ఆశ అనే చిరుదీపాలతో ప్రాలదోలుదాం

5 నవంబరు 2010 శుక్రవారం సంధ్యా సమయంలో చిరుదీపాల కాంతులతో రంగు రంగుల పువ్వొత్తులు, మతాబులు, చిచ్చుబుడ్లు కాంతి కన్నులు మిరుమిట్లు గొలుపుతూ కనువిందు చేసే దీపావళికోసం అందరం ఎదురుచూస్తున్నాము.

ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఈ జ్యోతి పర్వాన్ని కొంగ్రొత్త ప్రకాశ తేజాన్ని అవతరింపచేసేదిగా భావిద్దాం. అది భరతమాత 102 కోట్ల సంతానం ఇంటి ముంగిళ్ళలో, వారి మనస్సుల్లో సరికొత్త జ్యోతిని ప్రకాశింపచేస్తుంది. పండుగల శ్రేణిలో దీపావళి మణిరత్నం లాంటిది. ఇది దేశము మరియు ప్రజల కీర్తిని ఇనుమడింపచేస్తుంది. పాతదంతా క్రొత్త అవుతుంది. మనసు మరియు హృదయాంతరాళంలోని అంధకారం తోజోవంతం అవుతుంది. ఎన్నో ప్రశ్నలు సమాధానం లేకుండా మిగిలి ఉంటాయి. మరెన్నో ప్రశ్నలు జవాబు కోసం ఎదురు చూస్తుంటాయి.

ఈ జ్యోతి పర్వంతో సంబంధం ఉన్న ప్రసంగాల శ్రేణి అనంతమైనది మరియు ఎప్పటికప్పుడు ఇవి క్రొత్తదనాన్నందిస్తాయి. దీనిని కారణం దీపావళి అన్ని పండుగలకు వెలుగును ప్రసాదించు పండగ కాబట్టి. ఇది తన ఆంతర్యంలోని వెలుగు ప్రభావంతో అవినీతి, భయం, అత్యాచారాలను తొలగించి మర్యాద, సత్యము, నీతిని ప్రతిష్ఠింపచేస్తుంది. రావణుని దురాచారాలపై శ్రీరాముని విజయం పురాణగాథ మాత్రమే కాదు, ఇది పరిపక్వమైన ఆధ్యాత్మిక భారతావనిలో అనంతమైన, అమరమైన ఇతిహాసము. ఈ పండుగ మితిమీరిన విలాస జీవనశైలిపై మహాతపస్సు యొక్క విజయానికి ప్రతీక. ఇది దుష్టశక్తిపైన లోకనాయకుని ఆధిపత్యమును తెలిపే పండుగ. రఘువంశానికి చెందిన శ్రీరాముడు రావణుని వధించిన తరువాత అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంలో అచటి పౌరులు అత్యంత ఆనందోత్సాహాలతో దీనిని ఒక గొప్ప వెలుగునిచ్చే పండుగగా జరుపుకొన్నారు. నాటినుంచి తరతరాలుగా ఈ పండుగని దేశానికి విజయ సూచికంగా జరుపుకుంటున్నాము.

ఈ దీపాల పండుగ గురించి ఎన్నెన్నో కథలు చెప్పుకుంటారు. ఈరోజే మహా పతీవ్రత సావిత్రి తన పతిప్రాణములను యమధర్మరాజు నుంచి వరదక్షిణగా పొందిందని ప్రతీతి. ఈ పండుగ రోజే యమధర్మరాజు నచికేతునికి దివ్య జ్ఞానాన్ని ప్రసాదించాడంటారు. జైన తీర్థంకరుడైన మహావీరుడు ఈ రోజే నిర్వాణం చెందాడట.

దీపావళి పండుగ ఆనందము, ప్రకాశముల శాశ్వత విజయాలకు మూలం. కాని నేటి నాగరిక ప్రపంచములో అమావాస్య అంధకారము ప్రబలియున్నది. మన దేశంలో ఏ నాయకునిలోనూ విజయ భావన, సాహసము, ఉత్సాహము లేవు. ప్రతి నిత్యము అత్యాచారము, అనాచారము, వ్యభిచారము, అవినీతి మొదలైన దురాచారములు మన సమాజాన్ని వణికిస్తున్నాయి. ఇంత జరుగుచున్నప్పటికీ మన ఆచార వ్యవహారాలనే ముసుగులో ఉండి, సమాజ వ్యతిరేక శక్తులను ప్రతిఘటించలేక పోతున్నాము.

ఈ అంధకారం తీవ్రవాదం వరకే పరిమితం కాదు, దేశవ్యాప్తంగా మరెన్నో సమస్యలు విస్తరించియున్నాయి. భారత ప్రజలు అనేక మానసిక సమస్యలతో తల్లడిల్లుతున్నారు. వ్యక్తిగత సమస్యలే కాకుండా, కుటుంబ, సమాజ, సాంస్కృతిక, నైతిక విషయాలల్లో కూడా తట్టుకోలేనంత అంధకారం వ్యాపించి ఉంది. రాజనీతిజ్ఞులు తమల్ని తామే సర్వశక్తివంతులుగా భావిస్తున్నారు. వీరు తమ దుశ్చర్యల వల్ల అవినీతి అనే బురద గుంటలో కంఠము వరకు కూరుకుపోయారు. జాతీయ సంపద అట్టడుగు వర్గాలకు, లోకహితము కొరకు, అసహాయులకు, నిరక్షరాస్యులకు, పేదలు మున్నగువారి అభివృద్ధి కొరకు ఉపయోగపడాలి. కాని అది స్వార్థ పరులైన రాజనీతిజ్ఞులు, నల్లబజారు వ్యాపారులు, దళారులవద్ద చేతులు మారుతుంది. వీరు జాతీయ ఉత్పాదక క్షేత్రాలను జలగల్లా పట్టి పీడుస్తున్నారు. సాధారణ ప్రజలు ఆర్థిక సంక్షోభంతో, వివిధ నిత్యావసర వస్తువుల రేట్ల పెరుగుదల వలన అమితమైన ఇబ్బందులు పడుతున్నారు. తద్వారా వారు నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. ఇటువంటి ఆర్థిక పరిస్థితులు సాధారణ ప్రజల జీవనశైలిపై ఎంతో ప్రభావాన్ని చూపిస్తుంది. ఇది వారిని సాధారణ కార్యకలాపాల నిర్వహణయందు అసహాయులు మరియు అసమర్థులుగా చేస్తుంది. ఇలా ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకోగలిగిన శక్తివంతులు నైతిక విలువలను మరచి వారివారి

**[redacted] తో స్నేహం వద్దు-గుణం ఉన్న వ్యక్తితో దూరం వద్దు.**

విలాసజీవనాలతో, అత్యంత స్వార్థపరులుగా మారి అష్ట ఐశ్వర్యాలతో తులతూగుతూ మనకు అందనంత ఎత్తులో ఉన్నారు. కేవలం వారి మాటల ద్వారానే సమస్యలకు సమాధానం వెతుకుతున్నారు. సాధారణ ప్రజల భావ సంవేదనలను వారు పరిగణలోనికి తీసుకోవటం లేదు.

ఏ దేశ ప్రగతి అయినా, ఆ దేశంలోని యువత ఆలోచనలు, ఉదాత్త భావనలపై ఆధారపడి ఉంటుంది. కాని ఈ రోజుల్లో చెడు సంస్కారాలలో మునిగియున్న యువత, తమ సామర్థ్యాలను వృథా చేస్తున్నందువల్ల దాని దుష్పరిణామాలను మొత్తం సమాజము మరియు దేశము భరించవలసిన అగత్యం ఏర్పడింది. యువత తల్లి దండ్రులు కూడా వారిని అదుపులో ఉంచలేకపోతున్నారు. ఇది ఎంత వరకు సబబు? వారు తమకు అందుబాటులో ఉన్న సమయాన్ని విందులు వినోదాలతో దుర్వినియోగ పరచుకొంటున్నారు. కొంతమంది తల్లులు ఈ విందులు వినోదాలలో పాల్గొనుటకై తమ హావభావ ప్రదర్శనకు మరియు కృత్రిమ సౌందర్యాన్ని పెంచుకొనుటకు బ్యూటిపార్లర్ల చుట్టూ తిరుగుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో యువతను పట్టించుకొనేదెవరు? దేశ భవిష్యత్తు ఎటువైపు వెళుతోంది? ఎటువంటి సంస్కారాలతో వికసిస్తుంది? ఇది ముఖ్యముగా ఆలోచింపవలసిన అంశము.

ఋషులు తీర్చిదిద్దిన మన సమాజ వ్యవస్థ ఎందరో మహా పురుషులకు జన్మనిచ్చింది. అది ఈ రోజు జాతీయ హింస రూపంలో రక్తసిక్తమౌతుంది. విశ్వమంతటిని జ్ఞాన జ్యోతితో ప్రకాశింపజేసే ఉపనిషత్తుల ధార, సంకుచితత్వం, మతతత్వాల హింసాగ్ని అనే దావానలంలో దగ్థమై పోతుంది. సంకుచితత్వం రాజనీతితో కలిసి అమాయకులు మరియు అసహాయులను బలి తీసుకుంటుంది. ఈ అమావాస్య కాళరాత్రి ఇంకా ఎప్పటివరకు మేల్కొని ఉంటుందో, అంధకారాన్ని జయించి వెలుగును ప్రతిష్ఠించిన భగవంతుడు శ్రీరామునికే తెలుసు.

ప్రస్తుత పరిస్థితులు బాగా జటిలంగాను, భయావహంగాను ఉన్నాయి. కాని మనిషి, కాలచక్రం స్థిరంగా ఉండకుండా ఎప్పుడూ తిరుగుతూనే ఉంటుంది అని భావిస్తాడు. పరిస్థితులు ఎల్లవేళలా ఒకే రకంగా ఉండకుండా మారుతుంటాయి. ఈ మార్పుని మనచెప్పు చేతల్లో ఉంచుకోవడం కోసం కొంచెం తెలివితేటలు, అపారమైన నమ్మకం అవసరం. విశ్వాసము, తెలివితేటలతో గాలిలో దీపాన్ని కూడా ఆరిపోకుండా చూడవచ్చు. మన దేశములో పౌరుషబీజాలు ఉన్నాయి కాని నిద్రాస్థితిలో ఉన్నాయి. సాహసము మరియు సంకల్పముతో ఈ బీజాల్ని మరల అంకురింపచేయాలి. రండి ఈ దీపోత్సవంలో మనమందరము నిరాశాంధకారాన్ని ఆశ అనే చిరుదీపాల్తో ప్రకాశింపచేద్దాం. ఒక దీపంతో మరొక దీపం వెలిగినట్లుగానే దేశం ముంగిట్లోని పొలాలు, గ్రామాలు, పట్టణాలు వివిధప్రాంతాల్ని మన సత్సంకల్పంతో ప్రకాశవంతంగా, దేదీప్యమానంగా వెలిగింపజేద్దాం. ఈ ప్రయత్నంతో మన ఇంటి ముంగిట ప్రకాశవంతమవుతుంది, మన మనస్సు ఉల్లాసవంతమవుతుంది. ఈ మహా పండుగ మంగళప్రదమౌతుంది.

*– అఖండజ్యోతి, జనవరి 2004*

*– అనువాదం : జి సీతమ్మ*

## చిన్న వారితో పోల్చుకోవాలి

*చెవుల పిల్లులు తమ ఆకృతిని, దయనీయ స్థితిని ఏనుగు ముందు చాల హీనంగా ఉన్నట్లుగా భావించి ఇలాంటి జీవితం జీవించి ఏమి లాభమనుకుని నదిలో దూకి ఆత్మహత్యకు చేసుకోవటానికి బయలుదేరాయి. నది ఒడ్డుకు చేరగానే అక్కడ ఉన్న కప్పలన్ని భయంతో నీటిలోకి దూకి దాక్కోసాగాయి. అది చూసిన ఒక ముసలి చెవుల పిల్లి మిగిలిన వాటితో ఇలా అన్నది. "ఈ లోకంలో కప్పలవంటి మనకంటే నికృష్ట ప్రాణులు ఎన్నో ఉన్నాయి. అందువల్ల నిరాశతో మరణించడం ఎందుకని క్షేమంగా వాటిని వెనక్కి తీసుకెళ్తుంది.*

*పెద్దవారితో పోల్చుకోవడం వలన మనిషి తను చిన్నవాడిననే భావనకు లోనవుతాడు. కాని తన కంటె చిన్నవారితో పోల్చి చూసుకున్నప్పుడు తన వంటి అదృష్టవంతుడు మరొకడు లేడనిపిస్తుంది. నిరాశకు తావుండదు. వ్యక్తి తన దృష్టికోణం మార్చుకున్ననాడు, ప్రతికూలంగా ఉన్న సమాజం, పరిస్థితులు అనుకూలంగా, ఆనందదాయకంగా మార్పు చెందుతాయి.*

– ప్రజ్ఞాపురాణం నుండి

[redacted]ర భాషణం మానవత్వానికే భూషణం.

## సూర్య విజ్ఞానం - 2

# ఆదిదేవ నమస్తుభ్యం, దివాకర నమస్తుభ్యం

మనం నివసిస్తున్న ఈ ప్రపంచం ఉత్పత్తికి పూర్వం అంతా చీకటి మయంగా ఉండేదని శృతులలో చెప్పబడింది. "తమః అసీత్" అనే వాక్యంలో దిశలన్నీ తమస్సుతో నిండి ఉండేదన్న భావన ఉన్నది. కాని తూర్పుదిశయందు సూర్యభగవానుడు ఉదయించి ఈ ధరిత్రిపై జీవన ప్రకాశమునకు, ప్రాణమునకు మూలకారణం అయ్యాడు. ఛాందోగ్యపనిషత్తులో ఋషి ఈ విధంగా అంటాడు.

**య ఏ షో అంతరాదిత్యే హిరణ్మయః పురుషీ దృశ్యతే**
**హిరణ్యశ్మ శ్రుర్హిరణకేశ ఆప్రణరశ్వాత్సరం ఏవ సువర్ణః ॥**

ఈ విధంగా సర్వశక్తిమంతుడైన పరమాత్మ హిరణ్యగర్భుని అత్యద్భుతరూపంలో దివ్యతేజముతో దిగ్దిగంతములకు వ్యాపింపజేసి అంధకారమయమైన రాత్రియందు ఆత్మ ప్రకాశరూపంలో ఉదయించిన విషయం చెప్పబడింది. అంటే ఈ దివ్య ఆధ్యాత్మ ప్రకాశం ఆవిర్భావంతోనే అన్నిదిశలలోని అంధకారం పటాపంచలయిపోయి ప్రపంచమంతటా అలౌకికమైన ప్రకాశం నిండిపోయింది.

భారతీయ సంస్కృతి ఆది సంస్కృతి, అన్నింటి కన్నా పురాతన సంస్కృతి. అది ప్రాచీన కాలం నుండి ఇప్పటివరకు భువన భాస్కరుడు తప్ప వేరెవ్వరు మానవ జీవనము యొక్క వివిధ ఆయామములను ఇంతగా ప్రభావితం చేసిన వారు ఎవరూ లేరు. అందువల్లనే **"ఆది దేవ నమస్తుభ్యం"** అని చెప్పి సృష్టి ఆరంభంలో మానవ వికాసమునకు కారణభూతుడయ్యాడు. మన ప్రాచీన ఋషులు ఈ ఆదిత్యుని సూర్యతేజముకు అభినందన, అభ్యర్థన చెయ్యడం చూడవచ్చు. సంస్కృతి యొక్క వికాసంలో సూర్యుడు ఒక మహత్వపూర్ణమైన భూమిక నిర్వహించడం కనిపిస్తుంది. సమయం యొక్క కల్పన, రాత్రి పగళ్ళు, మాసాల, ఋతువుల క్రమ విభజన సూర్యుని వల్ల సంభవిస్తాయి. సూర్యునిలోని ఒక భాగమైన చంద్రుని క్షయవృద్ధుల ద్వారా కృష్ణ, శుక్ల పక్షములు ఏర్పడతాయి. ఈ విధంగా అనాదికాలం నుండి సూర్యుడు మానవ జీవితాన్ని ప్రభావితం చేస్తున్నాడు. మనిషి యొక్క దైనందిన దినచర్యకు ఆధారం ఆది కాలం నుండి సూర్యుడే. మండుతున్న అగ్నిగోళ రూపంలో సర్వప్రథమ మానవుడు సూర్యుని చూసి ప్రాణం యొక్క, శక్తి యొక్క పుంజంగా, పరమాత్మ స్వరూపంగా భావించాడు. సూర్యోదయ సూర్యాస్తమాలతోనే మనిషి జీవన చర్య ఏర్పడింది. ఈ విధంగా మానవ సభ్యత, సంస్కృతుల వికాస క్రమంలో సూర్యభగవానుడు అతి మహత్వపూర్ణ భూమిక నిర్వహించాడు.

మన ఋషులు వేదకాల ఆరంభం నుంచే **"భూమావై సుఖమ్" (ఛాందోగ్యపనిషత్తు 0-7-23-1. 7/24/1) "భూమా తద అమృతమ్"** అనే దృష్టిని కలిగియున్నారు. ఆర్షఋషుల ఈ 'భూమా' దృష్టి పరిమితం నుంచి అపరిమితం వైపుకు పెరిగి దానితో తాదాప్యం స్థాపించుకునే ప్రేరణ ఇస్తుంది. ఈ క్రమంలో సృష్టి యొక్క నియామకుని రూపంలో అనేక దేవీదేవతల దర్శనం జరుగుతుంది. తనను వ్యాపింపచేసుకొనుటకు, మూడులోకముల నియంతతో తదాప్యం పొందుటకు తీవ్రమైన కోరిక వారిలో జాగృతమయింది. ఋషుల యొక్క ఈ దృష్టితో చేసిన ప్రయత్నాలే మన ఉపాసన పద్ధతికి మూలాధారం అయినాయి. ఈ ఉపాసన క్రమంలో సూర్యోపాసనకు, దేవ సంస్కృతికి ఒక విశిష్టమైన, మహత్వపూర్ణమైన స్థానమున్నది. ఎందుకంటే సౌరమండలం సూర్య చంద్రుల, నవగ్రహముల, మారుత్‌గణముల, సప్తర్షుల, ముప్పదిమూడు కోట్ల దేవతల నివాసం అని చెప్పబడింది. ఈ సర్వదేవతల ప్రాతినిధ్యం భువన భాస్కరుడు సూర్య నారాయణుడేనని మన ఋషి మనీషుల అభిప్రాయము. అందువల్ల **"సూర్య ఆత్మ జగతస్తస్థుషశ్చ"** అని ఋగ్వేద ఋషి శాకల సంహితలో (1-115-1) చెప్పి జంగమ స్థావరమైన అన్ని ప్రాణులకు ఆత్మ సూర్య భగవానుడేనని వివరించారు.

భగవద్గీత విభూతియోగంలో **"జ్యోతిషాం రవిరంశుమాన్"** (10-11) అని చెప్పి సూర్యదేవుని మహత్వమును ప్రతిపాదించారు. సుప్రసిద్ధమైన గాయత్రీమంత్రంతో సూర్యుని తేజోశక్తిని ఉపాసించటం వల్ల మానవమాత్రులు సన్మార్గంవైపు నడవగలరని బ్రహ్మవిద్య చెప్తుంది. (శుక్ల యజుర్వేదం 3-35-22-1, ఋగ్వేద సంహిత 3-62-10) **"అకృష్ణేన రజసా"** ద్వారా

[redacted] భోగి కోరేది ఇంకొంచెం, లోభిమాత్రం మొత్తం మొత్తం.

ఋగ్వేద శాకలసంహితలో (1-35-2) వేదములలో సూర్యోపాసన ప్రథమ సంకేతం లభిస్తుంది. **తద్భాస్కరాయ విద్మహే ప్రభాకరాయ ధీమహి తన్నో: భాను ప్రచోదయాత్ (2-9-9)** లో సూర్యోపాసన మహత్త్వం చెప్పబడింది. మన సంస్కృతిలో సూర్యునికి పెద్దపీట వేయబడింది. **ఆదిత్యోబ్రహ్మ (ఛాందగ్యోపనిషత్తు 3-19-1), "బ్రహ్మ హీ ప్రతీక్ రూప్‌మే ఆదిత్య హై"; "అసౌయః స ఆదిత్యః "** (శతపథ బ్రాహ్మణం 50-5-1-4) ఈ సూత్రములు సూర్యుని ప్రాముఖ్యతను తెలుపుతాయి.

ఋగ్వేదంలో ఒక మంత్రంలో ఋషి ఇలా స్తుతిస్తారు హే సూర్యదేవా! మేమందరము ఏ విధంగా పరస్పర సహకారంతో మంచి మార్గం అనుసరించాలో మీరు చంద్రదేవుడు మాకు దిగ్దర్శనం చేస్తున్నారు (స్వస్తి పంథామను చరేమ్ సూర్య చంద్రమసావివ - ఋ 5-51-15) అంటే సూర్యుడు చంద్రుడు లక్షల సంవత్సరాల నుండి నియమం ప్రకారం ఎటువంటి సోమరితనం, పొరపాటు లేకుండా పని చేస్తున్నట్లుగా మేము ఆనందంగా (చంద్రునికి ప్రతీక), వివేకముతో (సూర్యుని ప్రతీక) మర్యాదా పూర్వకముగా జీవిస్తాము. అవసరమైనప్పుడు అవినీతిని ఎదుర్కొనడానికి సూర్యుని వంటి ఉగ్రతను, తీక్షణతను కలిగి ఉంటాము. అలాంటి స్థితిలో కూడా చంద్రుని వంటి శాంతిని కలిగి ఉంటాము. అంతేకాదు సవితా దేవతా! మీరు అన్ని రకముల కష్టాలను, పాపాలను దూరం చేసి మాకు మేలు చేస్తున్నారు. **విశ్వాని దేవ సవితర్దుని తాని పరాసువ యద్ భద్రం తన్న ఆసువ (ఋగ్ 5-82-5)** ఈ మంత్రములో శ్రేష్ఠమైన ఆలోచనలు అన్ని ప్రక్కల నుంచి సూర్యుని ద్వారా పొందాలి. అందువల్ల మానవ చింతన (ఆలోచనలు) ఎల్లప్పుడు వివేకముతో కూడి ఉంటుంది. పైన ఇచ్చిన ఉదాహరణలు మన ఋషులు సవితాదేవత స్తుతిని ఎందుకు మహత్త్వపూర్ణమైనదిగా భావించారో, దైనందిన జీవనంలో శ్రేష్ఠమైన స్థానం ఎందుకు ఇచ్చారో విశదమవుతుంది. **"సవితా సర్వస్య ప్రసవితా"** సవిత అన్నింటికి జన్మధాత్రి అని చెప్పి సూర్యదేవుడే సమస్త ప్రాణిజగత్తుకు జీవనం, ప్రాణం ఇచ్చేవాడు అని ప్రతిపాదిస్తున్నారు.

దేవ సంస్కృతిని అందించిన మహామానవులు తమ దివ్యదృష్టితో, అంతఃస్ఫురణతో వర్ణించిన కథనములు శృతులయ్యాయి. అంతర్‌జగత్తులో అనుభూతి పరమైన ప్రయోగములు ఫలితాలు జీవనములో సూత్రములయ్యాయి. మానవజాతి మొదట కనిపెట్టిన అగ్ని ప్రజ్వలనకు ప్రేరణ అందించినది సూర్యుడే. అక్కడి నుండి సూర్య కిరణములతో నడిచే రథముల రీసర్చి, ఆరోగ్యం కొరకు చేసే ప్రయోగములు నుండి సూర్యుని కిరణముల వేగముతో సంచరించే కణముల అన్వేషణ మూలకరణముల ఏకీకరణ ప్రయోగము లన్నింటిలోను సూర్యుని ప్రధాన భూమిక ఉన్నది. సూర్యుడే సృష్టి చక్రాన్ని పరివర్తన చేస్తున్నాడని, నడుపుతున్నాడని ఋషులే మొట్టమొదట తెలుసుకున్నారు, తెలియజెప్పారు. సూర్యుని వల్లే ప్రాణుల ఉత్పత్తి జరుగుతుంది. సూర్యుని వల్లే వ్యవసాయం సాధ్యమవుతుంది. సూర్యుని వలననే వృక్షములు, పూలు, ఫలములు, వనస్పతులు, ఔషధముల, అన్నముల ఉత్పత్తి సంభవమవుతుంది. సూర్యుడు లేకపోతే సృష్టిచక్రం నడవదు. ఈ ప్రపంచానికి మూలం సూర్యుడే. అందువల్లనే సూర్యదేవుని ఆదిదేవునిగా భావించి తమ సాంస్కృతిక వికాసం ఆ క్రమంలోనే చేసుకునేవారు.

సూర్యుని వ్యాసం పృథ్వి వ్యాసం కన్నా సుమారు 108 రెట్లు ఎక్కువ. సుమారు 8,24,000 మైళ్ళ వ్యాసం ఉన్న ప్రకాశమండలం కలిగిన సూర్యుడు తన ఊష్మపుంజంతో (వేడి, వెలుగు) ఎంతో దూరంలో ఉన్న పృథ్విమీద సభ్యతా, వికాసక్రమం మీద మహత్త్వపూర్ణ ప్రభావం చూపిస్తున్నాడు. ఋతువులు, రాత్రి పగలుల సమయం, అతివృష్టి, అనావృష్టి, కరువుకాటకాలు అన్నింటిలో సూర్యునికి ప్రధాన భూమిక ఉన్నది. పృథ్వి మీద ఉన్న జలమునకు కూడా సూర్యుని వేడే కారణము. వర్షజలమునకు సూర్యుడే కారణము. సూర్యుని వేడియే పృథ్విపైగల అగ్నికి, విద్యుత్తుకు మూలకారణము. ఈ విధంగా మానవుని పుట్టుక నుండి ప్రాణుల అస్తిత్వానికి సూర్యుడే మూలకారణం. ఇది సునిశ్చితమైన సత్యం. ఈ కారణం వల్లనే ఆదికాలం నుండి సూర్యోపాసన వైదిక సంస్కృతి వికాసం జరిగిన భారతదేశంలోనే గాక సమస్త విశ్వంలో అనేకచోట్ల భక్తి శ్రద్ధలతో జరుగుతున్నది. ప్రపంచంలో అనేకచోట్ల కనిపించే సూర్యమందిరములు దీనిని నిరూపిస్తాయి. అమెరికాలో రెడ్ ఇండియన్స్ నివసించే ప్రాంతాలలో సూర్యదేవాలయలను ఎక్కువ సంఖ్యలో చూడవచ్చు. కాలక్రమంలో ఋషి చేతనతో సంబంధం తెగిపోయి సభ్యత వికాసక్రమంలో ముందుకు సాగనప్పటికి సూర్యుని ఉపాసన వారి దైనందిన జీవనంలో అంగమయింది. హవాయి ద్వీపములలో, జపాన్, దక్షిణ అమెరికా, కరేబియన్

[redacted] తెలుసుకో తప్పు-సవరించుకోకుంటే నీకే ముప్పు.

ద్వీపములలో రకరకాల సూర్యుని కథల ప్రాచుర్యం అక్కడ ఉపాస్యదేవత సూర్యుడని చెప్తుంది. చైనా విద్వాంసులు సూర్యుని ఆధారం చేసుకుని సమగ్ర ఖగోళ శాస్త్రాన్ని, జ్యోతిర్విజ్ఞానాన్ని రూపొందించారు. అక్కడ సూర్యుని 'యాంగ్' అని చంద్రుని 'ఇన్' అని పిలుస్తారు. వీటి ప్రతినిధి ధారలు మానవ శరీరంలో ఇడా-పింగళ రూపంలో ఉన్నాయని భావిస్తారు. జపాన్ సూర్యుని పూజించే దేశం, సూర్యోదయం మొట్టమొదట జపాన్ దేశంలో జరుగుతుందని భావిస్తారు. బౌద్ధ జాతక కథలలో సూర్యుని ప్రస్తావన వాహన రూపంలో అనేకచోట్ల కనిపిస్తుంది. అజవీధి, నాగవీధి, గోవీధి పేర్ల ఆధారంగా మూడు గతులు (మార్గములు) చెప్పబడ్డాయి.

పార్శి, అరబీలలో సూర్యుని అఫతాబ్ అని అంటారు. ఇస్లాంలో సూర్యుని **"ఇల్మ అహకామ అననజూమ్"** యొక్క కేంద్రంగా భావిస్తారు. అంటే సూర్యుని ఇచ్ఛాశక్తిని పెంపొందించే చైతన్యసత్తాకు ప్రతీక. క్రైస్తవ ధర్మంలోని **"న్యూ టెస్ట్‌మెంట్"** లో సూర్యుని ధార్మిక మహత్వం విశదంగా వర్ణించబడింది. అందువల్లనే సెంట్‌పాల్ ఆదివారం పవిత్రదినమని ప్రకటించి ఆ రోజున ప్రభువు యొక్క ఆరాధన, దానాలు ఇవ్వడం అత్యంత ఫలదాయకమైన పుణ్యంగా వివరించారు. ఇందువల్లనే విశ్వంలోని క్రైస్తవులందరు ఆదివారం చర్చికి నియమంగా వెళ్ళి సామూహిక ప్రార్థనలు చేస్తారు. గ్రీకు, రోమన్ పండితులు కూడా ఆదివారమే పూజాదినంగా స్వీకరించారు.

పైన విశ్వమంతటా ధర్మమత సంప్రదాయాల అన్య సభ్యతలకు సూర్యునితోగల సంబంధం వివరింపబడ్డది. కాని భారతీయ సంస్కృతి విశుద్ధమైన వైదిక సంస్కృతిని సూర్య సంస్కృతిగా భావించి తమ ఆదిదేవుని సూర్యునిగా చెప్తూవచ్చింది. మన సంస్కృతిని అనుసరించి సూర్యుడే బ్రహ్మ (ఉత్పత్తి కర్త) సూర్యుడే విష్ణువు (పాలన కర్త) సూర్యుడే మహాకాలుడు అంటే కాలం యొక్క సమయం యొక్క నిర్ధారణ కర్త. మహాకాలుని మత్యు దేవతగా భావించారు. సూర్యుని ఊర్జ అంటే ప్రాణాగ్ని శరీరంలో ఉన్నంత వరకు ప్రాణి జీవించి ఉంటుంది. బయటకు పోతే మరణం సంభవిస్తుంది. ఇంతేకాదు సూర్యుడు గణపతిగా చెప్పబడ్డాడు. గ్రహములన్నింటిలోకి ప్రముఖుడు కావడం వల్ల, అన్ని గ్రహాలు ఇతని చుట్టూ తిరగటం వల్ల సూర్యుడు గణపతిగా చెప్పబడ్డాడు. సూర్యుని ఇంద్రుడని అంటే దేవతలకు రాజుగా కొనియాడబడ్డాడు. మన కంఠం నుంచి వెలువడే స్వరం కూడా సూర్యుని వరమే. "రవ" అంటే స్వరం. రవి-స్వరం-రవం. రవి అంటే స్వరమును ఉత్పత్తి చేసేవాడు. ఉచ్ఛారణ ప్రసాదించేవాడు కనుక "ఉద్గీథ" అని కూడా అంటారు. మహాభారతంలో యుధిష్ఠరుని స్తుతి ఈ విధంగా ఉండేది.

**త్వామింద్ర మహుస్త్వం రుద్రస్త్వం విష్ణుస్త్వం ప్రజాపతిః**
**త్వమగ్నిస్త్వం మనః సూక్ష్మం ప్రభుస్త్వం బ్రహ్మ శాశ్వతమ్**

**అర్థం :** హే సూర్యదేవా! నీవు ఇంద్రుడవు, రుద్రుడవు, విష్ణువు, ప్రజాపతివి, అగ్నివి, మనస్సుకు ప్రభువు, బ్రహ్మవు.

వస్తుతః దేవ సంస్కృతి సూర్యోపాసన ద్వారా భారతీయ ఆధ్యాత్మిక జీవనం యొక్క ఉన్నత ఆదర్శాలను తెలుపుతుంది. "సత్యం తాతాన్ సూర్యః" (ఋగ్వేద 1-105-12). ఈ వాక్యం ఆధ్యాత్మిక జీవనశైలికి ప్రతీక. వైదికకాలం నుంచి సూర్యుని ఆచార్యునిగా ప్రతిష్ఠించుకున్నారు. వైదిక యుగం నుండే ఉపనయనంలో విద్యార్థి అంజలిని (దోసిలి) జలంతో నింపి ఆచార్యుని మంత్రం పఠించే విధానమున్నది. **శ్రేష్ఠం సర్వధాతమం తురం భగస్య ధీమహి (ఋగ్వేదం 5-82-1)** ఏ విధంగా సూర్యుడు వెలుగునిచ్చి ప్రపంచమందలి అంధకారం దూరం చేస్తాడో అదే విధంగా ఆచార్యుడు శిష్యుని అజ్ఞానాంధకారం నుంచి దూరం చేస్తూ ఉంటాడు.

మానవునికి సూర్యునికి ఆదికాలం నుండి ఇప్పటివరకు లోతైన, భావనాత్మక సంబంధం ఉన్నది. ఆయన మండేగోళం మాత్రమే కాదు మానవ మాత్రునికి ప్రాణదాత, జీవన సంరక్షకుడు, సాంస్కృతిక వికాస కారకుడు కూడా. సూర్యుని లక్షణములు సక్రమమైన ఆధ్యాత్మిక ఉన్నతిని సూచిస్తుంది. మన చిరపురాతన దేవ సంస్కృతిలోని మహత్వపూర్ణ తత్వములన్నింటికి సూర్యునిదే ప్రధాన భూమికేనని అనుకోవడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. అందువల్లనే యజుర్వేదంలో **"సూర్యో జ్యోతి జ్యోతిః సూర్యః స్వాహా (3-9)** నుండి ప్రశ్నోపనిషత్తులో **"ప్రాణః ప్రజనాముత్ధయత్యేష సూర్యః" (1-8)** ద్వారా సూర్యుని మహిమను గానం చేశారు. సూర్యుని మార్తండుడని కూడా అంటారు. ఎందువల్లంటే మృత అండం (బ్రహ్మాండం) నుండే సమస్త జగత్తుకు తమ వేడితో వెలుగుతో జీవన దానం చేస్తున్నాడు. ఇలాంటి ఆదిదేవుని మహిమ ఎంత స్తుతించినా తక్కువే.

– *అఖండజ్యోతి, జూన్ 1993*

**[redacted]న్న పెద్ద జబ్బు - అయాచితంగా రావాలి డబ్బు.**

# మరపురాని ఉపదేశం పూజ్యులైన గురుదేవుని దయాగుణం

ఒకసారి శ్రీరామశర్మగారు రైలులో అజ్మీరు వెళ్ళుతున్నారు. ఆ బోగీలోనే ఒక స్త్రీ కూడా ఉంది. అజ్మీరులో ఒక మహాయజ్ఞం జరుగుతోంది. వారు ఒంటరిగా ప్రయాణిస్తున్నారు. వారితో బాటు ఒక మరచెంబు, పరుపు చుట్ట ఉన్నాయి. వారెప్పుడూ ఒక మహాత్మునిగా, గురూజీలాగా కనబడరు. రైలు పెట్టెలోని స్త్రీ రోదిస్తూ ఉంది. గురూజీ కారణమడుగగా "క్రిందటి నెలలోనే తనకు భర్త వియోగం సంభవించిందనీ, సంతానం లేదనీ, అజ్మీరులో జరుగబోయే మహా యాగానికి గురుమూర్తులైన శ్రీ శ్రీరామశర్మగారు మధుర నుండి వస్తున్నారనీ వారి దర్శనం కోసం వెళ్ళుచున్నాననీ, దానివల్ల తనకు శాంతి లభించవచ్చు, లేదా! జీవితం అంతమవవచ్చు" అని చెప్పింది.

ప్రతి స్టేషనులోను గురూజీ ఆమెను చిరునవ్వుతో ఊరడిస్తూ, ధైర్యం చెప్పుతూ, నీరు త్రాగిస్తూ ఉన్నారు. స్వామీజీతో తనకు పరిచయం ఉన్నదని, వారి దర్శనం చేయిస్తాననీ చెప్పుతూ వచ్చారు.

ఇంతలో అజ్మీరు స్టేషను వచ్చింది. యజ్ఞస్థలాన్ని చేరుకునేటప్పటికి ఆ స్త్రీ ఆశ్చర్యానికి అవధులు లేకపోయాయి. ఎందుకంటే దారిలో తనను ఊరడిస్తూ అనునయిస్తూ కష్టాన్ని గురించి ఉపశమనం కల్గిస్తూ మంచినీళ్ళు ఎవరు అందించారో వారే గురూజీ అని తెల్సికొంది. వారు ఆమెకు వసతి ఏర్పాటు చేయించి యజ్ఞ మండపానికి వెళ్ళిపోయారు.

మరుసటి రోజు అచ్చటి కార్యకర్త ఐన మోహనలాలును పిలచి ఒక అనాథ బాలుడ్ని తీసికొని రమ్మన్నారు. వారు రెండు రోజులు తిరిగి, వైద్యురాలైన శ్రీమతి సక్సేనాని కలిసారు. వారివద్ద రెండు రోజుల క్రితమే జన్మించిన బాలుడున్నారు. తల్లి గతించింది. తండ్రికి తిరిగి వివాహం చేయాలని, బాలుని వదిలించుకోవాలనీ కుటుంబ సభ్యులు తలపోస్తున్నారు. స్త్రీ వైద్యులైన శ్రీమతి సక్సేనా ఆ బాలుని శ్రీ మోహనలాలుజీకి ఇచ్చింది. ఆ బాలుని గురూజీ దగ్గరకు తీసికొని వచ్చారు. మొదట ఆమె ఆ బాలుని కులం గురించి అనుమానపడింది. ఆ విషయాన్ని గ్రహించి గురూజీ ఆ బాలుని శరీరాన్ని తన చేతులతో తాకుతూ, వీనిని బ్రాహ్మణుని చేసాను. ఇప్పటి నుండి ఈ బాలుని నీ కొడుకుగా పెంచుకో. నాక్కూడా వీడు కుమారుడే అని చెప్పారు.

ఈ రోజు ఆ బాలుడే బిలాసపురంలో ఇంజనీరుగా ఉన్నాడు. తన తల్లిని ఎంతో గొప్పగా సేవిస్తున్నారు. గురూజీ యొక్క అవ్యాజమైన కృప తనకు పునర్జన్మ ప్రసాదించిందని అంటుంది. "నిరాశా సముద్రంలో మునిగి తేలుతున్న తనను గట్టు ఎక్కించి కొత్త జీవితాన్ని ప్రసాదించారు. బాలున్నిచ్చి నాలో జీవాన్ని పోసారు. ఇప్పుడు నేను వృద్ధురాలినై పోయాను. అనామకులైన వారి జీవితాల్లో పరమపూజ్య గురూజీ మనోబలాన్నిచ్చి కొత్త జీవితాన్ని కల్పించారు. జీవితాన్ని కొత్త దారిలో నడిపించారు" అని ఆనందంగా చెపుతుంది.

**"వయం రాష్ట్రే జాగృయామ పురోహితాః"** "ధర్మ సంస్కృతిని రక్షించటానికి కాల పురుషుడు, మహాకాలుడు బలిదానాన్ని కోరతాడు. మరుగుతున్న ఎర్రని రక్తం కావాలి. ఎవరైన సాహసవంతులుంటే ముందుకు రండి. శిరస్సు ఖండించుకొని కాలపురుషుణ్ణి తృప్తి పరచండి. గురు గోవింద సింహ ఇలా ఆహ్వానించారు. ఈ ప్రకటన విని సభ నిశ్శబ్దమైంది. ఒక యువకుడు సాహసంతో లేచి గురుదేవుని ఎదుట నిలబడి దేవా! నేను బలిదానం ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాను. గురూజీ వానిని పర్దాలోపలికి తీసికెళ్ళి ఒక క్షణంలో తిరిగి వచ్చారు. వాని చేతిలో రక్తసిక్తమైన ఒక కత్తి ఉంది. తిరిగి ఆగర్జన వినిపించింది. ఎవరైన బలిదానం చేయగల సాహసికులు ఉన్నారు? అని వెంటనే మరొక యువకుడు లేచి ఆత్మాహుతి గావించాడు. గర్జన ప్రతిధ్వనించింది. ఈ విధంగా ఐదు సార్లు ఆత్మ బలిదానం జరిగింది. సమావేశం పూర్తవటానికి ముందే గురూజీ ఆ ఐదుగురినీ ఒక్కొక్కరిని పిలవగా వారు పర్దా తొలగించుకొని బయటకు వచ్చారు. ఏ ఒక్కరి శిరస్సు ఖండింపబడలేదు. కేవలం ముఖాన్ని ఆచ్ఛాదించుకొని ఉన్నారు. ఎవరైతే తమంతట తాము బలిదానం చేసికోవటాన్కి సిద్ధపడుతారో వారు సంస్కృతిని, ధర్మాన్ని రక్షించటానికి సమర్థులౌతారు. అహంకారం, కోరిక, ఆశ, విషయలోలుత్వం, మోహం, భోగలాలసలచే విముక్తి పొందకుండ, రాష్ట్రాన్ని, సంస్కృతిని కాపాడలేరు."

ఐదువిధాలైన ఈ బలిదాన కథను వినిపిస్తూ పూజ్యులైన గురుదేవులు నవ యుగ నిర్మాణం కోసం యువ సైనికులు, ప్రేమలు, అహంకారాన్ని విడచిపెట్టాలని ఉద్బోధించారు. మమతను, అహంకారాన్ని విడచిపెట్టటమే ఆశిరోచ్ఛేదనం అని గురుగోవింద సింగ్ చాటారు. ఈ త్యాగము ఆత్మార్పణ భావానికి అడ్డంకిని తొలగిస్తుందని భావము.

1958 సం॥ జరిగిన సహస్ర కుండీయ గాయత్రీ మహాయజ్ఞంలో పండిత శ్రీరామశర్మ గురువులు తమంతట తాము ఆత్మ త్యాగం చేసికోగల మహాత్ములకోసం పిలుపునిచ్చారు. తర్వాత కూడా చాలాసార్లు ప్రకటించారు. ఆయన ఆహ్వానంపై స్వల్పంగా గాని, పూర్తిగా గాని సమర్పించుకోగల్గటానికి కార్యకర్తలు ఇప్పటివరకు లక్షల సంఖ్యలో వచ్చారు. 1958 సం॥లోని సహస్ర కుండీయ గాయత్రీ మహాయుగంలో వైదీక మంత్రాలను ఉటంకిస్తూ సృజన సైనికులను ప్రేరేపిస్తూ యుగాన్ని పటిష్టపరచారు. "వయం రాష్ట్రే జాగృయామ పురోహితాః" అంటే పురోహితుల మంతా రాష్ట్రాన్ని జాగృతపరచి సజీవంగా చేద్దాం అని అర్థము.

[redacted]ద్ర పతనం - మరువకు మంచిభావాల మననం.

## గాయత్రి - 24 శక్తి ధారలు (18)

# ప్రాణాగ్ని

గాయత్రీ దేవి యొక్క 24 నామాలలో, రూపాలలో "ప్రాణాగ్ని" ఒకటి. ప్రాణం అంటే సర్వత్రా వ్యాపించే ఒక మహాచైతన్య ప్రవాహం. అది ప్రచండ రూపం దాల్చితే, దాని శక్తి అగ్నిగా ప్రకటితమవుతుంది. ప్రాణతత్వం యొక్క తీవ్రత, ప్రచండతలను "ప్రాణాగ్ని" అంటారు. అగ్నిని దాహకమని జ్యోతిర్మయి అని కూడా అంటారు. ప్రాణాగ్ని దివ్య సామర్థ్యం ఎక్కడ ప్రస్ఫుటితమవుతే అక్కడ మలినత్వము, కల్మషము నాశనమయి తీరుతాయి. ఈ సామర్థ్యం ఉత్పన్నమయినచోట అంధకారం కనిపించనే కనుపించదు. సర్వం ప్రకాశవంతం అవుతుంది. ప్రాణాగ్ని సామర్థ్యము మీ చుట్టు పక్కల క్షేత్రాన్ని ప్రభావితం చేస్తుంది. పదార్థములు, ప్రాణులు అనుకూలం అవుతాయి. ప్రాణాగ్ని మెండుగా పొందిన వ్యక్తులని ఓజస్వి, తేజస్వి, మనస్విని అని విభజించవచ్చు.

ప్రాణాగ్ని విద్యను పంచాగ్ని విద్య అని అంటారు. కఠోపనిషత్‌లో యముడు నచికేతునికి పంచాగ్ని విద్య నేర్పించి కృతకృత్యుణ్ణి చేసాడు. ఇది పంచప్రాణాల విజ్ఞానం, ప్రయోగము ద్వారా దీనిని సొంతం చేసుకున్నవారు మహా ప్రాణులవుతారు.

గాయత్రి శబ్దానికి అర్థం ప్రాణాన్ని రక్షించేది. అందుకే గాయత్రిని ప్రాణాగ్ని అంటారు. గాయత్రి సాధన ప్రాణశక్తిని తీవ్రంగా ప్రచండంగా తయారు చేస్తుంది. ప్రాణవంతు డయ్యాడనడానికి ప్రమాణం సత్ప్రయోజనం కోసం సాహసం ప్రకటించగలగడమే! సామాన్యులయితే స్వార్థం కోసం పాపకర్మలు చేసి జీవితం గడుపుకోవడానికి దుస్సాహసాలు చేస్తూ ఉండడం చూస్తూంటాం. సదుద్దేశ్యాలను అమలుపరచాలనే ఊహ ఎప్పుడో ఒకసారి వస్తుంది. దాని కోసం పాటుపడక తప్పదు. ఆదర్శపూర్వకమైన జీవితం గడపాలంటే నియంత్రణ, క్రమశిక్షణా పాటించాలి. చెడు మార్గంలో నడిచే వారినుంచి దూరంగా ఉండాలి. అట్టి వారికి ఎటువంటి సహాయం చేయకూడదు. ఈ ప్రబల పురుషార్థం మహాప్రాణులు చెయ్యగలుగుతారు. ప్రాణవంతులలో సత్ప్రయోజనాలకు సాహసవంతమైన అడుగులు వెయ్యడం, త్యాగం, బలిదానం వంటి ఆదర్శములు, సత్సంకల్పములు దృఢంగా ఉండటం దృష్టిగోచరమవుతుంది. అవినీతిని ఎదుర్కొనడం, కష్టతరమైన పరిస్థితులలో ధైర్యంగా ఉండటం, నిరాశాజనకమైన పరిస్థితులలో కూడా మంచి రోజులొస్తాయని ఆశతో ఎదురు చూడటం ప్రాణవంతుల లక్షణం.

– *అనువాదం : టి. జ్ఞానప్రసూన*

## కదిలించే కళ్లు

35.సీ॥ *మరణభయము నన్ను మరలిపొమ్మంచును*
*మాటిమాటికి చెప్పి మాయచేసె*
*సంకల్పశక్తియే సాదరంబుగ జూచి*
*వెన్నుతట్టి నిలచి వింతచూపె*
*చలిచూడ పులివోలె చంకలెత్తగనీక*
*గజగజఒణికించి ఘనతచూపె*
*మోముపైనున్నట్టి ముఖ్యమౌ అంగాలు*
*వెకిలిగానను చూసి వెక్కిరించె*

తే॥ మనసు మించిన పగవాడు మహినిలేడు
మనల పీడించునట్టిది మనసెయనుచు
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

36.సీ॥ *ఇరువది దినములు నింపుగా నడువంగ*
*వశమాయె మనసైతె వదిలె భయము*
*నేను పుట్టిన యట్టి నేలయేఇదియంచు*
*మనసుకు తోచంగ మరులు గొలిపె*
*గోముఖంబును దాటి కొండపైకెక్కుచు*
*తాపసులుండేటి తలముదాటి*
*నందీనవనముకు నన్నురమ్మంచును*
*ఆజ్ఞయందెను నాకు నంతలోన*

తే॥ సంతసంబున నేనంత సాగిపోయి
గురువు గారిని దర్శింప చేరువిధము
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

*రచన–మధుర కవయిత్రి*
*పొన్నూరు హైమవతీ శాస్త్రి*

**[redacted]నికి ఆభరణాలు - ఆత్మ సౌందర్యానికి ఆదర్శాలు.**

# జన సైన్యం

మొదటి ప్రపంచ యుద్ధం జోరుగా సాగుతున్న రోజులు. భారతదేశం ఆంగ్లేయులచేత పాలింపబడేది. ఆంగ్లేయులకు లక్షల సైన్యం అవసరమైంది. భారతీయ రాజుల నుండి సైనాన్ని తీసుకోవడానికి నిశ్చయించుకున్నారు. రెసిడెంట్ అని పిలవబడే వారి ప్రతినిధి ఈ విషయమై బైసల్మేర్ రాజ్యానికి వచ్చాడు. అక్కడి రాజైన జవహార్‌సింగ్ పేరిట వైస్రాయ్ నుంచి లేఖను తీసుకొచ్చాడు. జైసల్మేర్ సైనాన్ని బ్రిటిష్ సైన్యంలో కలపాలని అందులోని సారం. అటువంటి పత్రాలు వినతిపూర్వక ఆదేశాలు.

రాజు ఆ రెసిడెంట్‌ను సాదరంగా ఆహ్వానించాడు. ప్రత్యేకమైన అతిథిగృహంలో ఆయన్ని ఉంచారు. తన వచ్చిన కారణాన్ని వైస్రాయ్ గారి లేఖని అతను రాజుకి అందించాడు. లేఖను చదివి రాజు చింతించాడు. జైసల్మేర్ రాజ్యానికి ప్రత్యేకించి సైన్యమంటూ ఏదీలేదని ఆ రెజిడెంట్‌కు చెప్పాడు. తన సైనికులను వారి సేవకందించలేనని చెప్పాడు.

రెసిడెంట్ నవ్వాడు "మీరు మమ్మల్ని పిచ్చివాళ్ళను చేద్దామనుకోకండి. సైన్యం లేకుండా రాజ్యం ఎలా సాగుతుంది. మీరు మీ సైనాన్ని అప్పగించి తీరవలసిందే." "సైన్యాన్ని పోషించగల ఆర్థిక స్థోమత మాకు లేదు. రాజ్యం నడపడానికీ, పౌరుల్లో శాంతిని నెలకొల్పడానికి కావలసినంత కొంతమంది సైనికులను మాత్రం వినియోగిస్తాం" అని నచ్చచెప్పాడు. "ఆ రెసిడెంట్ సైన్యం లేకుండా దేశాన్నెలా రక్షించుకుంటారు? ఎవరైనా మీ మీద దండెత్తి వస్తే ఏం చేస్తారు.

**రాజు :** మా ప్రజలే మా సైన్యం. ఈ ఆత్మబలంతోనే ఎటువంటి కష్టాన్నైనా ఎదుర్కొంటాం. ఐదారుగంటల్లోనే మేము మా సైన్యాన్ని ఏకత్రితం చేసుకుంటాం.

**రెసిడెంట్ :** ఇవన్నీ అబద్ధాలు. నేను సైన్యం లేకుండా వెనక్కి వెళ్ళను. మీది నియమిత సైన్యమైనా కాకపోయినా, మీరు మీ సైన్యాన్ని నాకు అప్పగించండి. ఆ సేన మీ ఖజానా నుండి జీతం తీసుకున్నా తీసుకోకపోయినా, అది నాకు సంబంధం లేదు. ఇక్కడి జనాభా ప్రకారం నేను ఐదువేల మంది సైనికులని తీసుకుని వెళ్తాను.

ఇక మాటలతో తేలే విషయం కాదనిపించింది రాజుకి, ఏదో ఒకటి చేయాలి. ఆయన సరేనన్నాడు. "రేపు పొద్దున మీరు నా సైన్యాన్ని చూడండి. అప్పుడే మీరు నా మాటలు నమ్ముతారు" అన్నాడు.

రాజు తనదగ్గరున్న గుర్రాలు, ఒంటెలను అదే రోజు ఊరు ఊరూ పంపించాడు. "పదిహేను నుండి ముప్పైఐదేళ్ళ మధ్య పురుషులందరూ సూర్యోదయానికి ముందు జైసల్మేర్ చేరుకోవాలి. ఎవరి దగ్గర ఏ ఆయుధం ఉంటే అది తీసుకురావాలి. గుర్రాలు, ఒంటెలు, ఎడ్లబండ్లు, ఏ వాహనమైనా సరే, తమ దగ్గరున్నవి తీసుకుని రావాలి" వాయువేగంతో ఆదేశమంతా, రాజ్యమంతా ఈ వార్త పాకిపోయింది. పొలాల్లో, కళ్ళాల్లో, మేతబీడుల్లో, రాళ్ళు కొడుతూ, గడ్డికోస్తూ, గోతులు తవ్వుతూ ఎక్కడివారు అక్కడ్నుంచే ఉన్న పళంగా వెంటనే రాజధానికి బయల్దేరారు. ఒంటెలు, గుర్రాలు, ఎడ్లబండ్లు గుంపులు గుంపులుగా రాజధానిలో కలుసుకున్నాయి.

ఆంగ్ల రెసిడెంట్ తన శయనాగృహంలో పడుకుని ఉన్నాడు. ఒంటెలు, గుర్రాలు, ఎద్దుల శబ్దాలు, ఘంటానాదాలు వినిపించాయి. అతనేదో కలకంటున్నాడనుకున్నాడు. మెల్లిగా చప్పుడు పెరిగింది. నిద్ర చెడిపోయింది. విపరీతమైన అరుపులు కర్ణకఠోరంగా తయారైంది. ధైర్యం సడలి మేడమీదకి వెళ్ళాడు.

అప్పటికే రాజు మేడమీద కూర్చునిఉన్నాడు. రండి ఆంగ్ల మహాశయా! అని ఆయనకోసం వేచి ఉన్నట్టు పిలిచాడు. రెసిడెంట్ కళ్ళప్పగించుకుని చూడసాగాడు. సుదూర దిఙ్మండలం వరకూ నలువైపు ఒంటెలు, గుర్రాలు, ఎడ్లు, ఎడ్లబళ్ళు సమూహాలుగా ఉన్నాయి. గోధూళి మిన్నంటుకుంది, తుపాకులు, కొడవళ్ళు, కత్తులు, కర్రలు పట్టుకుని జనం రాసాగారు. పశువుల హీంకారాలు ఆకాశాన్ని మించిపోతున్నాయి.

"ఇదీ మా సైన్యం. రాత్రికి రాత్రి ఎంత మందొచ్చారో చూడండి. మా భూమంటే మాకంత మోహం. మా స్వాతంత్ర్యానికి హాని జరుగుతుందనిపించగానే మా పౌరులంతా త్యాగానికి సిద్ధమవుతారు. తమని తాము అర్పించుకునే పౌరులున్నంతసేపు ఎలాంటి అపాయమూ దరికి చేరదు" గర్వంగా చెప్పాడు రాజు.

రెసిడెంట్ ఆశ్చర్యపోతూ చూస్తున్నాడు. తమ దేశం కోసం త్యాగం చేయగల వీరుల్ని చూసి చలించిపోయాడు. "నిజమే మహారాజా జనసైన్యాన్ని మించి వేరే సైన్యం లేదు. ఇప్పుడు మీ మాటలు పూర్తిగా నమ్ముతున్నాను. మావైపు నుండి మీకెలాంటి ఒత్తిడి కలగజేయమని నేను మాటిస్తున్నాను. వీరిలో ఎవరైనా బ్రిటిష్ సేనలో చేరదలుచుకుంటే, అది మా సౌభాగ్యంగా భావిస్తాము.

కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయిన రెసిడెంట్ తన భావాన్ని ఇలా తెలియచేసాడు.**"ఏ రోజైతే ఈ జన చైతన్యం సంపూర్ణ భారతావనికి రాష్ట్రచైతన్యంగా రూపొందుతుందో, ఆ రోజు ఎటువంటి విదేశీ శక్తి ఆ దేశాన్ని తన ఆధీనంలో ఉంచుకోలేదు. ఏ రోజు ఇది సంభవమవుతుందో అదే రోజు భారతదేశం సంపూర్ణ విశ్వానికి మకుటాయమానమవుతుంది"**

*– అఖండజ్యోతి, జులై 1995*

*అనువాదం : శ్రీమతి జయలక్ష్మి*

**[redacted] మానవత్వానికి కావాలి మృదుభావం.**

మనం-మన ఆరోగ్యం

# పాటించవలసిన నియమాలు

శరీరం, మనస్సు ఆరోగ్యంగా ఉండాలంటే సరైన ఆహారం తీసుకోవడంతోపాటు విహారం గురించి కూడా శ్రద్ధ తీసుకోవాలి. క్రింది అంశాలను బాగా మననం చేసి, వీటిని మన జీవితంలో అంతర్భాగాలు చేసుకోవాలి.

## 1. శ్రమించడంలో సమతూకం

ప్రతి ప్రాణికీ శ్రమించడం అత్యవసరం. శ్రమించకపోతే అవయవాలు పటుత్వం కోల్పోతాయి. ఆహారం జీర్ణం కావడంలో, రక్త ప్రసరణలో ఆటంకాలు ఏర్పడతాయి. సమతూకంతో కూడిన శ్రమను మన దినచర్యతో ముడిపెట్టాలి. శరీరంలోని అవయవాలు తమ తమ పనులను సక్రమంగా చేయడం, రక్త ప్రసరణ సక్రమంగా ఉండడం, జీర్ణ మండలంలోని ప్రక్రియలు సవ్యంగా సాగడం, అన్నింటికీ శారీరక శ్రమ అవసరం.

బద్ధకంతో సమయాన్ని వృథా చేసేవారు, శ్రమించకుండా తప్పించుకునేవారు మలబద్ధకం, గ్యాస్, తలనొప్పి, మధుమేహం, కీళ్లవాతం వంటి రోగాలకు గురి అవుతారు. సృష్టిలోని ఇతర ప్రాణులు ఆహారాన్ని వెదకడానికీ, గూడుకొరకు, ప్రమాదాలనుండి తప్పించుకోవడానికీ, వినోదానికీ పరుగులు పెడుతూ ఉంటాయి. అవి బలిష్టంగా ఉండటానికి కీలకం ఇదే.

## 2. విశ్రాంతిలో సమతూకం

శ్రమించిన తర్వాత తగినంతగా విశ్రాంతి తీసుకోవడం అత్యవసరం. అత్యధిక శ్రమవల్ల ఖర్చయిన శక్తి పుంజుకుని, తర్వాతి పనులకు తగినంతగా జీవం పొందడం అవసరమనే సిద్ధాంతం ఆధారంగా పగలు తర్వాత రాత్రి, జీవితం తర్వాత మరణం అనే క్రమం ఏర్పడింది. శ్రమకూ, విశ్రాంతికీ ఇలాంటి సంబంధమే ఉంది. మనం శరీర శ్రమ చేయాలి. దానితోపాటు విశ్రాంతి తీసుకోవడం మరువకూడదు. జీవితంలో సమతూకానికి ఆధారం ఇదే. ఇందువల్ల శక్తి, శాంతి లభిస్తాయి.

ఆరునుండి ఎనిమిది గంటలపాటు గాఢంగా నిద్రపోవడం తప్పనిసరి. నశించిన జీవకణాల తొలగింపు, కొత్త జీవకణాల నిర్మాణం నిద్రావస్థలో వేగంగా జరుగుతాయి. శ్రమవల్ల జీవకణాలు నశిస్తాయి. కనుక అలసట కలుగుతుంది. శరీరం శ్రమ తర్వాత విశ్రాంతి కోరుతుంది. తగినంతగా నిద్రపోయిన తర్వాత శరీరంలో జీవశక్తి పెరుగుతుంది. కొత్త స్ఫూర్తి అనుభవం అవుతుంది.

పనిచేసి అలసిపోయిన తర్వాత కూర్చుని లేక పడుకుని శారీరకమైన అలసటను తొలగించుకుని, మనసులో మాత్రం దురాలోచనలు సుళ్లు తిరుగుతూ ఉండే స్థితి విశ్రాంతి కానే కాదు. ద్వేషం, క్రోధం, ప్రతీకారం, హింస మున్నగు భావాలు చెలరేగుతున్నప్పుడు శరీరం విశ్రాంతి తీసుకున్నా శాంతి లభించదు. మనస్సు అశాంతిగా ఉంటే, దాని చెడు ప్రభావం శరీరం మీద పడుతుంది. అందువల్ల ధమనులు శిథిలం అవుతాయి. రక్తం చెడిపోతుంది. ఆరోగ్యం దెబ్బతింటుంది. మానసిక ఒత్తిడిని తొలగించుకుని శారీరికమైన అలసటను అంతం చేసుకున్నప్పుడే విశ్రాంతి సార్థకం అవుతుంది.

మానసిక ఒత్తిడివల్ల జనానికి అంత త్వరగా నిద్ర పట్టదు. శరీరం మంచంమీద పడుకుని ఉంటుంది. కాని అందువల్ల విశ్రాంతి లభించదు. ఇలాంటి స్థితి వచ్చినప్పుడు శరీరాన్ని వదులు (రిలాక్స్) చేయడానికి ప్రయత్నించాలి. విశ్రాంతి తీసుకునేముందు మన మనస్సును చింతలు లేకుండా చేయాలి. శరీర అవయవాలన్నింటినీ పూర్తిగా వదులుచేసి, కళ్లు మూసుకోవాలి. మీరు శరీరంలోని ఏదో ఒక అవయవాన్ని గురించి ఆలోచించడం ప్రారంభించినప్పుడు లోపల లోపల ఆ అవయవం వదులు అవుతుంది. ఈ విధంగా క్రమంగా రెండు చేతులు, కాళ్లు, తల మున్నగు అవయవాలను గురించి ఆలోచిస్తే అన్ని అవయవాలనూ వదులు చేయడం అభ్యాసం చేయడం వల్ల మనం కోరుకున్న ప్రకారం శరీరాన్ని వదులు చేసి పూర్తి విశ్రాంతిలోని ఆనందాన్ని పొందడం సులవు అవుతుంది. ఒకటి రెండు వారాలలో ఈ క్రియ సహజం అయిపోతుంది. విశ్రాంతి తీసుకునే ముందు ఇలా శరీరాన్ని వదులు చేయడంవల్ల మంచి గాఢ నిద్ర పడుతుంది. ఆ అనుపాతంలో శరీరానికి శక్తి లభిస్తుంది. తర్వాత పని చేయడానికి అది జీవం జవం తెచ్చుకుంటుంది.

## 3. శ్వాస సరిగా తీసుకోవాలి

ఊపిరితిత్తులు శ్వాస ద్వారా మన రక్తాన్ని శుభ్రపరుస్తాయి. ప్రతి జీవాణువుకూ ప్రాణవాయువు అందుతుంది. స్వచ్ఛమైన వాయువు అందడానికై లోతుగా గాలి పీల్చుతూ ఉండాలి. రాత్రి నిద్రపోయేటప్పుడు ముఖం కప్పుకోకూడదు. నిద్రపోయేటప్పుడు గది కిటికీలు తెరచి ఉంచాలి. గాలి ముక్కుతోనే పీల్చడం

[redacted] ఎన్నో దానాలున్నా జ్ఞానదానమే మిన్న.

అలవాటు చేసుకోవాలి. వంగి కూర్చొనకూడదు. కూర్చునేటప్పుడూ, నడిచేటప్పుడూ నడుము నిటారుగా ఉండాలి. లోతుగా గాలి పీల్చే అలవాటు చేసుకోవాలి. అందువల్ల స్వచ్ఛమైన గాలి తగినంతగా లోపలికి ప్రవేశించడానికీ, మలినమైన గాలిని బయటకి వదలడానికీ వీలు కలుగుతుంది. ఇంటి నలువైపులా పచ్చదనం వ్యాపించి ఉండాలి. ఇందువల్ల మనకు అత్యవసరమైన ప్రాణవాయువు లభిస్తుంది. చెట్లమధ్య ఇల్లు కట్టుకోవాలి. లేదా, ఇంటి చుట్టూ చెట్లు పెంచాలి. నియబద్ధంగా ప్రాణాయామం చేయాలి.

## 4. పరిశుభ్రత

శరీరంలోని ప్రతి అవయవాన్నీ శుభ్రపరచాలి. రోమకూపాలు మున్నగు వాటిని శుభ్రపరచే పద్ధతులు నేర్చుకుని అమలు చేయాలి. ప్రాతఃకాలం చన్నీళ్లతో స్నానం చేయాలి. స్నానానికి ముందు చర్మాన్ని రుద్ది ఎర్రబడేలా చేయాలి. స్నానం తరువాత చర్మాన్ని ఆరబెట్టాలి. శరీరంలోని ప్రతి భాగాన్నీ శుభ్రంగా ఉంచడం, ఎక్కడా మురికి చేరకుండా చూడడం, ఇదే స్నానం చేయడంలోని ఉద్దేశ్యం. భోజనం తర్వాత త్రేన్చాలి. నోరు శుభ్రం చేసుకోవాలి. పళ్లమధ్య మెతుకులు, ఇతర ఆహార కణాలు ఇరుక్కోకుండా చూడాలి. ఆహారం, నీరు, గాలి అన్నీ స్వచ్ఛంగా ఉండేటట్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

మూత్రశాల, మరుగుదొడ్డి, వంటింటి తూములు నీరు నిల్వచేసే స్థలం మున్నగునవి శుభ్రంగా ఉండేటట్లు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలి. ఎందుకంటే, రోగక్రిములు ఇలాంటి స్థలాలలో పెరుగుతాయి. అవకాశం చూసుకుని శరీరాన్ని రోగగ్రస్తం చేస్తాయి.

## 5. త్వరగా నిద్ర లేవాలి

ప్రాతఃకాలం త్వరగా లేవడం, రాత్రి త్వరగా నిద్రపోవడం అన్నది ఒక నియమంగా చేసుకోవాలి. బ్రహ్మ ముహూర్తంలో ప్రాణశక్తి అత్యధికంగా ప్రవహిస్తూ ఉంటుంది. ఉదయం త్వరగా నిద్రలేచే వ్యక్తి క్రియాశీలంగా, స్ఫూర్తిమంతుడుగా, ప్రసన్నుడుగా, ఆరోగ్యవంతుడుగా ఉంటాడు.

## 6.నడక

ప్రాతఃకాలంలో త్వరగా నిద్రలేచి నడవడం అన్ని వయస్సుల వారికీ ఆరోగ్యకరం. శరీరకంగా బలహీనంగా ఉన్న వ్యక్తులు, స్త్రీలు, పిల్లలు, వృద్ధులు అందరూ తమ తమ పరిస్థితులకు అనుగుణంగా నడక అలవాటు చేసుకుని ప్రయోజనం పొందవచ్చు. దీని వల్ల హాని కలిగే అవకాశం ఏమాత్రం లేదు. నడవడం తేలిక అయిన వ్యాయామం.

నడక శరీరానికే కాక మనసుకూ మంచిదే. దీని వల్ల మనస్సు ప్రసన్నం అవుతుంది. కనుకనే, దీన్ని మించిన వ్యాయామం లేదని ప్రపంచంలోని ఆరోగ్య నిపుణులూ, మహాపురుషులూ సలహా ఇచ్చారు. తమ నిత్యజీవనంలో ఆ నియమాన్ని అమలు జరిపారు. రోజంతా దుకాణాలలో కూర్చునేవారు, కార్యాలయాలలో కూర్చుని పని చేసేవారందరికీ నడక అత్యవసరం. ఇందువల్ల శరీరం అంతటికీ సహజంగా వ్యాయామం జరుగుతుంది.

నడకవల్ల శరీరం అంతటిలో జవ సత్వాలు నిలచి ఉంటాయి. ఊపిరితిత్తులకూ, గుండెకూ బలం పెరుగుతుంది. ఆహారం జీర్ణమవుతుంది. శరీరాన్ని శుభ్రపరచే అవయవాలు వేగంగా పనిచేస్తాయి. నియమబద్ధంగా ఆరుబయట నడవడం వల్ల, తద్వారా స్వచ్ఛమైన గాలి పీల్చడం వల్ల దీర్ఘాయువు లభిస్తుంది. లావుగా ఉన్న వ్యక్తులు సన్నబడతారు. ఉచ్ఛ్వాస నిశ్వాసముల ప్రక్రియ మెరుగవుతుంది. అందువల్ల వ్యాయామం, ప్రాణాయామాలు రెంటి ప్రయోజనమూ చేకూరుతుంది. లోతుగా శ్వాస పీల్చుతూ వేగంగా నడవడం వల్ల మలబద్ధకం తొలగిపోతుంది.

## 7. ఉషా పానం

సూర్యోదయానికి పూర్వం కాలకృత్యాలకు వెళ్లే ముందు రెండు గ్లాసుల మంచినీళ్లు త్రాగడం ఉషాపానం. ఆ మంచినీళ్లు రాగి పాత్రలో రాత్రంతా ఉంచినవి అయితే అది అత్యుత్తమం. ఉషాపానం వల్ల మూత్రపిండాలు బలపడతాయి. కళ్ళలో వెలుగు పెరుగుతుంది. తల వెంట్రుకలు త్వరగా తెల్లబడవు. శరీరం నిర్మలం అవుతుంది. ప్రేవులు క్షాళన అవుతాయి. మలబద్ధకం తొలగిపోతుంది.

## 8. నవ్వు, నవ్వించు

ఈనాడు నవ్వుల గలగలలు, పకపకలు మాయమైపోయాయి. కృత్రిమ సభ్యత మనిషి నిద్రనూ, శాంతినీ హరించివేసింది. ఎటు చూసినా ఉరుకులూ, పరుగులూ. ఎవరికీ క్షణం తీరిక లేకుండా పోయింది. ఒకవేళ తీరిక దొరికినా ఒత్తిళ్ల కోసం, చింతల కోసం, ఉద్విగ్నతలకోసం మాత్రమే. ఫలితంగా శరీరం రకరకాల రోగాలకు నిలయం అవుతోంది. చిత్ర విచిత్రమైన మానసిక రోగాలు మనిషిని క్రుంగతీస్తున్నాయి. శరీర ఆరోగ్యం కోసం, మానసిక సంతులనం కోసం, జీవితంలో సుఖ శాంతుల కోసం మనిషి రకరకాల

[redacted]తో సేవించు, శత్రువు కూడా మిత్రునిగా భాసించు.

సాధనాలను సమకూర్చుకుంటున్నాడు. వీటన్నిటి కోసం ఎంతో సమయం, శ్రమ, డబ్బు ఖర్చు చేస్తున్నాడు. కానీ, అతడికి మిగిలేవి మాత్రం అసఫలత, అశాంతి, అసంతృప్తి మాత్రమే.

మనిషి ఒత్తిడి నుండి ముక్తి పొందినప్పుడే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఈ విముక్తి ఔషధాలవల్ల కలుగదు. నవ్వుల గలగలల వల్ల లభిస్తుంది. మానవ స్వభావంలోని రహస్యాలు తెలిసిన నిపుణులు చెపుతూన్న మాట ఇది. పకపకా నవ్వడం, కడుపుబ్బ నవ్వడం, ఆనందం వెదజల్లేలా గలగలా నవ్వడం, విరగబడి నవ్వడం ఇదే ఈ సమస్యలన్నింటికీ దివ్య ఔషధం. నవ్వు వల్ల కలిగే బహుముఖ ప్రభావాలపై, ప్రయోజనాలపై వైజ్ఞానిక నిపుణులు ఎన్నెన్నో పరిశోధనలు చేశారు. నవ్వును మించిన ఔషధం లేదని వారు తేల్చి చెప్పారు.

### కొన్ని ఇతర సూచనలు

1. తుమ్ము, మూత్ర విసర్జన, మల విసర్జన మున్నగువాటిని ఆపకూడదు.

2. మనస్సును ఇంద్రియాలకు అధిపతిగా పరిగణించాలి. సంయమనంతో కూడిన జీవన విధానాన్ని అనుసరించాలి.

3. సింథటిక్ వస్త్రాలను, బాగా బిగుతుగా ఉండే వస్త్రాలను ధరించకూడదు.

4. ఎత్తు మడమల బూట్లను, చెప్పులను వాడకూడదు.

5. నియమబద్ధంగా ఉపాసన, సాధన తప్పనిసరిగా చేయాలి. అనగా జపం, ధ్యానం, పూజ, స్తోత్రం మున్నగునవి.

6. సదాచారాన్ని, సద్భావనను, సేవాభావాన్ని, పరోపకారాన్ని అలవరచుకోవాలి.

7. అసూయ, ద్వేషం, చింత, భయం, క్రోధం మున్నగు వాటిని దూరంగా ఉంచడానికి ప్రయత్నించాలి.

8. రోజూ ఒక గంటసేపు సత్ సాహిత్యాన్ని స్వాధ్యాయం చేయాలి.

9. మనస్సును నిశ్చింతంగా ఉంచుకుని ఆరునుండి ఎనిమిది గంటలపాటు గాఢ నిద్ర పోవాలి.

10. టీవికి దగ్గరగా ఉండి చూడకూడదు. రోజంతటిలో ఒకటి రెండు గంటలకు మించి టీవి చూడకూడదు.

11. కృత్రిమ వాసనలకు దూరంగా ఉండాలి.

పైన చెప్పిన నియమాలను పాటిస్తూ మనమంతా ఆరోగ్యంగా, సుఖంగా జీవించడానికి ప్రయత్నిద్దాం. ఈ నియమాలను పాటించడానికి ఇతరులకు ప్రేరణ ఇద్దాం.

## కనువిప్పు

*ఒకానొక గ్రామమున ఒక ఉపాధ్యాయుడు ఉన్నాడు. అతడు భాషాప్రవీణుడు, ప్రసంగములో దిట్ట. అతనిది బట్టతల. ప్రక్కనవున్న గ్రామమునకు అవసరకార్యార్థమై ప్రయాణమైనాడు. దారిలో ఎండవేడిమికి తాళజాలక, సమీపములోనున్న మఱ్ఱిచెట్టు నీడలో విశ్రమించుటకై పై ఉత్తరీయాన్ని నేలపై పరచి వెల్లకిలా పడుకుని సేదతీరుచూ చెట్ల కొమ్మలపై దృష్టిని పెట్టాడు.*

*విశాలమైన కాండము, శాఖోపశాఖలుగా విస్తరించి ఉన్న ఆ మహావృక్షాన్ని చూస్తూ భగవంతుని సృష్టిలోని అందాలకు తన్మయుడయ్యాడు. ఇంతలో అతని దృష్టి మఱ్ఱికాయలపై నిలచింది. భగవంతుడు ఇంతపెద్ద చెట్టుకు అంత చిన్న కాయలనిచ్చి మఱ్ఱికాయలకు గుర్తింపు లేకుండా చేసినాడేమిటి? అదే భగవంతుడు నేలపై ప్రాకే చిన్న గుమ్మడి తీగకు సుమారు 20 కిలోల గుమ్మడికాయను, పుచ్చతీగెకు కూడా అదే రీతిలో 15 కిలోల పుచ్చకాయను ప్రసాదించడేమిటి? ఏమి ఈ సృష్టి వైచిత్ర్యము అంతుబట్టకున్నది! అనుకుంటూ ఉండగా చల్లగాలికి చెట్టు నీడన కునుకుపట్టింది.*

*ఆ గాలికి మఱ్ఱిచెట్టు పై కొమ్మలనున్న మఱ్ఱికాయలు రాలి, ఒకటి వేగంగా వచ్చి అతని బట్టతల మీద పడ్డది. ఆ మఱ్ఱికాయ దెబ్బకు త్రుళ్ళిపడిలేచి అబ్బా! ఎంత ప్రమాదము తప్పినది. ఈ చిన్న మఱ్ఱికాయ దెబ్బకే ప్రాణంపోయినట్లు కాగా, తాను ఊహించినరీతిగా మఱ్ఱిచెట్టు సైజుకు తగ్గ మఱ్ఱికాయ పైనుంచి పడినచో తన ప్రాణాలు ఈ పాటికి గాలిలో కలసిపోయేడివి కదా! అని భావించుచూ లేచి కూర్చున్నాడు.*

*ఇప్పుడు భగవంతుని సృష్టిలోని వైచిత్ర్యము కన్నులకు కట్టినట్లు అవగతమైనది. సృష్టిలోని ఒక్కొక్కటి, ఒక్కొక్క రీతిలో మానవజాతికి ఉపయోగపడేలా భగవంతుడు సృష్టించాడు. గుమ్మడి, పుచ్చ మున్నగు భూమిపై ప్రాకెడి తీగజాతులు మానవునికి ఆహారాన్ని అందించేలాగ, మఱ్ఱిచెట్టు లాంటి మహావృక్షాలు మానవునికి నీడనిచ్చేవిగా, కలపనిచ్చేవిగా, రక్షణ కల్పించేవిగా సృష్టించాడు. అతనికి ఈ రీతిగా కనువిప్పు కలిగినది.*

**[redacted]ంలో వచ్చే కష్టాలు, భవిష్యత్తుకవే నిక్షేపాలు.**

### సాధనా విజ్ఞానం

# లోచూపు అలవరచుకో

ఈశ్వరుని పొందడమే మానవ జీవితానికి పరమలక్ష్యం. పరమసత్యం కూడా ఇదే. పరమసత్యం లభ్యమైనపుడు ఇక పొందవలసిందంటూ ఏదీ ఉండదు. ఇందుకోసమే మానవుని ప్రయత్నం సాగాలి.

సత్యం, తథ్యం అనేవి రెండూ భిన్నమైనవి. తథ్యాన్ని అన్వేషించి తెలుసుకోగలుగుతాము. కానీ సత్యం అలా కాదు. దానికి అన్వేషణ అవసరం లేదు. అంతటా ఉన్న ఆ సత్యం అన్వేషించే వాడిలో కూడా ఉంది. తన వద్ద లేని వాటికోసం వెదకాలి కానీ తనలోనే ఉన్న వస్తువును ఎక్కడని వెదకగలం. మానవుడు తన బాహ్య ఆవరణలు తొలగించుకున్నప్పుడు సత్యం ప్రస్ఫుటమవుతుంది. సాధకునిలో ఆ ప్రకాశం వెలుగొందుతుంది. ఇది అంతర్జగత్తులోకి చేసే ప్రయాణం, ఆధ్యాత్మిక సాఫల్యం.

తథ్యం బాహ్యజగత్తుకు సంబంధించింది. భౌతిక విజ్ఞానానికి సంబంధించిన అన్వేషణలన్నీ ఈ తథ్యంపైనే ఆధారపడ్డాయి. తథ్యం చేత విజ్ఞానం శక్తివంతమూ, ప్రామాణికమూ అవుతుంది. విజ్ఞానం నుండి దీనిని తీసివేసినపుడు కేవలం కల్పనలు తప్ప వేరే ఏమీ మిగలవు. ఈ విశ్వం పరబ్రహ్మ ప్రకాశం. విజ్ఞానం తనదైన రీతిలో దాన్ని పొందే ప్రయత్నం చేస్తుంది. భౌతిక పదార్థ సంబంధమైన సత్యాన్ని తెలిసికొని ఆవిష్కరణలు జరిపినపుడు అందరూ తథ్యాన్నే వెదికారు. కానీ సత్యం అనేది ఒక్కటే. మిగిలినవన్నీ ఈ సత్యాన్నే నిరూపించే తథ్యాలే. ఈ విశ్వమంతా పరమాణువులతో తయారైందని చెప్పబడుతుంది. ఈ పరమాణు పదార్థం ఒక సముదాయంగా కాక చాలా సముదాయాలుగా విభజింపబడింది. ఈసూక్ష్మ పరమాణు సముదాయాలన్నీ ఒక కేంద్రం ఆధారంగా పరిభ్రమిస్తున్నాయి. కానీ ఈ తథ్యం కూడా ఆఖరుకు ఏ సత్యమైతే ఉందో దానినే నిరూపిస్తుంది. మూలకణాల విశ్లేషణ జరిపినపుడు ఉద్భవించే ప్రశ్న ఒక్కటే. ఈ గతిశీలతకు మూలమేది? ఈ ప్రేరణ ఎక్కడ నుండి కలిగింది? అని. స్థూల జగత్తులోనైతే సునాయాసంగా ఏదీ ఉండజాలదు. దాని వెనుక ఏదో ప్రేరణ, కారణం ఉండి ఉండాలి. ప్రత్యక్షంగా ఏ కారణమూ దొరకనపుడు పరోక్షప్రేరణ ఉందని తెలుసుకొని అంగీకరించాలి. ఇదే పరమ సత్యానికి ప్రమాణం. స్థూల విశ్వంలో చేసే అన్వేషణలన్నీ తథ్యానికి సంబంధించినవి. అన్వేషిస్తున్నది తథ్యాన్నికానీ సత్యాన్ని కాదు. ఎందువల్లనంటే సత్యం అనేది అనుభూతి జ్ఞానం. అది బుద్ధి ద్వారా తెలుసుకోబడజాలదు. దేనినైనా తెలుసుకోగల సామర్థ్యం మహాప్రజ్ఞకు తప్ప మరి దేనిలోనూ లేదు. అదే పరమ జ్ఞానం.

కొమ్మనుండి ఒక పువ్వును కోస్తే అది కొన్ని గంటలకే వాడిపోతుంది. జీవం ఉన్న కొమ్మనుండి కోసినపుడు జీవంతో సంబంధం తెగిపోతుంది. వేరుగా మానజాలదు. ఈ ప్రక్రియకు మూలమేది? వృక్షజగత్తులో కొమ్మనుండి పువ్వును కోశాక అది వాడిపోకుండా సంవత్సరాల తరబడి ఉండడమనేది ఎన్నటికీ జరుగదు. ఈ భౌతిక ప్రక్రియకు ఒక భౌతికం కాని కారణం ఉందన్న విషయాన్ని అంగీకరించాలి. భౌతిక జగత్తు ఈ కారణాలను వందల సంవత్సరాల నుండి అన్వేషిస్తోంది. తథ్యాన్ని కనుక్కుంటోంది. వారు కనుక్కుంటున్న ఈ తథ్యం "ఆదికారణం" నిరూపణతో ముడిపడి ఉంది.

శరీరం మరణ ధర్మం కలది. మరణ ధర్మమేమిటన్న విషయాన్ని గురించి లోతుకు వెళ్తే ఎక్కడి నుండి జీవితం మొదలైందో ఆ బిందువునే చేరుకుంటాము. మృత్యువును గురించి శరీర శాస్త్రజ్ఞులు–వృద్ధాప్యం కారణంగా అవయవాల్లో పటుత్వం తగ్గిపోతుంది, కనుక చైతన్యం వృద్ధ శరీరాన్ని వదిలి వెళ్తుంది–అని చెప్తారు. కానీ శరీరం ఆరోగ్యంగా ఉండి వయస్సు ఎక్కువగా లేనివారు కూడా మృత్యువాత పడుతున్నారు కదా! కారణం చూస్తే ఏదో 3,4 రోజులు జ్వరం వచ్చిందనో, 3,4 వాంతులైనాయనో అంటారు. వైద్యులు కూడా పెద్దగా ఆలోచించరు. ఇది ప్రాణం పోయేటంత పెద్ద కారణం కాదు అంటారు. వయస్సుతో నిమిత్తం లేకుండా శరీరాన్ని వదలాలనే మార్గదర్శనాన్ని చైతన్యానికి ఎవరిచ్చారు? వైద్యుల వద్ద జవాబులేని ప్రశ్న ఇది. ఒకవేళ వ్యాధే కారణమనుకుంటే అతనికి ఆవ్యాధి ఎందుకు వచ్చింది? పరిస్థితులూ, వాతావరణమే కారణమా? అదే వాతావరణంలో ఉన్న మిగిలిన వారికెవ్వరికీ రాని ఆ రోగం ఇతనికే ఎందుకు రావాలి? ఇలా ప్రశ్న పరంపరలను వేసుకుంటూ వెళ్తే దొరికే సమాధానం ఒకటే. ఆ లౌకిక శక్తి అని. మృత్యు సంబంధమైన వేర్వేరు తథ్యములు అప్రత్యక్ష రూపంలో పరమచైతన్యాన్నే నిరూపిస్తాయి. మానవుడు యథార్థంగా పొందవలసింది ఈ పరమ చైతన్యాన్నే.

[redacted] మంచిది, క్షమించి మరచిపోవటం మరీ మంచిది.

ఈ విరాట్ విశ్వం ఈశ్వరీయ చైతన్యానికి సాకారరూపం. ఇక్కడ అణువణువులో పరమాత్మ శక్తి ద్యోతక మౌతుంది. మట్టి వస్తువులను చూసినపుడు కుమ్మరిని, యంత్రాలను చూసినపుడు దానిని తయారు చేసినవాడిని, ఇంటిని చూసినపుడు ఇల్లు కట్టినవానినీ, ఇంట్లో వాళ్ళనీ ఊహించుకుంటాం. అదే విధంగా విశ్వంలో అణువణువునా ఆ దేవుని శక్తి ప్రతిబింబిస్తుంది. ఈ ప్రతిబింబం తథ్యం. సత్యాన్ని సాక్షాత్కరించుకోవటానికి ఇంకా ముందుకు వెళ్ళాలి. తథ్యం ద్వారా ఈశ్వరుని ఎడల విశ్వాసం ఉత్పన్నమౌతుంది. ఈ విశ్వాసం ఆధారంగా అంతరంగంలోని మురికిని కడిగేసుకుంటూపోతే, ఆత్మ ప్రకాశం, ఈశ్వరుని ప్రకాశం ప్రస్ఫుటమౌతాయి. ఇదే మానవుని ముఖ్య లక్ష్యం. కానీ ఈ రోజుల్లో దాన్ని పొందే మాట అటుంచి దాని దరిదాపులకు కూడా మనం వెళ్ళలేక పోతున్నాం. సత్యాన్ని చేరుకోవాలంటే మనం పట్టుకునే ఆధారం సత్యమైందిగా ఉండాలి. ఇనుపముక్కల్ని ఆకర్షించడానికి ఇనుప అయస్కాంతం అవసరం. ఉన్నతమైన జ్ఞానాన్ని పొందడానికి సుశిక్షితుడైన ఆచార్యుడు అవసరం. ముల్లుని తీయాలంటే ముల్లే కావాలి. ఇదే విధంగా సత్య తత్వాన్ని తెలుసుకోవాలంటే వ్యక్తిత్వం సత్యమైందిగా ఉండాలి. అసత్య వ్యక్తిత్వం ద్వారా సత్యాన్ని సాక్షాత్కరించుకోలేము.

ప్రస్తుతం మనం మన జీవన వ్యవహారాల్లో బయటకు కనిపిస్తున్నట్లుగా అంతరంగంలో లేము. మానవుడు తన అసలు నైజాన్ని బయటకు కనబడనివ్వడం లేదు. అసత్యం, మిథ్యా ముసుగును కప్పుకుంటున్నాడు. ధర్మ గ్రంథాల్ని తొమ్మిది రోజులు పారాయణం చేస్తాడు. ఖురాన్, బైబిల్ క్రమం తప్పక చదువుతాడు. భగవంతుని విగ్రహం ముందు కూర్చుని పూజలు చేస్తాడు. ఇష్టదైవాన్ని దర్శించుకోవాలని, ఆత్మసాక్షాత్కారం కలగాలని అనుకుంటాడు. కానీ తన వ్యక్తిత్వం మొత్తం అసత్యంపైన ఆధారపడిందని తెలుసుకునే ప్రయత్నం మనిషి చేయడం లేదు. అటువంటపుడు అతనికి సత్య జ్ఞానమెలా కలుగుతుంది?

సత్యాన్ని పొందాలంటే మన సంపూర్ణ వ్యక్తిత్వాన్ని సత్యంపైన ప్రతిష్ఠింపచేయాలి. వ్యక్తిత్వంలో సాధుత్వం, సరళత, స్వచ్ఛత ఉండాలి. మనలోని చెడును చెడుగా, అసత్యాన్ని అసత్యంగా తెలుసుకోవాలి. సత్యాన్ని చేరాలంటే ఇంకా చేయాల్సి ఉంది. విత్తనం నుంచి చెట్టు విస్తరించినట్లు మన ఆలోచనల్ని విస్తరింపచేయాలి. అప్పుడు మనకు పరమతత్వ సాక్షాత్కారంలో మూడింట రెండు వంతుల సఫలత కలిగినట్లు భావించవచ్చు. మిగిలిన ఒక వంతు ఈశ్వరుని ఎడల శ్రద్ధతో ఉన్నతమైన ఆదర్శాల కోసం సమర్పించుకోవడంలో పూర్తి చేసుకోవచ్చు. కాని ప్రస్తుత కాలంలో ఉన్న బాధ ఏమిటంటే వ్యక్తి తన దుర్గుణాన్ని దుర్గుణమని ఒప్పుకోడు. మంచి దిశగా పయినిస్తున్న మొదటి అడుగునే అణచివేస్తే ఈశ్వరునీ, ఆత్మనూ పొందేదెలా? ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఉంది. ఎవరైతే చాలా మంచివారని కీర్తింపబడుతున్నారో, వారి వాస్తవ జీవితంలోకి తొంగి చూసినపుడు స్వచ్ఛత, సరళత, సహజత్వం అగుపించవు. ఎవరైతే అపరాధులనీ, చరిత్రహీనులనీ అంటారో వారిలో సహజత్వము, సరళత కనిపించవచ్చు.

ఈ దోషం కూడా సత్యాన్ని చేరడానికి అవరోధమవుతుంది. చెడ్డవాడిని చెడ్డవాడుగా, మంచివాడిని మంచివాడుగా చెప్పగలిగితే ఇద్దరికీ శుభం కలుగుతుంది. అలా కానప్పుడు పైకి మంచిగా కనిపించే వారికి ఇంకా ప్రోత్సాహం కలిగి, వారు మారరు. దుర్జనులకున్న ప్రోత్సాహం చూసి మంచితనమున్న వారు కూడా చెడిపోయేందుకు సిద్ధపడతారు. ఈ విధంగా రెండు రకాల వారు కూడా పతనోన్ముఖులై సత్యతత్వానికి దూరమవుతారు. సమాజంలో వాస్తవికతకు రక్షణ ఉంటే మానవులు ఇప్పటి దురవస్థ నుండి విడివడి ఆత్మోన్నతి పొందుతారు. సంస్కృతీ, సభ్యతలు కలవారు అవుతారు.

నేడు ప్రపంచంలో స్థితి దిగజారడానికి కారణం మానవుడు భౌతిక విషయములందు అతిగా మునిగిపోవడం. కానీ ఉండాల్సింది అందుకు భిన్నంగా. మానవుడు అంతర్ముఖుడై చెడును ప్రక్షాళన చేయాలి. తనను తాను శోధించుకుని, పొందవలసిన దాని కోసం ప్రయత్నించాలి. ఆ విధంగా జరగడం లేదు. అందువల్లనే వేల సంవత్సరాల కాలంలో ఒక బుద్ధుడు, ఒక క్రీస్తు, ఒక మహమ్మదు, ఒక వివేకానందుడు, ఒక అరవిందుడు మాత్రమే జన్మించగలిగారు. ఇది చాలా ఆశ్చర్యకరం, దుఃఖకరం, దౌర్భాగ్యకరం. మానవుడు తన దౌర్భాగ్యాన్ని కడిగేసుకోవలసిన సమయం ఆసన్నమైంది. అతడు ప్రకృతిలో ప్రవేశించి సత్యాన్ని శోధించే ప్రయత్నం చేయాలి. ఈ స్థూల జగత్తులో తథ్యరూపంలో పరమసత్యం మనకు ప్రత్యక్షంగా ఉంది. తథ్యం ఆకారం. సత్యం తత్వమూ, నిర్వికారమూ అయిన వాస్తవిక రూపం. అదే ఈశ్వరుడని పిలవబడుతుంది. అందరికీ యదార్థమైన శుభం ఇందులోనే ఇమిడి ఉంది. ఆ పరమ సత్యాన్ని పొందడానికి మనం ప్రయత్నించాలి.

*– అనువాదం : కె. అరవిందమ్మ*

**[redacted]హాత్ముల పాదాలు కాదు, వారందించే మహోపదేశాలు.**

వ్యక్తి నిర్మాణం

# ఆత్మ విశ్వాసం పెంచుకోండి

భగవంతుడు మానవశరీరమును అణువణువున అద్భుత శక్తులతో నింపాడు. వాటిని ఉపయోగించుకోగలగాలి. "నేను యోగ్యుడను, ప్రతిభాశాలిని" అనే భావన హృదయాంగమము చేసుకోవాలి, లక్ష్యం వైపు వీరత్వంతో, ధైర్యంగా అడుగులు వేయాలి.

**శాంత చిత్తంతో ఇలాంటి ఆలోచనలు మరల మరల చెయ్యాలి. "నేను బలవంతుడను, ధృడ సంకల్పం కలిగి ఉన్నాను. నేను సర్వసమర్ధుడను, నేను ఆశిస్తున్న అభిలషిస్తున్న వస్తువులు తప్పనిసరిగా లభిస్తాయి. నేను నా లక్ష్యం వైపు అడుగులు వేస్తున్నాను. సాధించుకుంటాను, నా మనస్సు ఆత్మ విశ్వాసంతో నిండిపోయింది. నేను ధైర్యంగా లక్ష్యం వైపు అడుగులు వేస్తున్నాను"**

**ఇలా ఆటో సజెషన్ (Auto Suggestion) చేయటంలో అద్భుతశక్తి ఉన్నది. ఎలాంటి ఆలోచనలు భావపూర్వకంగా తిరిగి తిరిగి చేస్తామో అలాగే జరుగుతుంది. "నేను బలవంతుడను, శక్తిమంతుడను" అనే ఆలోచనలను విశ్వాసంతో చెప్పుకుంటే, ఆత్మ విశ్వాసం జాగృతమవుతుంది. ఎలాంటి ఆజ్ఞ ఇస్తామో మనలోని శక్తులు అలాగే పనిచేస్తాయి.**

సఫలత ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తుంది. ఒక సఫలత ఇంకొక దానికి ప్రేరణ ఇస్తుంది. ఒక పని ఎంచుకుని పూర్తి చేయాలి. దాని తర్వాత ఇంకా పెద్ద పని ప్రారంభించాలి. దీనిని తప్పనిసరిగా పూర్తి చేయాలి. దీని తరువాత ఇంకాస్త పెద్దపని, సమయం పట్టే కష్టసాధ్యమైన పని చేపట్టి, సమస్త శక్తిని ఉపయోగించి సాధించుకోవాలి. ఈ విధంగా క్రమక్రమంగా పెద్ద పెద్ద పనులు తలపెట్టాలి. కండిషన్ ఒక్కటే చేపట్టిన ప్రతి పని పూర్తి చేయాలి.

మనస్సు కర్తవ్యం నుంచి, కఠోర పరిశ్రమ నుండి దూరం వెళ్ళే ప్రయత్నం చేస్తుంది. చాల కష్టపడ్డావు. విశ్రాంతి తీసుకో, ఇక చాల్లే అనేటువంటి ఆలోచనలు వస్తాయి. ఇలాంటి ఆలోచనలతో యుద్ధం చేయవలసి వస్తుంది. అనుకున్న మార్గం నుంచి ప్రక్కకు వస్తే తిరిగి ఆ మార్గంలోకి వెళ్ళాలి, గమ్యం చేరాలి. ఒక్కొక్కసారి బద్ధకం వచ్చి పని ఆపేద్దామనిపిస్తుంది. వివేకాన్ని ఉపయోగించుకుని మనను మనమే రక్షించుకోవాలి. మెలకువగా ఉన్నప్పుడు మనస్సును ఏదో ఒక పనిలో నిమగ్నమయేటట్లు చూడాలి. **స్థిరమైన మనస్సు శక్తుల భాండాగారం.**

తల్లిదండ్రులు, పిల్లలకు ఇది నేర్పాలి. 'నేను చెప్పింది చెయ్యి' అనటం వల్ల వారిలో దుర్బలత వస్తుంది. ఆత్మవిశ్వాసం తగ్గుతుంది. ఇతరుల మీద ఆధారపడటం జరుగుతుంది. వారిని మంచి పనులలో నిమగ్నమయ్యేటట్లు చూడాలి. ప్రోత్సాహించాలి. ప్రోత్సాహంతో పిల్లలలో ఉత్సాహం పెరుగుతుంది. విశ్వాసం లభిస్తుంది. ఏ పిల్లలనైనా కొట్టి తిట్టి వారి ఉత్సాహాన్ని నీరుగార్చటం మహా పాపం. మనిషి బాహ్యజగత్తునుంచి ప్రేరణ కొరకు ఎదురు చూస్తుంటారు. ఇతరుల ప్రోత్సాహం, సహాయం లభించనపుడు నిరాశ చెందుతారు. ఈ పరిస్థితి మంచిది కాదు. బయటనుంచి ప్రేరణ ఎందుకు ఆశించాలి? మన ఆత్మ విశ్వాసాన్ని మనమే వికసింపచేసుకోవాలి. మన సంకల్పాలకు ఇతరుల మీద ఆధారపడకుండా, ఆంతరిక ప్రేరణతో ముందుకు సాగాలి. ఆత్మ విశ్వాసంతో, స్వావలంబనతో కార్యం సాధించుకోవాలి.

పనిని మధ్యలో వదిలివేయటం వల్ల ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. పని మధ్యలో ఆపేద్దామనిపిస్తే కఠినమైన పని మిగిలిఉందని గుర్తుంచుకోవాలి.

ఒక్కొక్కసారి సఫలతల కారణముగా మితిమీరిన విశ్వాసంతో పెద్ద పెద్ద ప్రణాళికలు, శక్తికి మించిన ప్రణాళికలు వేస్తుంటారు. ఇటువంటివి విఫలమైనప్పుడు ఆత్మ విశ్వాసం దెబ్బతింటుంది. ప్రణాళికలు రూపొందిస్తున్నపుడే ఈ విషయం మనస్సులో ఉంచుకోవాలి.

సాధారణ వ్యక్తులు కూడా అభ్యాసం వలన తమ శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవచ్చు. ఒక విషయాన్ని నిరంతరం అభ్యసించటం వల్ల, దానిపై పట్టువస్తుంది. కొంతమంది అంటుంటారు. "మాకు కూడా అలాంటి వసతులు, వస్తువులు, ఉన్నట్లయితే మేము కూడా ఉన్నతి సాధించే వాళ్ళం" అని. ఇటువంటి వారిలో ఆత్మవిశ్వాసం తక్కువగా ఉంటుంది. 'సఫలత' అనేది మనస్సులో ఉండాలి. ఆత్మవిశ్వాసం నుంచే సఫలత లభిస్తుంది. ఎవరైతే ప్రతి పనిని మనస్సు పెట్టి ఆత్మ విశ్వాసంతో చేస్తారో, వారు తప్పనిసరిగా కావలసిన వస్తువులు, కోరిన పరిస్థితులు పొందుతారు.

మనిషి భగవంతుని యొక్క సర్వోత్కృష్ట, శక్తి సంపన్నుడైన కళాకృతి. సర్వోత్తమమైన దైవీశక్తుల ద్వారా అతని శరీరం, మనస్సు, ఆత్మ నిర్మాణం చేయబడింది. మనకు లభించిన శక్తులను పూర్తి విశ్వాసంతో ఉపయోగించుకున్నట్లయితే, మనలోఉన్న గుప్తశక్తుల భాండారం తెరచుకుంటుంది. ప్రతి కళాకారుడు తన శిల్పాలలో తన గుణములను ఆదర్శములను, దృష్టికోణమును ప్రకటీకరిస్తాడు. అలాగే భగవంతుడు మనిషిలో తన సంపూర్ణ యోగ్యతలను, దైవీ గుణాలను, విశేషతలతో నింపివేశాడు. కాని అనేకమంది తమ బద్ధకంతో ప్రయత్నలోపం వల్ల, అకర్మణ్యత దోషం వల్ల లేమి, కష్టాలు పడుతుంటారు.

ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరు మహత్వపూర్ణమైన వ్యక్తే. ప్రపంచంలో మీ అవసరం ఎంతైనా ఉన్నది. భగవంతుడు మమ్మల్ని ఒక దేవదూతగా ప్రపంచంలోని అజ్ఞానాన్ని దూరం చేయటానికి, సత్యం, న్యాయం, దయ విస్తరింపచేయటానికి పంపారు. మీ స్థానాన్ని మీరు చేపట్టాలి.

– *అఖండజ్యోతి, ఫిబ్రవరి, 1955*

[redacted] చేయలేనప్పుడు, చేయగలిగిందే అనుకోవాలి.

# పరమపూజ్య గురుదేవులు తమ సూక్ష్మీకరణ సాధన అనంతరం కార్యకర్తలకందించిన నిర్దేశనం

యుగఋషి, వేదమూర్తి, పరమపూజ్య గురుదేవులు తమ సూక్ష్మీకరణ సాధన తదుపరి గాయత్రీ పరివార్ కార్యకర్తలకు అందచేసిన ఒక మహత్వపూర్ణ నిర్దేశనమిది. ఈ విషయాన్ని పరమపూజ్య గురుదేవులు స్వయంగా అందరికి తెలుపుచూ, ప్రతి దినము దీనిని మననము చేస్తూ, తప్పనిసరిగా ఈ పనిని చేయాలని ఆదేశించారు.

❖ ఈ నా మనోభావాలను నా చేతి మూడువ్రేళ్లు కలసి వ్రాస్తూ ఉన్నాయి. నా ఈ భావాలను తెలిసికొనుటకు ఎవ్వరూ ఇష్టపడినా, ఇష్టపడకపోయినా ఈ నా ప్రణాళిక అమలు వ్యాప్తి జరుగుతూనే ఉంటుంది. అవి ప్రస్తుతం నా చేతిలోని కలం, పేపరు మరియు మూడు వ్రేళ్ళు ద్వారా పైన తెలిపిన నా భావ పరంపర వ్యాప్తి కొనసాగుతూనే ఉంటుంది. పై నా భావనల అమలు పరచెడి బాధ్యతను మీరు మరియు మన నిష్ఠా గరిష్ఠ కార్యకర్తలు తీసికోవాలి.

❖ ఈ విశాల ప్రణాళికకు ప్రేరణ భగవానుడు అందించుచున్నాడు. దివ్యసత్తా చెప్పిన వానిని వ్రాస్తూ ఉన్నాను. నా మస్తిష్కము మరియు హృదయంలోని అణువణువు దీనిని ప్రతిధ్వనింపజేస్తున్నవి మరియు దీనిని పూర్తి చేయుటకు తహతహలాడుచున్నాయి. ఈ ప్రణాళిక అమలు చేయుటకై ఎంతో శ్రమ, సమయము, సాధన, మనోయోగము, వెచ్చించాలి. వ్రాసెడివాని బొటనవ్రేలు, లేకపోయినా లేక కలము, కాగితం నిండుకొన్న ఈ ప్రణాళిక అమలు నిలిచిపోదు. ఏలనన రక్తము మరియు మస్తిష్కంలోని అణువణువు ఈ పనిని చేస్తున్నాయి. ఇంతేకాదు, దీనికి దైవీశక్తులు కూడా సహకరించుచున్నవి. మీకంటికి ఇది కనిపించినా, కనిపించకపోయినా ఇది ముమ్మాటికి నిజం.

❖ ఈ పని చాలా పెద్దది, ఎంత పెద్దదనగా దాని పేరే "యుగ పరివర్తన" దీనికై శక్తివంతులు, ప్రతిభాశీలురు నడుంబిగించి పని చేయాలి. దీని సత్ఫలితాలు అందరికీ అందించాలి. దీనిని పలుమార్లు చదవండి, ఈ మహత్తర వేళ నా శరీర అంగములవలె ఎవరైతే పని చేసెదరో వారందరు ఊహకందని సత్ఫలితాల పొందెదరు. మీ అందరి కృషి వెనుక ఒక సమన్విత శక్తి పని చేయుచున్నది. ఆ శక్తి ఈ విషయానికి అక్షరరూపం కల్పించుచున్నది. ఈ పని ఎలా పూర్తి అవుతుంది? ఇంత సాధన సామాగ్రి ఎచ్చట నుండి వస్తుంది? ఈ విషయాల గురించి మీరు ఆలోచించపని లేదు. ఎవరైతే దీనిని చేయాలని చెప్పారో వారే పైవన్నీ చూసుకొనెదరు. కావున మీరు కేవలం మరొకరికి తీసిపోనిరీతిగా సమర్పణతో సమయదానం ఇవ్వాలి.

❖ సాధన, యోగ్యత, నేర్పు మున్నగు వానిని రామకార్యంలో హనుమంతుడు వినియోగించిన రీతిగా మీరు వినియోగించాలి. హనుమంతుడు, రాముని సేవలో నిమగ్నమగుటకు పూర్వము, సుగ్రీవునికి సేవకునిగా భయంతో కాలము గడిపెడివాడు. ఎప్పుడైతే రాముని మహత్తరశక్తి ప్రభావము హనుమంతునిలో ప్రవేశించిందో, రామ కార్యాన్ని సంపూర్ణ భక్తి ప్రపత్తులతో పూర్తి సమర్పణ భావంతో పని చేయుట ప్రారంభించాడు. నూరు యోజనాల సముద్రాన్ని లంఘించి, సీత జాడ తెలిసికొని, లంకాదహనం గావించి, సంజీవి పర్వతాన్ని పెకలించి తెచ్చి, రామ లక్ష్మణులను తన భుజాలపై ఎక్కించుకొని వెళ్ళుట మున్నగు అనితరసాధ్యమైన పనుల చేసిన కీర్తి హనుమంతునికి మాత్రమే దక్కింది. మీలో ఏ ఒక్కరు హనుమంతుని కన్న తక్కువ కాకూడదనెడిది నా ఆశ మరియు కోరిక. మీరు ఈ పవిత్ర యుగపరివర్తన లక్ష్యసాధనలో మీ సహచరులకన్నా తీసిపోరాదు.

❖ ఏ పని ఎలా చేయాలి అనేది మీకు ఎప్పటికప్పుడు తెలియజేయబడుతూ ఉంటుంది. పని మారుతూ ఉంటుంది. విధానాలు కూడా మారుతూ ఉంటాయి. కాని ఒక్కటి మాత్రం ఎప్పుడూ గుర్తుంచుకోండి. ఎటువంటి సమర్పణ మరియు భక్తి భావంతో ఇంటినుండి బయలుదేరి వచ్చారో, అదే భావనను మా వద్ద దిన దినం పెంపొందించుకోండి. ఏ మాత్రం డీలా పడవద్దు. ఎట్టి పరిస్థితులలో మీ ఏకాగ్రత, లక్ష్యము చెదరకూడదు.

[redacted]దే మంచిపుస్తకం, దాంతోనే వికసిస్తుంది మస్తకం.

❖ చేయవలసిన పని విశాలతను అర్థం చేసుకోండి. లక్ష్యానికి, వెనువెంటనే చేరకపోయినా, దానిని చేరుకొనుట అనివార్యము. దీనినే అద్భుతం, నిరుపమానం, అసాధారణం మరియు ఇతిహాసం అని పిలిచెదరు. దీనికై పెద్ద సాధన కావాలి గుర్తుంచుకోండి. దీని బాధ్యతను దివ్య సత్తాపై మోపండి. మీరు ఈ మాత్రం చేయండి, మీ శ్రమ, సమయం, గుణకర్మలు, స్వభావాలు ఏ మాత్రం సడలనీయరాదు. విశ్రాంతిని గురించి ఆలోచించవద్దు. అహర్నిశలు ఒకే మాట గుర్తుంచుకోండి, మనము ఈ గొప్ప కార్యసాధనలో మన సర్వశక్తులనొడ్డి ఎంత ఫలితాన్ని సాధించాం? ఎంతముందుకు సాగాం? ఎంత భారాన్ని మోయగల్గుచున్నాం? స్వయంగా అధికంలో అధికంగా ఇతరుల గొప్పతనాన్ని మనము గుర్తించగలిగామా? స్వయం సేవకులుగా మారిన వేళ మన గౌరవ ప్రపత్తుల ఎదుగుదలను చవిచూచినామా? దీనిలో మీరు ఎదగాలి, ఆదర్శప్రాయులు కావాలి.

❖ మీరు మీ అలసటను మరియు సౌఖ్యాన్ని గురించి ఆలోచించవద్దు. అహంకారం పెంచుకోవద్దు. ఇది మీకు అగ్ని పరీక్ష. మీకు గల సమర్పణాభావానికి మీ గౌరవాలకు సార్థకతను చేకూర్చెడి పని ఇది. మీ సహచరుల యొక్క ఓర్పు, శ్రద్ధలకు ఇది కొలమానం. వారు రాత్రింబవళ్ళు మననం చేస్తూ ఉంటారు దీనిని.

❖ రానున్న రోజులలో మన మిషన్ పని అనేక విధాలుగా పెరుగుతుంది. మరచిపోవద్దు. నేటి నుండి ప్రతిదీ లెక్కించబడుతుంది. అందువలన మీలోని తత్పరత ఎంత ఉన్నతంగా ఉండాలంటే హనుమంతునిలోని కణకణము రామ కార్యాన్ని జపించిన రీతిలో, దానిని పదిమంది మెచ్చుకొనేలా ఉండాలి. మీలోని ప్రతి అంగము గురుసత్తా కార్యాన్ని చేపట్టాలి. రాముని పరివారంలో ఆరవవానిగా హనుమంతుడు చేరిన రీతిలో మీరు నా అంగాలలో ఒకటిగా మారిపోవాలి. మన అనుశాసనంలో వ్యతిరేకత రాలేదు కదా? మీ సహచరులు పనులను వ్యతిరేకించుట లేదు కదా? వారి సహకారం పరిపూర్ణంగా అందుకొంటూ ఉండాలి. మీరు దీనిని ఎప్పటికప్పుడు సరిచూసుకుంటూ ఉండండి.

❖ ఇది మహాకాలుని యోజన, తప్పక పూర్తి అవుతుంది. ఈ అగ్ని పరీక్ష సమయంలో మీ శరీరం, మనస్సు మరియు ఆలోచనలు తొట్రుపాటు చెందకూడదు. గొప్ప పనులను ఎల్లప్పుడు గొప్ప వ్యక్తిత్వమున్న వారే చేసెదరు. శరీర పొడవుతో ఉన్నతిని పొందలేరు. శ్రమ, మనోబలం, త్యాగం మరియు నిరహంకారములతో మాత్రమే ఉన్నతిని పొందెదరు. మీ ఉన్నతిని ఏకాగ్రతను ఎంతమాత్రము సడలనివ్వవద్దు. మీ పై నున్న విశ్వాసముతో, ఆశతో, అపేక్షగా నేను అడుగు ముందుకు వేస్తున్నాను. కావున ఇట్టి అత్యంత విషమ పరీక్షా సమయంలో మీరు వెనుకంజవేయవద్దు. వేసినచో తదుపరి పశ్చాత్తాప పడవలసి ఉంటుంది. – తస్మాత్! జాగ్రత్త!

– *గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్*

## శ్రీ గాయత్రీ శతకం

37. *"ఎన్నియో మహామంత్రమ్ము లిలనుగలవు*
*కాని నీ సమంబుగనేది కానరాదు"*
*అనెడు విశ్వాసమందర కందజేయు*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

*తా:– "ఈ భూమ్మీద దివ్యాతి దివ్యమైన మహామంత్రము లెన్నెన్నో కలవు. కాని, నీ మంత్రమునకు సాటివచ్చు యే మంత్రము మాకు కనిపించలేదు." అనే విశ్వాసాన్ని సాధకునికి అందించి ఆధ్యాత్మిక గుణ సంపన్నునిగా చేస్తుంది గాయత్రీమాత.*

*38. సద్గురునితోడ మంత్రమున్ చదువునెవరు*
*వాని నాతల్లి కరుణించి వరలజేసి*
*కార్య సాఫల్య భాగ్యమ్ము కలుగజేయు*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

*తా:– ఎవరు సద్గురుని యెంచుకుని ఆయన సహాయంతో గాయత్రీ మంత్రాన్ని నేర్చుకుంటారో అటువంటి సాధకుని ఆ మహామాత దయజూపి సహకరించి అనుకున్న కార్యం సఫలమయ్యే భాగ్యాన్ని కలిగిస్తుంది.*

*రచన : సహజ కవి, సాహిత్య రత్న,*
*శతక చతురానన, పద్య కవితాసుధానిధి*
*శ్రీ అయినాల మల్లేశ్వర రావు*

[redacted]స్తం విరామం, విరామానికి నేస్తం మంచి పుస్తకం.

# కృషికి వివేకము, వివేచన తోడైతే సంపదలు మనవెంటే

అతని పేరు చిన్ని కృష్ణన్. ఊరు, తమిళనాడులోని కడలూరు. తల్లిదండ్రులకు 4వ సంతానం. ముగ్గురు బాగా చదువుకొన్నారు. ఇరువురు డాక్టర్లు, ఒకరు న్యాయవాది, అతనికి చదువు సరిగా అబ్బలేదు. కావున తండ్రి తరచూ తిడుతూ ఉండేవాడు. ఆత్మన్యూనత ఆవరించింది. ఒంటరితనం అలవడింది. పెంపుడు జంతువులే తనకు నేస్తాలైనాయి. ప్రేమను పంచెడి గుణం, ఓర్పు మాత్రం వచ్చాయి.

తండ్రికి వ్యవసాయంతోపాటు చిన్నపాటి షాంపూవ్యాపారం ఉండేది, కొద్ది మోతాదులో షాంపూను పాకెట్లలో నింపి అమ్ముతూ ఉండేవాడు. తండ్రితో పాటు తనూ దీనిపై కొంత అవగాహన పెంచుకున్నాడు. 1982లో తండ్రి చనిపోగా, తన అన్నలు ముగ్వురూ షాంపూల వ్యాపారాన్ని వారి చేతులలోనికి తీసుకొన్నారు. 9 నెలల తదుపరి గతిలేక అన్నలను వీడి బయటకు రావలసి వచ్చినది. తనకాళ్ళపై తాను నిలబడి బ్రతుకుపోరాటం ప్రారంభించుట తప్పనిసరైనది చిన్ని కృష్ణన్‌కు.

చేతిలోనున్న రూ.15వేలను పెట్టుబడిగా పెట్టి షాంపూ తయారుచేసి చిన్న ప్యాకెట్లలోనింపి అమ్మకాలు ప్రారంభించాడు. ఆఫీసు అద్దె రూ.200/-, అడ్వాన్సు రూ.1000/- అట్లే ఫ్యాక్టరీ అద్దె రూ.300/- అడ్వాన్సు రూ.1200/-, షాంపూ ప్యాకింగ్ మిషన్ రూ.3000/- ఇదీ తన ఖర్చులు. దీనికి పేరు పెట్టుటకై తన పేరు చిన్ని కృష్ణన్‌లోని అక్షరాలను తీసికొని "ఛిక్" షాంపూ అని పేరు పెట్టి అమ్మకాలు మొదలుపెట్టాడు. కాని అమ్మకాలు అందుకోలేదు. కష్టాలు, కడగండ్లు, ఆటు-పోట్లు, ఎదురుదెబ్బలూ, వెటకారాలు, వెన్నుపోట్లు వెన్నాడాయి. మూడేళ్ళ వరకూ బ్యాంకు ఋణం కూడా లభించలేదు. అయినా ధైర్యాన్ని, ఉత్సాహాన్ని, ఆశనూ కోల్పోలేదు. నిరాశ, నిస్పృహలను తన దరిదాపులకు రానివ్వలేదు. ఆత్మవిశ్వాసం సడలనివ్వలేదు. విజయంవైపు ఆశగా చూస్తూ తనపని తాను చేస్తూ పోతూఉన్నాడు. ఉపాయాలు తట్టగానే అమలు చేస్తూ ఉండేవాడు. తనవద్ద ప్రచారానికి తగినంత ధనం లేదు ప్రచారం చేసినా అమ్మకాలు పెంచగలనన్న గ్యారంటీ లేదు. ఇట్టి స్థితిలో వినూత్నంగా ఆలోచించి, "ఇతర కంపెనీలకు చెందిన 5ఖాళీ షాంపూసాషేలు ఇచ్చిన ఒక ఛిక్ షాంపూసాషే ఉచితం" అని ప్రకటించుటతో చిక్ షాంపూ గురించి ప్రజలు తెలిసికొనుట ప్రారంభమైనది. అమ్మకాలు నెమ్మది నెమ్మదిగా అందుకోసాగాయి. దీనితో మరింత ఉత్సాహాన్ని పుంజుకొని, "5 ఖాళీ ఛిక్ షాంపు సాషేలకు ఒక నిండు సాషే ఉచితం" అని ప్రకటించాడు. దీనితో అమ్మకాలు పెరిగి నెలకు రూ.12 లక్షలుగా నమోదైనది. ప్రజలనాడిని కనిపెట్టి, తరువాత వివిధ సువాసనలతో షాంపును అమ్మకానికి ప్రవేశపెట్టాడు చిన్ని కృష్ణన్. దీనితో అమ్మకాలు కోటికి చేరాయి. ఇక వెనుతిరిగి చూడక వ్యాపార ప్రకటనలపై దృష్టి సారించాడు. గ్రామీణులకు గల సినిమా హీరోయిన్ల పట్ల ఆసక్తిని గమనించి, తద్వారా తన షాంపూను వారికి పరిచయం చేయుట, ప్రముఖ సినీనటుడు రజనీకాంత్ సినిమాలను స్పాన్సర్ చేశాడు. సినిమా విశ్రాంతి సమయంలో ప్రచార ప్రకటనలతోపాటు సినిమా చూసిన వారికి ఉచితంగా ఛిక్‌షాంపూ సాషేలు ఇస్తూ గ్రామీణ ప్రాంతంలోనికి చొచ్చుకుపోయాడు. డబ్బున్న పట్నవాసులకు హెర్బల్ ప్రొడక్ట్స్‌పై గల మక్కువను సొమ్ము చేసికొనెడి తలంపుతో హెర్బల్ షాంపూ మరియు హెర్బల్ పౌడర్‌ను "మీరా" బ్రాండ్ పేరుతో ప్రవేశపెట్టి అనూహ్య విజయాలను స్వంతం చేసుకున్నాడు. ఈ వరుస విజయాల జైత్రయాత్రతో పట్నవాసులు సులభంగా తయారుచేసుకొని ఆరగించలేని వంటింటి రుచులపై తన దృష్టిని సారించి "రుచి" బ్రాండ్‌ను పచ్చళ్ళతో ప్రారంభించి అనేక పదార్థాలను తయారుచేసి విక్రయించుట ప్రారంభించాడు.

ఆ పిమ్మట నారీలోకమంతా కోరుకొనెడి ముఖారవిందమును ఇనుమడింపజేసెడి ఫెయిర్‌ఎవర్, ఫెయిర్ నెస్ క్రీములను మరియు హెయిర్‌డైలను ''ఇండికా'' బ్రాండ్ పేరుతో అతిసునాయాసంగా విపణిలో ప్రవేశపెట్టి అనూహ్య అప్రతిహత విజయాలను తన సొంతం చేసుకొని, 15వందల రూపాయల పెట్టుబడితో ప్రారంభించిన వ్యాపారాన్ని అనతికాలంలో 1500 కోట్లకు చేర్చి "కృషికి వివేకం, వివేచన తోడైతే సంపదలు మనవెంటే" అనెడి దానికి నిలువెత్తు సాక్షిగా నిలిచాడు చిన్ని కృష్ణన్ మహాశయుడు.

ఆయన కంపెనీ పేరు కె.విన్‌కేర్ అతని పూర్తి పేరు సి.కె.రంగనాథన్ (చిన్నికృష్ణన్ రంగనాథన్). అతని ఊరి పేరు కడలూరు = కడలి+ఊరు. ఊరి పేరుకు తగిన విధంగా చిన్నికృష్ణన్‌లో సముద్రమంత ఓర్పు, సముద్రమంత పట్టుదల, సముద్రమంత కృషి దాగి ఉన్నాయి.

మనము కూడా చిన్ని కృష్ణన్ గుణగణాలను అందిపుచ్చుకుంటే యుగనిర్మాణము జరిగి సత్యయుగానికి దారితీస్తుంది. - ఇక విజయం మనదే.

- విషయం - "స్ఫూర్తి" మాస పత్రిక సౌజన్యంతో

[redacted]డే - పెద్దలకు క్షమాగుణం, పిన్నలకు వినయం.

ఆరోగ్యమే మహాభాగ్యం

# హోమియో వైద్య సేవ

యుగఋషి, వేదమూర్తి, తపోనిష్ఠ, యుగద్రష్ట పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల జన్మశతాబ్దిని పురస్కరించుకొని "ఆరోగ్యమే మహా భాగ్యం" అనే శీర్షికను ప్రవేశపెట్టుచూ తద్వారా హోమియో వైద్య చికిత్సా విధానం ద్వారా అత్యంత స్వల్ప వ్యయంతో శారీరక, మానసిక రుగ్మతల నుండి స్వస్థత పొందే అవకాశం కల్పించుటకై 2010 నవంబరు యుగశక్తి గాయత్రి మాసపత్రిక ద్వారా సేవా కార్యక్రమమును హైదరాబాద్ గాయత్రీ చేతనా కేంద్రం ప్రారంభించినదని తెలుపుటకు సంతసించుచున్నాము.

మధ్య తరగతి ప్రజలు, దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న 70% ప్రజానీకము మనదేశములోని ఆధునిక కార్పొరేట్ చికిత్సా విధానం ద్వారా వారి మానసిక, శారీరక రుగ్మతల నుండి స్వస్థత పొందుట చాలా కష్టతరముగా ఉన్నది. అంతేగాక వైద్య సేవలకై, రుగ్మతల నివారణకు లక్షలకు లక్షలు వెచ్చించి అప్పుల పాలైన కుటుంబాలు లెక్కకు మించి ఉన్నాయి. చికిత్సానంతరం కూడా ఆయా వ్యక్తుల ఆరోగ్యం, శారీరక పటుత్వం అంతంత మాత్రంగానే ఉండటం అనేకమంది విషయంలో గమనించవచ్చు. ఇది అత్యంత శోచనీయం. దీనిని అధిగమించి అత్యంత నిరుపేదలు కూడా హోమియో వైద్య చికిత్సా పద్ధతిలో వారి వారి గ్రామములలోనే అత్యంత సులభతరంగా వారి వారి శారీరక మానసిక రుగ్మతలను నుండి త్వరితగతిన ఆరోగ్యం పొందగలరు.

ఈ వైద్య విధానమునకు పితామహుడు డా॥ శామ్యూల్ హానిమన్. ఇతను జర్మనీ దేశస్థుడు. ఈయన అత్యంత నిరుపేద కుటుంబంలో జన్మించి 12వ ఏట నుండి పిల్లలకు ట్యూషన్లు చెప్పి ఆర్జించిన సంపాదనతో వియన్నా నగరంలో వైద్య విద్య అభ్యసించాడు. దీనితో పాటు ఆంగ్ల భాషా గ్రంథాలను జర్మనీ భాషలోనికి తర్జుమా చేసి జీవితాన్ని గడుపుతుంటేవాడు. 1779లో 24వ యేట వైద్యశాస్త్రంలో పట్టభద్రుడయ్యాడు.

ఒకవైపు వైద్యవృత్తిని కొనసాగిస్తూ ఇంకొక ప్రక్క చికిత్సకు ఉపయోగపడే ఔషధ ధర్మాలను పరిశీలించే వాడు. ఇటాలియన్, ఇంగ్లీషు, ఫ్రెంచి, లాటిన్ భాషలలో ఉన్న అనేక వైద్య గ్రంథాలను జర్మనీ భాషలోకి అనువదించారు. తన వైద్య వృత్తిలో ఒక ఆధ్యాత్మిక ఋషి వలె ప్రయోగాలు చేసి ఔషధ ధర్మాలను ఆపోశన పట్టిన జ్ఞాన నిధి డాక్టర్ హానిమన్.

డా॥ హానిమన్ మొదటి నుండి లోతుగా అధ్యయనం చేసే స్వభావం కలిగినవాడు. ఆనాటి కాలములో యూరప్‌లో అమలులో ఉన్న వైద్య విధానాలైన– జ్వరపడిన వారి నుండి రక్తాన్ని ఓడ్చటం, విరోచనకారి ఔషధాలు వాడే చికిత్సా విధానాలతో విభేదించి పలు వ్యాసాలు వ్రాశారు. ఆంగ్లేయ వైద్యుడు కల్లెన్ వ్రాసిన గ్రంథాన్ని అనువదిస్తూ దానిలో ఇచ్చిన సింకోనా బెరడు వాడితే వచ్చే ఫలితాలలో విభేదించాడు. ఈ బెరడు కషాయం శరీరానికి టానిక్‌లాగా పనిచేస్తుందనే విషయం ఒప్పుకోలేదు. తర్వాత సింకోనా బెరడు కషాయాన్ని ఆరోగ్యంగా ఉన్న తాను పుచ్చుకోగా మలేరియా జ్వర లక్షణాలు తన శరీరంలో రావడం గమనించాడు. కషాయాన్ని తీసుకొనుట ఆపివేయగానే తనకు వచ్చిన మలేరియా జ్వర లక్షణాలు తగ్గిపోవుట గమనించాడు. ఈ ప్రయోగం అనుభవంతో ఒక నూతన వైద్య విధానానికి బీజారోహణ చేశాడు. అది నేటి హోమియో వైద్య విధానంగా రూపొందింది. స్వల్పఖర్చుతో కూడిన, ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా విశ్వాసనీయమైన వైద్య విధానంగా అవతరించింది.

ఆరోగ్యవంతుని శరీరంలోనికి ప్రవేశపెట్టిన మందు ఏ రోగ లక్షణాలను కలిగిస్తుందో అదేమందు అటువంటి రోగ లక్షణాలు కలిగిన వ్యక్తికి ఇచ్చినపుడు ఆ రోగమును నివారిస్తుంది. like cures like అని ఇంగ్లీషు భాషలో అంటారు. హోమియో వైద్య విధానానికి మూల సిద్ధాంతం ఇదే. ఈ సిద్ధాంతాన్ని ఆధారం చేసుకుని హానిమన్ మహాశయుడు తన శరీరముపై అనేక కషాయాలను, పదార్థాలను ప్రయోగించుకుని, ఆ పదార్థం తనపై ఎటువంటి రోగ లక్షణాలను కలిగించిందో గమనించుకొని వాటిని వ్రాసి ఉంచారు. అటువంటి రోగ లక్షణాలున్న మనుష్యులకు ఆ విధంగా ఔషధం నిర్ణయించడం జరిగేది. మలేరియా జ్వర లక్షణాలు కలిగించే 'సింకోనా', మలేరియా వ్యాధిగ్రస్తులకు మందుగా పనిచేస్తుంది. ఈ విధంగా తన శరీరంనే ఒక ప్రయోగశాలగా చేసికొని హోమియో వైద్య విధానానికి జవసత్వాలు కలిగించి మానవ జాతి అభ్యున్నతికి దోహదకారిగా తీర్చిదిద్దిన హానిమన్ హోమియో వైద్య చరక మహర్షి.

**[redacted]గ్గించుకుంటే లభించే సుఖశాంతులే కోటివరాలు.**

గుర్తుంచుకోవలసినది ఏమంటే అల్లోపతి వైద్య విద్యనభ్యసించి, అదే వృత్తిగా చేపట్టి ఔషధ గుణముల పరిశోధన చేస్తూ, గడించిన అనుభవంతో ఆ వైద్య విధానం కన్నా మెరుగైన, సురక్షితమైన, స్వల్ప ఖర్చుతో కూడిన ఒక నూతన వైద్య విధానమును మానవాళికి అందించిన హానిమన్ మహాశయుడు నిజముగా ఋషియే.

ఇట్టి ఋషిప్రోక్తమైన ఈ హోమియో వైద్యం నేటి కాలానికి అత్యంత ఉపయోగకారి. సర్వప్రాణులకు అమోదయోగ్యమైనది ఆరోగ్య ప్రదాయిని.

'సర్వేజన సుఖినోభవన్తు' అనే సూక్తికనుగుణంగా అన్ని వర్గముల వారికి రోగ చికిత్సా సహాయమును అందుబాటులోకి తీసుకురావడానికి, హోమియో వైద్య విధానంలో నిష్ణాతులైన వారి సేవలను అందించుటకు ఏర్పాటు చేయడమైనది. డా॥ నీలవేణి, బి.హెచ్.ఎమ్.ఎస్ గారు పాఠకుల శారీరిక, మానసిక సమస్యలకు హోమియోవైద్య విధాన పరంగా సమాధానములు ఇవ్వడానికి, మందులు సూచించడానికి అంగీకరించారని తెల్పుటకు సంతోషించుచున్నాము.

రోగలక్షణాల వివరములతో పాటు రోగి యొక్క శారీరిక, మానసిక లక్షణములను, ఆహారపు అలవాట్లను, వ్యసనములను పరిగణనలోకి తీసుకొని ఔషధ నిర్ధారణ జరుగుతుంది. తెలియచేయవలసిన వివరాలు: 1) రోగి పేరు, వయస్సు స్త్రీ / పురుషుడు 2) నిత్యం సేవించే ఆహారం 3) తీపి / కారంలందు ఏది ఇష్టం 4) చేసే వృత్తిపరమైన వివరాలు 5) మలబద్ధకమున్నదా 6) నిద్ర ఎలాపడుతుంది? 7) కోపతాపములు మొదలైనవి.

అన్ని ఆరోగ్య సమస్యల పరిష్కారం కొరకు వివరములతో క్రింది చిరునామాకు వ్రాయండి.

**డా॥ టి. నీలవేణి**, బి.హెచ్.ఎమ్.ఎస్.
ఆర్.ఎన్..జి. అడ్వాన్స్‌డ్ హోమియో క్లినిక్
ఇ.నెం. 3-211, యశోద గార్డెన్స్ దగ్గర,
శాంతినగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500 072.
ఫోన్: 9966883044
ఇ-మెయిల్: drneelaveni@gmail.com

## ఔత్సాహిక గాయత్రీ పరివార్ కార్యకర్తలకు అశ్విని ఛారిటబుల్ ట్రస్ట్ వారి ఆహ్వానము

మన గ్రామాలలో పిచ్చికుక్క, తేలు మరియు పాముకాట్లకు గురియై సకాలములో వైద్యము అందక అనేకమంది ప్రాణాలు విడచుచున్నారు. ఒకవేళ వైద్య సాయము లభించిననూ చాలా ఖర్చుతో కూడియున్నది. ముఖ్యముగా వ్యవసాయ వృత్తిలోనున్న వారు ఎక్కువగా ఈ విషజంతువుల బారిన పడి చాలా మూల్యం చెల్లించుట జరుగుచున్నది.

పై రంగములో అశ్విని ఛారిటబుల్ ట్రస్టు వారు ఒక దశాబ్ద కాలము క్రితము కొన్ని వందల గ్రామాలలో పర్యటించి అనేకమంది ఔత్సాహిక స్వచ్ఛంద కార్యకర్తల ద్వారా పిచ్చికుక్క, తేలు మరియు పాము కాటుకు హోమియో మందును ఉచితముగా అందించి అనేక వందల మందికి స్వస్థతను చేకూర్చుటయేకాక, ప్రాణాలను సైతము కాపాడిన దృష్టాంతములు వందల, వేల సంఖ్యలోనున్నాయి.

"ఆరోగ్యమే మహాభాగ్యం" అనెడి శీర్షికను ప్రవేశపెట్టుచున్న శుభసందర్భముగా తిరిగి పైన ఉదహరించిన సేవలను అశ్విని ఛారిటబుల్ ట్రస్టు వారు తిరిగి అందించ సంకల్పించినారని తెలియజేయుటకు సంతసించుచున్నాము. పై సేవలనందజేయుటకు ఒక్కొక్క గ్రామానికి కనీసం 2 నుండి 4 గురు స్వచ్ఛంద సేవకులు కావలసియున్నది. ఈ సేవకులలో ఒక్కరిని ఎంపికచేసి అశ్విని ఛారిటబుల్ ట్రస్టు వారు ఉచితముగా తగిన శిక్షణనిచ్చి వారికి ఉచితంగా హోమియో మందులను అందజేసెదరు. దీనికై గాయత్రీ పరివార్ కార్యకర్తల నుండి దరఖాస్తులను ఆహ్వానించుచున్నాము. ఈ క్రింది వివరములు తెలుపుచూ దరఖాస్తు వ్రాసి గాయత్రీ చేతనా కేంద్రానికి పంపవలసినదిగా కోరడమైనది. కనీస విద్యార్హత 10వ తరగతి.

**అందజేయవలసిన వివరములు:** 1) దరఖాస్తుదారుని పేరు - తండ్రి / భర్త పేరు 2) వయస్సు 3) విద్యార్హతలు 4) చిరునామా 5) ఫోన్ నెంబర్ 6) వృత్తి 7) గాయత్రీ పరివార్‌లో అనుభవము

**గతంలో ఒక కార్యకర్త అనుభవం:** మీరిచ్చిన మందువలన తేలుకాట్లకు గురైనవారు 259 మంది స్వస్థతనొంది మీ సేవను కీర్తించుచున్నారు. తేలుకాటుకు మాత్రమే కాకుండా పిచ్చికుక్క కాటుకు, పాము కాట్లకు గురై నా వద్ద చికిత్స పొందినవారు కొన్ని పేర్లు పంపుతున్నాను. మీ సేవని కొనియాడని వారు లేరు. – కె. యేశోబు, పెదపరిమి *తేది 24.10.1998*

[redacted] మానవత్వం, మానవత్వానికి పునాది దయాగుణం.

కుటుంబ నిర్మాణం

# కుటుంబంలో స్వర్గతుల్య వాతావరణం

మానవ జీవితంలో ఈశ్వరోపాసన అత్యంత మహత్తరమైనది. ఆత్మస్థితి (లెవెలు) చక్కగా వికసించి సురక్షితంగా నిర్వహించబడాలంటే మన మనస్సులలో ఈశ్వరునికి తగిన స్థానం ఉండాలి. భగవంతుని గూర్చి ఎక్కువగా ఆలోచిస్తూ, అతని సాన్నిధ్యాన్ని పొందటానికి కృషి చేయడం వలననే అది సాధ్యమౌతుంది. ఆహారం లేకపోతే శరీర కార్యక్రమాలు నడవవు. శ్వాసలేనిదే రక్తప్రసరణ కార్యక్రమం జరగదు. ఇదేవిధంగా ఈశ్వరుని ఉపేక్షిస్తే అంతర్గత స్థితి కూడా నీరసంతోను, విచారంతోను, అనిశ్చితితోను, అనైతికంగాను, అస్తవ్యస్తంగాను, నిత్యశంకతోను నిండి ఉంటుంది. కనిపించే హాని కారక విషయాలను ప్రజలు తేలికగా తెలుసుకోగలరు. కాని ఈ జీవితానందాన్ని, ఉద్దేశ్యాన్ని పాడుచేసే ఈ రకమైన హానిని మాత్రం మనం చూడనూలేము, అర్థం చేసుకోనూలేము. ఇది ఎంత దౌర్భాగ్యకరమైన విషయం!

మానవ జీవితం యొక్క ప్రగతి సుఖశాంతులు, అంతర్గతస్థితి ఉత్కృష్టతలపై ఆధారపడి ఉంటాయి. ఈ ఉత్కృష్టతను బలపరిచేందుకు ఉపాసనా విధానాన్ని ఋషులు ఆవిష్కరించారు. భౌతిక సుఖ సాధనాలను బుద్ధి బలం ఆధారంగా సంపాదించ వచ్చును. కాని గుణ కర్మ స్వభావాల ఉత్కృష్టతలపై ఆధారపడిన సమస్త విభూతులు మన అంతర్గతస్థితిని బట్టి ఉంటాయి. ఈ స్థితిని దృఢంగా సమున్నతంగా చేయడంలో ఉపాసన చాలా అవసరం. అందుచేత ఇతర ముఖ్యమైన పనుల వలెనే ఉపాసనకు కూడా నిత్య కార్యక్రమాలలో స్థానం ఇవ్వాలి. ఏ ప్రకారంగా జీవనోపాధిలో సంపాదన, ఆహారం, విశ్రాంతి, పరిశుభ్రత, కుటుంబ నిర్వహణ, మనోరంజనాలపై దృష్టిపెడతామో, అదేవిధంగా ఉపాసనపై ధ్యాస పెట్టాల్సి ఉంటుంది.

సాధారణ జనులు సదాచారులుగాను, నియమాలు పాటించేవారుగాను, సమాజానికి ఉపయోగపడేవారుగాను ఉండే ఉద్దేశ్యంతో ప్రభుత్వం విభిన్న ప్రయత్నాలు చేస్తూనే ఉంటుంది. అనేక చట్టాలు, ఆర్డినెన్సులు, నియంత్రణ ద్వారా ప్రజలను మంచి ద్వారా నడిపించడానికి ఏదో చేస్తున్నా ఉపయోగం కొద్దిగా మాత్రమే కన్పిస్తుంది. ఉన్నత ఆదర్శవాదానికి ఆధ్యాత్మిక కోమల భావాలకు అంతఃకరణలో స్థానం లేనట్లయితే, మహత్తరమైన గుణాలు వ్యక్తిలో వికసిస్తాయని ఆశించలేము. ఆంతరంగిక ప్రేరణతో ఏ ప్రేమ, త్యాగం, సంయమం, శ్రేష్ఠత ఉత్పన్నమౌతాయో అవి ప్రభుత్వ ప్రచారం వలన కాని, ఒత్తిడివలన కాని ఎంత మాత్రం జరగవు. మనిషి ఎల్లప్పుడు ఉన్నత భావనల పడుగుపేకలతో విడదీయరానంతగా ఒకదానితో మరొకటి కలవడంపైనే ప్రపంచంలో శాంతి, చక్కని వ్యవస్థ ఏర్పాటు ఆధారపడి ఉంటాయి. ఈ భావనలు అంతరంగం నుండి బయటికి వస్తాయి. బయటి నుండి రావు. అంతఃకరణ మీద ప్రభావం శ్రద్ధ, విశ్వాసాలతోనే సాధ్యమవుతుంది. ఈ కారణంగానే ఎప్పటివరకు ఈ తత్వాలు మేల్కొల్పబడవో అప్పటివరకు, ఉత్కృష్టత జాగృతం కాదు. ఎప్పటివరకు ఈ జాగృతి జరగదో అప్పటివరకు మనిషి నీచ ప్రవృత్తుల నుండి ఉన్నత స్థానాలకు ఎదగలేడు.

మనిషి జీవిత ప్రగతి అతని సద్గుణాలపై ఆధారపడి ఉంటుంది. ఎవరి గుణ కర్మ స్వభావాల నిర్మాణం, వికాసం సరియైన రీతిలో జరిగిందో, అట్టి మనుష్యులు అనేక బాధలను, కఠిన పరిస్థితులను దాటుకుంటూ, తమ ప్రగతి మార్గాన నడుస్తారు. కష్టమైన పరిస్థితులలో కూడా చెడు స్వభావం గల వ్యక్తులను, మంచి వ్యక్తులు తమ నడత ద్వారా ప్రభావితులను చేసి మార్చగలరు. వారిని అనుకూలురుగా మలచగలరు. ఎవరి స్వభావమైతే దోష భూయిష్టమై దుర్గుణాలతో నిండి ఉంటుందో, వారు తమ కలుషితమైన దృష్టికోణం వలన, మంచిదైన మనోభూమిని కూడా కలుషితం చేస్తారు. లోపభూయిష్టమైన దృష్టికోణమెక్కడున్నా, అక్కడ నరక వాతావరణం ఉంటుంది. అనేక విపత్తులు అక్కడ సంభవిస్తాయి.

ఈ సత్యాన్ని దృష్టిలో ఉంచుకుంటూ ప్రతి ఒక్కరూ తమ కుటుంబ జీవితంలో సద్గుణాల తల్లి ఐన ఆస్తికతను (దైవంపై నమ్మకం కలిగి ఉండడం) ధైర్యంతోను, వివేకంతోను అలవరచుకొనే ప్రయత్నం చేయాలి. దైవభీతి మనిషిని మంచి మార్గంలో నడిపిస్తుంది. దుస్సాహం చేసేవారు చట్టాలను, సామాజిక దండనలను పట్టించుకోరు. అపరాధాలు చేసేవారికి, పోలీసులు, జైలు శిక్షలు భయం కూడా కలిగించవు. కాని ఎవనికైతే ఈశ్వరునిపై పూర్తి విశ్వాసం ఉంటుందో, తనకు నలువైపులా ఉన్న ప్రతి ప్రాణిలోను ప్రతికణంలోను ఈశ్వరుని చూడగలుగుతాడో, అట్టివానికి ఇతరుల ఎడ అనుచితంగా

[redacted] సాధారణం - పరిణామం మాత్రం అసాధారణం.

ప్రవర్తించడం సాధ్యం కాదు. కర్మఫల వ్యవస్థపై ఎవనికి శ్రద్ధ ఉందో, అట్టి వ్యక్తి భవిష్యత్తు అంధకారం చేసే చెడు మార్గంలోకి వెళ్ళడానికి ఎట్లు సాహసిస్తాడు? ఇతరులను బాధించడమంటే ఈశ్వరుని బాధించినట్లే. ఎవని మనస్సులో ఈశ్వరుని ఎడల విశ్వాసం, కర్మఫల అనివార్యత లోతుగా నాటుకొని ఉంటుందో, ఆ వ్యక్తి తప్పులు ఎందుకు చేస్తాడు? పాపాల నుండి విముక్తి పొందేందుకు అరగంట పూజా కార్యక్రమం నిర్వహిస్తూ మిగిలిన ఇరవై మూడున్నర గంటలు ఇష్టము వచ్చినట్టు ఉంటే ఏమి ఫలితాలు వస్తాయి? ఈ విధంగా కోరికలు నెరవేర్చుకోవాలనుకోవడం కూడా ఒకరకమైన అనుచితసాహసం అనిపించుకొంటుంది. కాని నిజమైన ఆధ్యాత్మికత, నిజమైన ఆస్తికత, దాని మహత్యం ఏరకంగాను తక్కువ కాదు. సన్మార్గాన్ని అవలంబించి, చెడు మార్గాన్ని త్యజించడం, జీవితంలో ధర్మాన్ని, కర్తవ్యాన్ని పాటించడానికి ఈశ్వరునిపై నమ్మకాన్ని మించిన పద్ధతి మరొకటి ఉండబోదు.

ఆలోచనాపరుడైన వ్యక్తి తన జీవితాన్ని సార్థకంగాను భవిష్యత్తును ఉజ్వలంగాను చేసుకోవడానికి ఆస్తికతకు జీవితంలో ప్రముఖస్థానం ఇవ్వాలి. ప్రతిక్షణం ఈశ్వరుని తన జీవన సహచరునిగా భావించి నిర్భయంగా ఉండాలి. సన్మార్గినైతే ఈశ్వరుని కృపకు పాత్రుడనౌతాను అనియు, దుర్మార్గుడనైతే ఈశ్వరుని దండనకు గురౌతాననే సిద్ధాంతాన్ని మనసులో ఉంచుకుంటూ తగిన ఆలోచనలను, ఆచరణలను చేసుకోవాలి. ఈ విధంగా తన కుటుంబంలో ప్రతి సభ్యుని జీవితంలోను ఆస్తికతను ఏదో ఒక విధంగా ప్రవేశపెట్టడానికి ప్రయత్నించాల్సి ఉంది. కుటుంబంలోని ప్రతి బిడ్డకు ఈశ్వరునిపై విశ్వాసం కలగాలి.

శరీరం, మనస్సుల వికాసానికి కుటుంబ సభ్యులకు భోజనం (ఆహారం), విద్యనభ్యసించే ఏర్పాట్లు చేసినట్లే, ఆధ్యాత్మిక దృష్టిలో స్వస్థత కలిగేందుకు చిన్నలు పెద్దలందరిలోను ఉపాసనయందు అభిరుచిని కలిగించాలి. కుటుంబ సభ్యులు ఇంటి యజమానిని అనుకరిస్తారు గనుక, సరియైన సమయానికి నిత్యం నియమపూర్వకంగా ఉపాసనా కార్యక్రమాన్ని నిర్వహిస్తుండాలి. ఏ కుటుంబ సభ్యుడైనా ఆలస్యంగా నిద్ర లేచినా, అపరిశుభ్రతగా ఉన్నా, చదువుపై శ్రద్ధ చూపకపోయినా, ఎక్కువ ఖర్చుచేసినా, చెడు సహవాసం చేసినా అట్టి వాటి నుండి విముక్తి కలిగించడానికి ప్రయత్నం చేయక తప్పదు. ఎందుకంటే, అవి అతనికి బాధలను, కష్టాలను కలిగించి, భవిష్యత్తును అంధకారం చేస్తాయి. ఇదే ప్రకారంగా ఆధ్యాత్మిక యొక్క ప్రాముఖ్యతను ఉపాసన యొక్క లాభాలను స్పష్టంగా, ఓపికగా చెప్తుంటే వానిని అంగీకరిస్తారు.

ప్రతి కుటుంబ సభ్యుని ఆస్తికునిగాను, ఉపాసకునిగాను చేయగలగడమే తన కుటుంబం ఎడల అన్నింటికంటే పెద్ద సేవ ఔతుంది. ఆ మార్గాన్ని అవలంబించి ఉజ్జ్వల భవిష్యత్తును పొందవచ్చును. దాని ఫలితంగా అతని శరీరం, మనస్సు, కుటుంబ వ్యవహారాలు, ఇహలోక పరలోకాలన్నీ ఆనందమయం ఔతాయి. ఏ ఆడపిల్లలు చిన్నప్పటి నుండి ఆస్తికతను నిలుపుకున్నారో, వారు అత్తవారిళ్ళకు వెళ్ళిన తర్వాత కూడా ఆ ఇంటి ప్రతి సభ్యుని ఎడల సరైన విధంగా ప్రవర్తించడం తమ ధర్మంగా భావిస్తారు. ఇట్టి దశలో వారు ఇతరుల కళ్ళ వెలుగులౌతారు. అందరూ వారిని ప్రేమగా చూస్తారు. దుఃఖం, బాధలలో కనురెప్పలలా కాపాడతారు. ఎక్కువ కట్నం తీసుకొచ్చినా లభించని గౌరవం, ఆడపిల్లలకు అత్తవారిళ్ళలో వారి సద్గుణాల ద్వారా లభిస్తుంది. ఈ ప్రకారంగా తల్లిదండ్రులు ఏ కన్యకైతే ఆస్తికతను, ఉపాసనను నేర్పించారో, వారు తమ భవిష్యత్తు, ఆనందమయం చేయడానికి ఇచ్చే సంపద ఔతుంది. కాని ఎక్కడ ఆడపిల్లలు విశృంఖలత, నాస్తికత, విలాసవంతం, అసహన వాతావరణాలలో పెరుగుతారో వారెక్కడ ఉన్నా నరకాన్ని సృష్టిస్తారు. ఏ తల్లిదండ్రులైతే బాల్యం నుండి తమ ఆడ పిల్లలకు ధార్మిక లక్షణాలను, ఉపాసన అలవరచరో, వారికి కీడే చేసిన వారౌతున్నారు.

ఇదే (విషయం) మాట బాలుర విషయంలోను అమలౌతుంది. బాల్యం నుండి వారు ధర్మంపై విశ్వాసం ఉంచి సంస్కారాల ప్రభావాన్ని మనసుపై ధారణ చేయగలిగితే, తల్లిదండ్రులు, అక్క చెల్లెళ్ళు, అన్నదమ్ములు, భార్యాపిల్లలు, బంధువర్గం వారందరి ఎడల తమ కర్తవ్యాన్ని పాటించగలరు. అలాంటప్పుడు స్వభావ సిద్ధంగా వారి కుటుంబాలు స్వర్గతుల్యంగా ఉంటాయి. స్వభావం, ఆరోగ్యం బాగా ఉంటాయి. కీర్తి, గౌరవాలకు కూడా లోటు ఉండదు. సజ్జనత్వం ఎక్కడ ఉంటుందో అక్కడ దీనత్వం, దరిద్రం ఉండవు. తమ బిడ్డలను ఆస్తికులుగాను, సంస్కారవంతులుగాను తయారు చేస్తారో, వారు తమ కర్తవ్యాలను నిర్వహించినట్టే. అట్టివారిని ఎంత ప్రశంసించినా అది తక్కువే ఔతుంది.

*– అఖండజ్యోతి, మే 1998*

*– తెలుగు అనువాదం: శ్రీ బాసంగి శ్రీరాములు*

[redacted] లెక్కడ దాగున్నాయి? - అసంతృప్తిలో.

# వేమన వేదం - నవజీవన నాదం

వానలో తడవనివారు, వేమన పద్యాలను వినని తెలుగువారు ఎక్కడ ఉండరన్నదీ అతిశయోక్తి కాదు, అక్షరసత్యం వేమన పద్యాలలోని నీతులు, ధర్మాలు నిత్యస్మరణీయాలు, జీవన సత్యాలు.

వేమన దృష్టిలో మనిషే దేవుడు. మానవత్వమే మతం. “మానవసేవయే–మాధవసేవ” అని నమ్మిన కర్మయోగి. ప్రబోధం ఎంత ప్రధానమో, సంస్కరణకూడా అంత ప్రధానం అన్న సత్యాలు వేమన పద్యాలలో స్పష్టంగా కన్పిస్తాయి.

మూఢాచారులను, మూర్ఖంగా చేసే విగ్రహారాధనను విమర్శిస్తూ, కుల, మత, వివక్షతను వ్యతిరేకించిన మర్మయోగి. కులం పేరిట వెలివేసేకంటే వ్యభిచారం, చౌర్యం ఇతరులకు హాని చేయడం వంటి దుర్గుణాలు కల్గినవారిని సంఘం నుండి బహిష్కరించాలి అని ధైర్యంగా నినదించిన ధీశాలి వేమన.

క్రీ॥శ॥ 1382–96 మధ్య కొండవీడును పరిపాలించిన కొమరగిరి వేమారెడ్డికి గల ముగ్గురు పుత్రులలో చివరివాడు వేమన.

బాల్యంనుండి రాచరిక సుఖాలను, విలాసవంతమైన జీవితాన్ని గడిపిన వేమన, జీవితంలోని ఎన్నెన్నో సత్యాలను తెల్సుకొని, లోకంలోని పైపై మెరుగులు చూసి వాటికి ఆకర్షితులు కావడం తగదన్న పరమార్థాన్ని గ్రహించి తన పేరులోని “రెడ్డి” పదాన్ని త్యజించిన ఆదర్శ ప్రజాకవి. వేమనపద్యం ప్రతి ఒక్కటీ ఒక్కొక్క తత్త్వం.

“పరసువేది” విద్యను నేర్చుకున్నప్పటికీ బంగారం పట్ల ప్రలోభం చెందని విరాగి. సమాజాన్ని, వ్యక్తితత్త్వాన్ని సమపాళ్ళలో అధ్యయనం చేసిన మేధావి.

ఆయన పద్యాలలోని కొన్ని రత్నాలను పరిశీలిద్దాం

***నీళ్ళలోన మొసలి నిగిడి ఏనుగుబట్టు,***
***బయటకుక్కచేత భంగపడును***
***స్థానబలిమిగాని తన బలిమిగాదయా***
***విశ్వదాభిరామ వినురవేమ!***

ఏనుగును సైతం అదుపుచేసేశక్తి మొసలి కల్గి ఉండటానికి కారణం అది నీళ్లలో ఉండటమే! మనకు మన ఇంట్లో ఉన్న ధైర్యం, ఇతరుల ఇళ్ళలో మొహమాటంగా మారుతుంది. భాగవతంలో గజేంద్రుణ్ణి, తన నోటకరచి వేయి సం॥లు యుద్ధం చేసే శక్తి పొందడానికి కారణం తన సరస్సులోకి నీళ్ళు త్రాగడానికి ఏనుగు రావడమే. పైగా నీళ్ళు ఉన్నప్పుడు మొసలికి వెయ్యి ఏనుగుల బలం ఉంటుందని సైన్స్ చెబుతోంది.

అదే సత్యాన్ని వేమన చెబుతూ, నీళ్ళలో ఉన్నప్పుడు ఏనుగును అదుపుచేయగల మొసలి, బయటకువచ్చినపుడు వీధి కుక్క అరుపులకు కూడా భయపడు,తుంది. ఇది స్థానబలిమేకాని తన బలం కాదన్న సత్యాన్ని అలతి అలతి పదాలలో వివరించిన వేమన ప్రతిభకు తార్కాణం.

మరొక పద్యంలో

***తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుండు***
***పుట్టనేమివాడు గిట్టనేమి***
***పుట్టలోన చెదలు పుట్టవా గిట్టవా***
***విశ్వదాభిరామ వినురవేమ!***

తల్లిదండ్రులు కనిపించే దేవతలు. అలాంటి తల్లిదండ్రులపై ప్రేమ, గౌరవం లేనివాడు మనిషి పుట్టినా, చచ్చినావాడితో సమానం. మనుషులలో అలాంటి దుష్టులు, పుత్రుల రూపంలో విశ్వాసఘాతకులుగా ప్రవర్తిస్తున్నారన్న తత్త్వాన్ని బోధిస్తూ, చెదలు పుట్టడం, గిట్టడం వల్ల ఎవ్వరికీ ఏ ప్రయోజనం చేకూరదో, అలాగే తల్లిదండ్రులపై ప్రేమలేని పుత్రులు జన్మ కూడా నిరర్థకమే.

కావున తల్లి దండ్రులను సతతం ప్రేమించే ప్రేమతత్త్వాన్ని అలవర్చుకోమన్న వేమన బోధించిన ధర్మాలను మనం మన జీవితాలలో అలవర్చుకోవడం మనవిధి.

వేమన యొక్క పరిశీలనా శక్తి అద్భుతం. మనుష్యులను, వారి మనస్తత్త్వాలనే కాక, లోకం తీరుతో వాటిని జోడించి మార్గదర్శనం చేసిన మహనీయుడు.

***అల్పబుద్ధి వానికధికారమిచ్చిన***
***దొడ్డవారినెల్ల దొలగగొట్టు***
***చెప్పుదినెడుకుక్క చెరుకు తీపెరుగునా...***
***విశ్వదాభిరామ వినురవేమ!***

మానవత్వం, పరోపకారం, నిస్వార్థం, సేవాభావం అనే మౌలిక సూత్రాలు, వాటిని ఆచరణలో పెట్టాలన్న

[redacted] సంతృప్తిని మించిన సుఖం లేదు.

ఆలోచనేలేనివాడు అల్పబుద్ధికలవాడు. కేవలం స్వార్థం, స్వజనుల సేవ, పాప భీతి లేకపోవడం, పరపీడనం వంటివి అతని సహజగుణాలు. అలాంటి అల్పబుద్ధి కల్గినవాడికి అధికారమిస్తే, వాడు తన అధికారాన్ని దుర్వినియోగం చేయడమేకాక, సజ్జనులను, బుద్ధిమంతులను, నిజమైన దేశభక్తులను, శ్రేయోభిలాషులను తమ (రాజుల) ఆస్థానాల నుండి తొలగించి, తనకు నచ్చినవారిని, అయోగ్యులను, వంతపాడేవాళ్ళను చేర్చుకుని రాజ్యపరిపాలనను భ్రష్టుపట్టిస్తారు. దానివలన రాజ్యం అస్తవ్యస్తమై ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటారు. కావున పదవిని ఇచ్చేముందు, అంటే ఎన్నికల సమయంలో నేతల గతచరిత్రలను, వారి గుణ గణాలను బేరీజు వేసుకుని ఓటు వేయాలి అన్న ప్రజాస్వామ్య ధర్మాన్ని మనకు స్ఫురింపచేస్తారు.

అంతేగాకుండా కుక్కకు 'చెప్పు' మాత్రమే రుచికరం కానీ చెరుకు కాదు అన్న సత్యాన్ని ఉదహరిస్తూ, చెడ్డవారికి చెడు ఆలోచనలు, అధర్మధోరణియందు ఆసక్తి ఉంటుంది కానీ మంచియందు, మంచిపనులందు ఆసక్తి చూపరు అని అందంగా వివరిస్తారు.

చెడ్డవాళ్ళ యొక్క సమూహం ఎలా ఉంటుందో తెల్పుతూ, మరో పద్యంలో ఇలా అన్నారు.

*దుండగాడు కొడుకు, కొండేదు చెలికాదు*
*బందరాజునకు బదుగుమంత్రి*
*కొండముచ్చునకును కోతియె సరియగు*
*విశ్వదాభిరామ వినురవేమ!*

దుష్టుడైన కొడుకు, చాడీలు చెప్పే తేలు వంటి మిత్రుడు, అల్పబుద్ధి కల్గి రాజుకు సరియైన మార్గదర్శనం చేయకుండా, రాజుగారు చేసే చెడ్డపనులను సైతం 'తందానతాన' అంటూ సమర్థించే నికృష్టుడైన మంత్రి మొదలైనవారు సహచరులుగా ఉన్న పాలకుడు ప్రజలను పీడించటంతోనే ఆనందిస్తాడు తప్ప ప్రజలకు మేలు చేయడంలో కాదు. ఇలాంటి దుష్టచతుష్టయానికి (కౌరవసంతానం) అటువంటి ఆలోచనలు ఉన్నవారే సంజోడు అంటూ "కొండముచ్చులకు కోతులే సరియైన నేస్తాలు" అన్న వ్యంగ్యాస్త్రంతో 'యద్భావం తద్భవతి' అన్న సంస్కృత ఉక్తిని స్ఫురింపచేస్తూ... ఇలాంటివారికి అధికారమిచ్చే ముందే జాగ్రత్తపడాలి. ఒకసారి అధికారమిచ్చాక బాధపడి ప్రయోజనం లేదన్న హెచ్చరికను ఇలా చేస్తారు వేమన. ఈ క్రింది పద్యంలో.

*కూరయుడుకు వెనుక కూడునా కసువౌర*
*ఎరుకగల్గిమునుపె యేరవలయు*
*స్థలము తప్పు వెనుకధర్మంబు పుట్టునా?*
*విశ్వదాభిరామ వినురవేమ!*

ఆకుకూరలను కట్టలా కట్టే గడ్డిపోచ కూడా ఆ కూరతోనే ఉంటుంది. కావున ముందుగానే ఆ గడ్డి పరకలను వేరుచేసి, కూరవండాలే కానీ ఏరకుండా వండితే ఆ కూరలోని రుచి చెడిపోతుంది అలాగే చెడ్డవారిని ముందుగానే గుర్తించి వారిని పదవికి దరిచేయనీయకుండా జాగ్రత్తవహించాలి లేకుంటే కూరలోని రుచిచెడిపోతుంది.

శ్రమను, సేవకుల గొప్పతనాన్ని గుర్తించని, గుర్తించలేని యజమానిదగ్గర ఎంతకాలం పనిచేసినా అది వృథాశ్రమే కానీ ఏమాత్రం ఉపయోగపడదు. కాబట్టి అటువంటి చెడ్డ యజమానిని సేవించడం ఏ మాత్రం శ్రేయస్కరం కాదంటారు వేమన ఇలా...

*ఎరుకలేని దొరలనెన్నాళ్ళు కొలచినా*
*బ్రతుకు లేదు వట్టి భ్రాంతిగాని*
*గొడ్డుటావుపాలు గోకితే చేపునా*
*విశ్వదాభిరామ వినురవేమ!*

తెలివి, మానవత్వం, ప్రేమ, దయవంటి గుణగణాలు లేని యజమానిని సేవించడం కంచిగరుడ సేవలాంటిదే. అంటే ఏ మాత్రం ఉపయోగపడని ఊడిగం. ఈ ఊడిగం వల్ల ఎటువంటి పురోగతి ఎన్నాళ్ళైనా సాధ్యం కాదు. గొడ్డు రూపును ఎంత గోకినా, ఎంత మచ్చిక చేసినా, అది పాలను ఎలా ఇవ్వదో, అలాగే ఈ సేవ కూడా నిరుపయోగమైనదే.

అందుకే చివరలో అలాంటి యజమానికి దూరంగా ఉండడమే సేవకునికి మంచిది అంటారు.

*విడువవలయు, నూరు విశ్రాంతిగాకున్న*
*విడువవలయు నాలి విధము చెడిన*
*విడువవలయు రాజు వితరణిగాకున్న*
*విశ్వదాభిరామ వినురవేమ!*

విశ్రాంతిని ఈయని ఊరును, గృహస్థ ధర్మాన్ని అతిక్రమించిన భార్యను, దానశీలత లేని రాజును విడిచి వెళ్ళడమే శ్రేయస్కరం అంటూ రాజు, సేవక ధర్మాలను వివరించి చెప్పిన నిజమైన విశ్వయోగి వేమన.

– సాధన నరసింహాచార్య

**[redacted]లను తగ్గించుకుంటే, ఆత్మోన్నతిని పెంచుకున్నట్లే.**

### ఆదిశక్తి యొక్క లీలాకథలు - 5

# కవచ సాధనతో సంపూర్ణ ఫలితం

ఆదిశక్తి అద్భుతగాథలో ఎంత భక్తి మాధుర్యమున్నదో అంతే ఆధ్యాత్మిక రహస్యమయత ఉంది. వేదమయి శ్రీదుర్గాసప్తశతి యొక్క ప్రతిఒక్క మంత్రం ఈ రహస్యమైన లోతైన భావాలతో నిండివున్నది. అంతేకాక విస్తృతమైన వేదాంత సంబంధమైన మరియు ఆధ్యాత్మికమైన అర్థాలు కూడా వీటిలో ఉన్నాయి. దుర్గాసప్తశతి పారాయణ క్రమంలో శ్రీదేవీకవచము, అర్గళాస్తోత్రం, కీలకం, ప్రాధానిక రహస్యం, వైకృతిక రహస్యం, మూర్తి రహస్యం అనే ఆరు అంగాలు ఉంటాయి. ఈ ఆరు అంగాలలో అన్నింటికంటే మొదటి అంగం కవచం. పరమపూజ్యగురుదేవులు గాయత్రీ మహావిజ్ఞానంలో కవచం యొక్క గొప్ప మహిమని తెలియజేస్తూ ఇలా అన్నారు. 'కవచం యొక్క అర్థం మూయుట– లేక మూత. దేనితోనైనా మనలను మనం కప్పుకుంటే, దానిని కవచం అంటారు. యుద్ధసమయంలో యోధులు ఒక ప్రత్యేకమైన కవచమును ధరిస్తారు. అప్పుడు ఇతరుల కొట్టిన దెబ్బల నుండి ఆ కవచం రక్షిస్తుంది. కవచం పని రక్షించుట. రక్షించే ప్రతి వస్తువును కవచం అని చెప్పవచ్చు.

యుగఋషి కవచం యొక్క మంత్రపరమైన ఆధ్యాత్మిక తత్త్వాలను స్పష్టపరుస్తూ ఇంకా ఇలా చెప్పారు. ' అదేవిధంగా ఆధ్యాత్మికశక్తి సంపన్నమైన ఇలాంటి దైవీ కవచాలు కూడా ఉంటాయి. కవచము వలన మనకు రక్షణ కలుగుతుంది. మంత్రశక్తి, కర్మకాండ, శ్రద్ధలతో కలుపబడిన ఆధ్యాత్మిక కవచమును ధరించుట వలన శరీరము –మనస్సులకు కీడును కలిగించే ఏవిధమైన ఆక్రమణ జరుగదు'. వేదమూర్తి గురుదేవుల వాక్కు వేదవాక్కు కనుక గురుదేవుల ద్వారా చెప్పబడిన ఈ విషయాలు చదువదగినవి, ఆలోచింపదగినవి మరియు ఆచరింపదగినవి. శాస్త్ర గ్రంథాలలో ప్రతివొక్క దేవీదేవతకు వేరువేరు కవచాలు చెప్పబడ్డాయి. వీటికి అసాధారణమైన సాధనా విధానం మరియు సర్వశ్రేష్ఠమైన ఫలశృతి ఉంది. దీనిని ఉపాసకులు, ఆరాధకులు అనాదిగా అనుభూతి చెందుతున్నారు.

తల్లి ఆదిశక్తి విభిన్నమైన పేర్లు మరియు వాటిలో ఇమిడివున్న రహస్యమైన ఆధ్యాత్మికశక్తులను జప్తికి తెచ్చే 'దేవీ కవచం' దైవికమైనదేకాక, తిరుగులేనిది, అత్యంత శ్రేష్ఠమైనది. దీని ప్రభావం సాటిలేనిది. ఈ కవచాన్ని అందరూ సమర్థవంతంగా ఉపయోగించవచ్చు. స్వప్రయోజనానికే కాక, సర్వహితార్థమునకు కూడా ఈ కవచసాధన సాటిలేనిది. మార్కండేయ ఋషి ప్రార్థించినమీదట బ్రహ్మదేవుడు ప్రజల మేలు కొరకు, సర్వహితార్థము దీనిని వెల్లడిచేశాడనీ దుర్గాసప్తశతి కవచపు పూర్వపీఠిక ద్వారా స్పష్టమౌతున్నది. ఈ కవచము 'చండీ కవచం' అనే పేరుతో ఉపయోగించబడుతుంది. అజ్ఞానాంధకారాలను నశింపజేసే దీని ఛందస్సు అనుష్టుప్, దేవత చాముండ. దీని ఋషి స్వయంగా బ్రహ్మ.

భావనామయియైన భగవతిమీద, ఆమె విభిన్న నామ రూపాల మీద భక్తిపూర్వకమైన ధ్యానమే ఈ కవచ సాధనకు ప్రాణం. బ్రహ్మాండ చైతన్యంలో వ్యాపించిన అద్భుతమైన ఆధ్యాత్మికశక్తులను సాధకుని అస్తిత్వంవైపు ఆకర్షించే భక్తిపూర్ణమైన ధ్యానం మహాశక్తిశాలీ, సూదంటుఱాయి. ఇది సాధకుని వివిధ అవయవాలలో శక్తిని ప్రతిష్ఠిస్తుంది, తద్వారా ఎలాంటి సమయంలోనైనా ఎలాంటి కీడు ఎలాంటి ఆపద ఎప్పుడూకూడా ఛేదించలేని విధంగా ఈ కవచము నిర్మించబడుతుంది. సాధనయొక్క ప్రాణం భావపూరితమైన భక్తి, అపారమైన శ్రద్ధ, దృఢమైన నమ్మకం మరియు చలించని విశ్వాసమే అని అనేకమంది సాధకుల అనుభవం ద్వారా నిరూపించబడినది. ఏ సాధకుల వద్ద ఈ అత్యంత విలువైన ఈ ఆధ్యాత్మిక పెట్టుబడి ఉందో వారు తల్లి ఆదిశక్తి సహజమైన కృపాకవచంతో స్వయంగానే సురక్షితులై జీవిస్తువుంటారు.

దివ్యమైన ఈ దేవీ కవచ పారాయణకు నాలుగు ప్రకరణములున్నాయి. దీని మొదటి ప్రకరణములో ప్రథమ పీఠికా మరియు భగవతి నవదుర్గ తొమ్మిది రూపాల చర్చ ఉంది. తొమ్మిదిరూపాలలో మొదటిది శైలపుత్రీ, రెండవది బ్రహ్మచారిణీ, మూడవది చంద్రఘంటా, నాల్గవది కూష్మాండా, ఐదవది స్కందమాతా, ఆరవది కాత్యాయనీ, ఏడవది కాళరాత్రి, ఎనిమిదవది మహాగౌరి మరియు తొమ్మిదవది సిద్ధిదాత్రి.

[redacted] మారుతుంది - దృష్టిని మారిస్తే సృష్టే మారుతుంది.

తంత్రసాధన, యోగసాధన దృష్టితో దేవి తొమ్మిదిరూపాలు ఏడు చక్రాలు మరియు రెండు విశిష్టమైన చక్రాల అధిష్ఠానదేవతా శక్తుల రూపాలు. వీటి సాధన మరియు ధ్యానంతో ఈ చక్రాల ఆధ్యాత్మికశక్తులు, విభూతులు వెల్లడవుతాయి. ఈ చర్చ రహస్యమయమైనది, అత్యంత గోపనీయమైనది కనుక ఇక్కడ దీని సంకేత వివరణమాత్రమే వెల్లడిచేయబడుతోంది. అర్హత పొందినవారికి సాధన ప్రత్యక్ష ప్రమాణాన్ని స్వయంగా ప్రసాదిస్తుంది.

రెండవ ప్రకరణములో తల్లి జగదంబ విభిన్న స్వరూపాల వివేచన ఉంది. ఈ వివేచనను సంక్షిప్తమైన సాంకేతిక ధ్యానవిధానంగా కూడా చెబుతారు. ప్రేతాసనా, చాముండా, మహిషవాహినీ, వారాహీ, ఐరావత ఏనుగుమీద కూర్చున్న ఐంద్రీ, వృషభం మీద కూర్చున్న మాహేశ్వరీ, మయూరం మీద కూర్చున్న కౌమారీ, గరుడాసనా వైష్ణవీ, కమలాసనా లక్ష్మీ , వృషభం మీద ఆసీనురాలైన ఈశ్వరీ, హంసవాహినీ బ్రాహ్మీ, రథంమీద ఆసీనురాలైన భగవతి–ఈ పలు రూపాలు ఎల్లప్పుడూ భక్త రక్షణ చేస్తూవుంటాయి. వీటన్నిటి ధ్యానం సర్వసౌభాగ్యాలనూ ప్రసాదిస్తుంది. ఈ ధ్యానంతో అన్ని ఆపదలు క్షీణిస్తాయి. సాధకునికి రక్షణ కలుగుతుంది. తన కవచ సాధన క్రమంలో సాధకుడు మాత ఆదిశక్తి మూల రూపాన్ని(గాయత్రి స్వరూపాన్ని) స్మరించుకుంటూనే వాటి వివిధ శక్తులను ధారణచేసే దేవియొక్క దైవీస్వరూపాలను వివేచన చేస్తూవుండాలి.

మూడవ ప్రకరణంలో కవచ ధారణ ప్రక్రియ ఉంది. ఈ ప్రక్రియ సులువుగా ఉంటూనే సాధకుని నుండి భక్తిపారవశ్యం, మానసిక ఏకాగ్రతను కోరుతుంది. అంతేకాక దీనిలో తెలియజేయబడినవున్న వివిధ అంశాలు ఆ అసాధారణ శక్తులను ధారణ చేసే ఉపదేశాన్నీ ఇస్తూవుంటాయి. ఈ సందర్భంలో గుర్తుంచుకొనవలసిన విషయం ఏమిటంటే కవచసాధన కేవలం శబ్దోచ్చారణ వరకు మాత్రమే పరిమితం కాదు. దీనిలో ధ్యానసాధన యొక్క శ్రేష్ఠమైన విధానం కూడా ఉంది.

కవచసాధన ఇచ్చే సత్ఫలితం నాల్గవ ప్రకరణములో తెలియజేయబడినది. ఎవరు తన హృదయంలో కవచాన్ని స్థిరపరచుకున్నాడో అతను కవచ సాధనను తన ధ్యానసాధనగా రూపొందించుకున్నాడు అని తెలుసుకోవాలి. ఈ ధ్యానమును చేసినవారు అన్ని రకాల రోగాలు, వ్యాధులు, జీవితంలో కీడును కలిగించే అన్ని లోకాల ప్రాణుల నుండి, గ్రహాలు, భూత, పిశాచ, బ్రహ్మరాక్షసుల బాధల నుండి విముక్తి పొందుతారు. అంతేకాక భైరవుడు లాంటి ఉపదేవతలు మరియు ఆపదలను కలిగించే అన్ని శక్తులూ నశించిపోయి చివరకు సత్ఫలితమును పొందుతారు. ఏ సాధకుని హృదయంలో ఈ కవచం ఉంటుందో **– నశ్యన్తి దర్శనాత్తస్య కవచే హృది సంస్థితే –** పైన చెప్పిన రకరకాల బాధలు, ఆపదలు అలాంటి సాధకుడిని దర్శించినంత మాత్రముననే నశించిపోతాయి.

ఈ కవచ సాధనతో కేవలం దురదృష్టాలు నశించిపోవటమే కాక, పలు అదృష్టాలు, మంచి ఫలితములు కూడా ప్రాప్తిస్తాయి అని ఋషులు తెలియజేశారు. **యశసా వర్ధతే సో–పి కీర్తిమణ్డితభూతలే –** అనగా కవచ సాధనను చేసే మానవుడు భూమిమీద తన కీర్తితో శోభించుటయేకాక సమృద్ధిని కూడా పొందుతాడు. అంతేకాదు. ఈ కవచసాధన సాధకుడిని ఆధ్యాత్మిక శిఖరాగ్రమునకు చేర్చి అతనిని అన్ని బంధనాలనుండి విముక్తుడిని చేసి శివుని సాహచర్యాన్ని ప్రసాదిస్తుంది. కవచసాధన వలన లాభాలు అనేకం. వీటిని ఏ సాధకుడైనా కూడా తన సహజమైన సాధనాక్రమంలో అనుభూతిచెందగలడు.

కవచ సాధన వలన పైన చెప్పిన సత్ఫలితాలే కాక మనోరోగాల నిర్మూలన అనే మరో దివ్యసాధనానుభూతి కూడా సాధకులకు కలుగుతుంది. కవచసాధన అన్నిరకాల మనోరోగాల నిర్మూలనలో అసాధారణమైన ప్రభావం చూపిస్తుంది అనేది అనేకమంది సాధకుల అనుభవం. స్వచ్ఛమైన నేతి దీపాన్ని వెలిగించి, భగవతి యొక్క చిత్రపటం లేక గాయత్రిమాత చిత్రపటం ఎదురుగా కూర్చుని పవిత్రోచ్చారణ సహితంగా కవచ పఠనం చేయుట వలన అన్నిరకాల దురాలోచనలు, మనోరోగాలు నశించిపోతాయి. రోగి స్వయంగా దీనిని పఠించుటలో అసమర్థుడైతే అతని బంధువులు రోగి పేరుతో సంకల్పాన్ని చేసి భగవతి కృప మరియు కరుణాదృష్టిని తలచుకుంటూ ఈ క్రమాన్ని పూర్తిచేసి సత్ఫలితాలను పొందవచ్చు.

*– అఖండజ్యోతి, మే 2007*

*అనువాదం : శ్రీమతి లక్ష్మీరాజగోపాల్, ఒంగోలు*

**[redacted]మాత్మని చేరాలంటే ఆర్తిని పెంచుకో.**



పూజ్య గురుదేవుల అమృతవాణి

# మీ దగ్గరే ఉన్న నన్ను ఎక్కడ వెతుకుతారు?

ఇంతకు ముందు సంచికలో సాహసము–వివేకము, పాత్రతను పెంచుకోవడం మరియు ఆత్మ చింతన అను నాల్గింటిని అధ్యయనము చేసినవారి జీవితములో మార్పు వస్తుందని చదువుకున్నాము. ఈ నాల్గింటిని ఉపేక్షించిన వారు వెనుకబడిపోతారు. మనము ఈ అనంతశక్తి యొక్క ఉద్గమ స్థానమును వెతకాలి. పరమపూజ్య గురుదేవులు ఇందుకు సంబంధించి మనోహరమైన ఒక కథను వినిపించారు. ఇందులో సగభాగం మీరు ఇంతకు ముందు సంచికలో చదివారు. భగవంతుడు జ్ఞానమును పంచేందుకు భూమి మీదకు వచ్చాడు. కానీ మనిషి తన మనస్సు కోరే కోరికల చిట్టాను తీసుకొని భగవానుని ఆశీర్వాదము కావాలని అడగడం మొదలుపెట్టాడు. ఆయన గాభరపడి పర్వతాల మీదకి వెళ్ళిపోయాడు. మనుష్యులు అక్కడికి కూడా వచ్చారు. ఆయన సముద్రంలోకి వెళ్తే ఆయనున్న ప్రదేశం తెలుసుకుని అక్కడికీ వెంబడించారు. ఎటూ దిక్కుతోచని భగవానునికి ఇంక ఒక్కటే మార్గం ఉన్నది. ఈ కథానిక మరియు వ్యాఖ్యానము యొక్క తరువాయి భాగాన్ని ఇప్పుడు చదువుదాము.

## దేవర్షితో సమావేశం

భగవానుడు ఎవరూ చేరలేని ఏకాంత ప్రదేశము కొరకు వెతికి అలిసిపోయాడు. ఇంతలో వీణానాదము చేస్తూ నారదమహర్షి అక్కడకు వచ్చాడు. రాగానే 'స్వామీ ఏమిటి అలా ఉన్నారు ఆరోగ్యం బాగాలేదా?' అన్నాడు. 'లేదు నారదా ఆరోగ్యం బాగానే ఉంది' అన్నాడు భగవానుడు. 'మరి ఏమిటి స్వామీ ఏమైనా గొడవలు జరిగాయా' అంటే 'లేదు నారదా అలాంటిదేమీ లేదు' అని భగవానుడు అన్నాడు. 'ఏమీ లేకపోతే అలా ఉన్నారేమిటి స్వామీ' అని నారదమహర్షి అడుగగా భగవానుడు ఇలా బదులిచ్చాడు. 'నేను ప్రజలను కళ్యాణకరమైన మార్గములో నడిపించేందుకు వచ్చాను. వారికి సుఖశాంతులతో కూడిన మార్గం చూపించాలని అనుకున్నాను. స్వర్గము, ముక్తితో వీరికి ఆనందము ఇవ్వాలనుకున్నాను. వారిని మహామానవులుగా తయారు చేయాలనుకున్నాను. భగవంతుని కుమారుడు కూడా భగవంతుని వలె గొప్పగా ఉంటాడు అని నిరూపించాలనుకున్నాను. భగవంతుని దగ్గర ఉన్న ఆనందమంతా అనుభవించమని చెప్దామనుకున్నాను'.

## సరైన స్థలము కొరకు వెతుకులాట

భగవానుడు ఇలా అంటున్నాడు – 'నారదా! ఈ మానవులకు ఇవన్నీ నేర్పాలనే వచ్చాను. కానీ వీళ్ళు పనికిరాని స్వార్థపరులు. వీళ్ళకి చిన్న చిన్న కోరికలే తప్ప పెద్ద పెద్ద ఆకాంక్షలు ఏమీ లేవు. వీళ్ళ దగ్గర నేనుండను. వీళ్ళకి దూరంగా పారిపోవాలని ఉంది. కానీ ఇంటికి మాత్రం వెళ్ళను. నేను పృధ్వి మీదనే ఉండాలి, మనుష్యులతో సంబంధము కలిగిఉండాలి. కానీ ఎవరికీ కనిపించకూడదు. ఈ మానవులు సముద్రంలో దాక్కున్నా, కొండలమీద దాక్కున్నా ఎక్కడికైనా వచ్చేస్తున్నారు. నేను విశ్రాంతిగా దాగి ఉండాలి. నన్ను పొందగోరువారు సులభంగా నన్ను చేరుకునేందుకు వీలుగా ఉండాలి. ఎవరుబడితే వారు నా దగ్గరకి రాకూడదు. నన్ను విసిగించకూడదు. అటువంటి ప్రదేశమేదైనా ఉంటే చూడు'.

## భగవానుడు ఇప్పటికీ అక్కడే ఉన్నాడు

'చాలా బాగుంది స్వామీ! నాకు తెలిసిన ఒక విశాలమైన ప్రదేశముంది. నేను మీకు ఇప్పుడే చూపిస్తాను.' అని అంటూ ఆ ప్రదేశం చూపించాడు నారదులవారు. ఆ రోజు నుండి భగవానుడు అక్కడే ఉండసాగాడు. అక్కడ నుండి కదలకుండా కూర్చుని ఉన్నాడు. భూమి మీదనే ఉన్నాడు. కావాలనుకున్నవారు ఆయన దగ్గరకి చేరుకోవచ్చు. మాట్లాడవచ్చు, ఆయన సాన్నిధ్యాన్ని పొందవచ్చు. "స్వామీ! ఈ మానవులు అటూ ఇటూ తిరుగుతూనే ఉంటారు కానీ మిమ్మల్ని మాత్రం చేరుకోలేరు'' అని నారదులువారు హామీ ఇచ్చారు. మీరు అనుకుంటున్నారు, గురుజీ మాకు చెప్పండి! కానీ మీరు ఎవరికి చెప్పకూడదు. చెప్తానంటే మీకు చెప్పను. చెప్పకూడదు చెప్తే అందరికి తెలిసిపోతుంది. తెలిస్తే అందరూ అక్కడికి వెళ్తారు. భగవంతుడికి కోపం వస్తుంది.

## భగవానుడు మీ దగ్గరే ఉన్నాడు

నేను మీకు భగవంతుడు ఉండే స్థలం గురించి చెప్తాను. వెళ్తారా, వెళ్ళరా మీరు. వెళ్ళకండి వెళ్తే ఆయనకు కోపం వస్తుందేమో! భగవంతుడు ఎక్కడ ఉన్నాడో చెప్తున్నాను. కలవాలనుకుంటే కలవవచ్చు, మాట్లాడవచ్చు. భగవంతుని ద్వారం తెరిచే ఉన్నది. కాని ఆయన ఎవరికి కనపడడు. అలాంటి స్థలం అది. మీకు చెప్తున్న ఆ స్థలం ఎక్కడో లేదు. ఆ ప్రదేశం మానవుని

[redacted] పదే పదే పరుల దోషాలు నెంచకు.

హృదయస్థానమే. అది బయట ఎక్కడో లేదు, మానవుని హృదయంలోనే ఉంది. బయట కేవలం పంచతత్వాలతో కూడిన ప్రకృతే ఉంటుంది. అది జడపదార్థము. బాహ్యంగా ఉండే వస్తువులలో కానీ, పదార్థాల్లో కానీ శాంతి లేదు.

## శాంతి ఎక్కడో లేదు

సుఖసౌకర్యాలలో శాంతి లేదు. అలాగైతే రావణునికి ఎప్పుడో శాంతి లభించి ఉండేది. ఆయనకి బంగారు పల్లకీలు ఉన్నాయి, అన్ని రకాల సౌకర్యాలున్నాయి, అంతేకాదు ఆయన ఇల్లే బంగారంతో కట్టుకున్నాడు. సంతానము వల్ల సుఖము లభిస్తుందా అంటే ఆయనకి లక్షమంది కొడుకులు, లక్షాపాతిక వేల కూతుళ్ళు ఉన్నారు. మొత్తం రెండు లక్షల పాతికవేల మంది సంతానము ఉన్నారు. **నిజాయితీగా చెప్పాలంటే మనిషి ఏ మనుష్యుల ద్వారా, వస్తువుల ద్వారా సుఖము, శాంతి లభిస్తుందని అనుకుంటాడో అవి ఏవీ అతనికి సుఖాన్ని ప్రసాదించవు.** పోనీ విద్య ద్వారా అనుకుంటే ఎమ్.ఎస్.సి, పి.హెచ్.డిలు చేసి మంచి ఉద్యోగము సంపాదించి విద్వాంసుడైపోతే ప్రపంచంలో శాంతి పొందడం సంభవమా అంటే అదీ కాదు.

రావణుడు గొప్ప విద్వాంసుడు. బాగా చదువుకున్నవాడు. అమిత బలసంపన్నుడు. అతని చేతుల్లో మంచి బలముంది. మంచి బలము, సౌకర్యాలు, శక్తి ఉంటే సుఖము, శాంతి లభిస్తాయా అంటే ఖచ్చితంగా లభించవు. రావణుడు గొప్ప సంపన్నుడు, విద్యకు, డబ్బుకు, బలానికి, పురుషార్థానికి దేనికీ లోటు లేదు. కానీ అతనికి శాంతి లేదు. మరణ సమయంలో అతని శరీరం మీద వేలకొలది రంధ్రాలు ఉన్నాయి. అది చూసిన లక్ష్మణుడు శ్రీరామునితో 'ప్రభూ! మీరు ఒక బాణమే వేశారు అతని మీద, మరి ఇన్ని గాయాలై రంధ్రాలు పడి రక్తము కారిపోతున్నది' అని అడిగాడు. అందుకు శ్రీరాముడు ఇలా ప్రత్యుత్తరమిచ్చాడు– ఆ వేల రంధ్రాలన్నీ అతని పాపానికి, నీచత్వానికి, బలహీనతలకు, తుచ్ఛతకు ప్రతిరూపాలు. అవి అన్నీ కలిపి అతని శరీరాన్ని ఛేదించి అతని వ్యక్తిత్వాన్ని సమూలంగా నాశనము చేశాయి.

## చెడు మార్గంలో పయనించుట వల్ల వచ్చే పరిణామాలు

రామాయణంలో ఈ విషయమే చెప్పబడింది. మనిషి ఆత్మ బలహీనమైపోతే ఆత్మబలము, స్వభావము, గొప్పతనము అన్నీ బలహీనపడిపోతాయి. రావణుడు కాలాన్నే అదుపు చేశాడు, దేవతలను తన గుప్పిట్లో ఉంచుకున్నాడు, సముద్రంపై ఆధిపత్యము సంపాదించాడు, బంగారులంకను నిర్మించాడు. కానీ సీతాపహరణ సమయంలో బలహీనుడైపోయాడు. ఆమెను అపహరించేందుకు ఎన్నో కుట్రలు పన్నాడు. భిక్షగాడిగా మారాడు. రావణుని వాకిట పడిఉండే భిక్షగాళ్ళకు కనపడకుండా చాటుగా సీతాపహరణకు వెళ్ళాల్సి వచ్చింది. అది చాలా దయనీయమైన స్థితి. ఎందుకంటే అతను చెడు మార్గంలో వెళ్ళడం ప్రారంభించాడు. ఒక వ్యక్తి తప్పుడు మార్గంలో నడవడం మొదలుపెట్టగానే అతని తేజస్సు, బలము, బుద్ధి, సద్గుణాలు అన్నీ తుడిచిపెట్టుకుపోతాయి.

## మనం దోపిడీకి గురయ్యాము

మనము ఏ పని కొరకు జీవిస్తున్నామో, ఎంత ఉజ్వలమైన జీవితము గడిపేందుకు అవకాశముందో, అది పట్టించుకోక పోవడమే మనం చేస్తున్న పెద్ద పొరపాటు. జన్మించేటప్పుడు మనము భగవంతుడిచ్చినవన్నీ వదిలిపెట్టి చిన్న చిన్న విషయాలలో చిక్కుకొని జీవితము నుండి పొందవలసిన లాభాన్ని పొందలేకపోతున్నాము. ఈ ప్రపంచంలోకి వచ్చి ఏమి పొందాము? మనము భగవానుని దగ్గరనుండి అపరిమితమైన శక్తులతో నిండిన భాండాగారాన్ని తెచ్చుకున్నాము. మన కళ్ళు సూర్యచంద్రులు, శరీరమంతా దేవతల నివాసము. శక్తికి సంబంధించిన దేవతలందరూ మన శరీరంలోనే ఉన్నారు. గణేశుడు మస్తిష్కంలోనే ఉన్నాడు. నాలుక మీద సరస్వతి ఉంది. హృదయంలో చతుర్ముఖుడైన బ్రహ్మ ఉన్నాడు. నాభిస్థానంలో శంకరుడు ఉన్నాడు. ఇంతమంది దేవతలకు నివాసస్థానమైన ఈ శరీరము మనకు లభించింది. దేవతలతో నిండిన ఈ శరీరము ద్వారా ఏ లాభము, ఫలితము పొందగలమో దానిని మనము పొందలేకపోతున్నాం. మనం చేస్తున్న చిన్న చిన్న తప్పులు జీవితము యొక్క ఉద్దేశ్యాన్నే మరచిపోయేలా చేస్తున్నాయి.

## చెడు ఆలోచన మనస్సులోనే ఉంది

మనిషి కూడబెట్టుకునేందుకు, తిండితినేందుకు మాత్రమే పుట్టాడని అందరూ అనుకుంటారు. మనిషి ఇంద్రియాల ద్వారా పొందే లాభాలను, సౌకర్యాలను పొందేందుకు, కీర్తిని సంపాదించేందుకు పుట్టాడని; తన గొప్పను, గౌరవాన్ని ఇతరులపై తన ప్రతాపాన్ని చూపేందుకు పుట్టాడని చుట్టూ ఉన్న సమాజము నూరిపోస్తుంది. ఈ మాటలు మనస్సులో పాతుకుపోయి మనిషి ఇతరులపై సవారీ చేయడం మొదలుపెడతాడు. అదే సరైనదని నమ్మిన వ్యక్తి అలాగే జీవించడం మొదలుపెడతాడు.

[redacted] న్నావు దేహన్ని- పుచ్చుకుని వీడవెందుకు మోహన్ని.

## చిన్న తప్పుకు పెద్ద పరిణామం

ఒక్కోసారి మనం చేసే చిన్న తప్పుకు కూడా పరిణామం చాలా పెద్దదిగా ఉంటుంది. ఇటువంటి తప్పే కళింగదేశంలోని ఒక రాజు చేశాడు. ఒకసారి ఆయన ఫలహారము సేవిస్తున్నాడు. ఆ సమయంలో త్రాగే నీటితో పాటు మధుపర్కమును కూడా ఇచ్చారు. మధుపర్కమంటే పెరుగు, తేనె ఇస్తారు. దానిని చాలా జాగ్రత్తగా తినాలి. ఆ రాజుగారు తేనెను జాగ్రత్తగా తినలేదు. అటూ ఇటూ చూస్తూ మాట్లాడుతూ తినడం వల్ల కొంత పాత్రలో మిగిలిపోయింది, కొంత చుట్టూ నేలమీద పడింది. తిన్న తరువాత రాజుగారు వెళ్ళిపోయారు.

ఆయన వెళ్ళిన తరువాత అక్కడ పడిన తేనె కోసం ఈగలు వచ్చి చేరాయి. అలా ఈగల గుంపును చూసి వాటిని తినేందుకు బల్లులు వచ్చి చేరాయి. ఈ బల్లుల గొడవను చూసి ఒక పిల్లి ఆహా! బల్లి రుచికరమైన ఆహారము అనుకుంటూ అక్కడికి చేరింది అలా పిల్లి రాగానే దానిని చూసి లొట్టలేసుకుంటూ ఒక కుక్క వచ్చి ఆ పిల్లి కాలు, చెవి పట్టుకుంది. ఇంతలో ఎక్కడినుండో వేరు కుక్క వచ్చింది. ఆ పిల్లి కోసం రెండూ కొట్టుకున్నాయి. ఆ అదను చూసి పిల్లి పారిపోయింది.

## విషయం పెద్దదైంది

ఈ రెండూ కొట్లాడుకోవడం చూసి వాటి యజమానులు వచ్చారు. మీ కుక్క మా కుక్కను కరిచిందని ఒకరి మీద ఒకరు నిందలేసుకున్నారు. నీ తప్పంటే నీ తప్పని మాటామాటా పెంచుకున్నారు. మాటామాటా పెరిగి పెద్ద కొట్లాట జరిగింది. వారిలో ఒకరు బ్రాహ్మణుడు, ఒకరు జమీందారు. జమీందారు తమ తోటి బ్రాహ్మణుడిని కొట్టి అవమానించాడని బ్రాహ్మణులంతా జమీందార్లు మీద దాడి చేశారు. ఈ బ్రాహ్మణుల సంగతేటో చూద్దామని జమీందార్లు బయలుదేరారు.

ఇద్దరి మధ్య పెద్ద యుద్ధమే జరిగింది. ఇదే మంచి అదుననుకొని అక్కడ ఉండే దొంగలు, దోపిడిగాండ్రు విప్లవం లేవదీసి అంతా కొల్లగొట్టి భాగాలు పంచుకోవాలనుకున్నారు. అంతే పట్టణమంతా అల్లర్లతో నిండిపోయింది. ఈ పల్లెల్లో ఇంక ఏమీ దొరకడం లేదు కనుక రాజుగారి ఖజానాను దోచుకుందామని ఆక్రమణదారులంతా కలిసి ఖజానాను కొల్లగొట్టారు. బంగారం, వెండి, రత్నరాశులు మొత్తం దోచుకుపోయారు.

## ఇప్పుడు పశ్చాత్తాపపడితే ఏమౌతుంది?

రాజుగారు శోకంలో మునిగిపోయారు. ఏం జరిగిందో విచారించడానికి మంత్రులు, మిగిలిన సభాసదులంతా సభ ఏర్పాటు చేసి ఒక కమిటీ వేసి విచారణ మొదలుపెట్టారు. దోపిడీకి కారణం వెతికితే ఒక బ్రాహ్మణుడు, ఒక జమీందారు మధ్య గొడవని తెలిసింది. అందుకు కుక్కలు కారణమని, వాటి కొట్లాటకు పిల్లి కారణమని, బల్లుల కోసం పిల్లి వచ్చిందని, ఈగల కోసం బల్లులు వచ్చాయని, తేనెకోసం ఈగలు వచ్చాయని, తేనె రాజుగారు నిర్లక్ష్యంగా తినడం వల్ల క్రింద పడిందని దానితో ఇంత పెద్ద గొడవ జరిగిందని తేలింది.

## అన్ని పద్ధతులు వివేకం మీదనే ఆధారపడిఉంటాయి

వివేకం లేకపోవడం వల్ల మన జీవితంలో కూడా ఇలాంటి సంఘటనలే చోటుచేసుకుంటాయి. రాజుగారు నిర్లక్ష్యం వల్ల చేసిన చిన్న తప్పుకు ఖజానాను ఖాళీ చేసుకోవాల్సి వచ్చింది. చిన్న విషయమే కానీ వివేకం లోపించింది. ఇది అందరికీ ఒక సూచన మాత్రమే. మానవజన్మ తీసుకొని ప్రపంచంలోకి వచ్చి బ్రాహ్మణోచిత జీవితాన్ని బ్రాహ్మణుని వలె గడిపి తద్వారా వచ్చే బహుమూల్య ఆనందాన్ని, లాభాన్ని పొందాలి. మన జీవిత విధానము నీచంగా, వివేకహీనంగా ఉండకుండా ఉండాలంటే చిన్న చిన్న విషయాలలో కూడా మనం జాగరూకతతో వ్యవహరించాలి. అప్పుడు జీవితం మరోలా ఉంటుంది. అప్పుడు మన కోరికలు, ఆకాంక్షలు, జీవితవిధానం, ఆలోచించే విధానం, పనిచేసే విధానం అన్నీ వివేకం మీదనే ఆధారపడిఉంటాయి. అలా చేస్తే ఇప్పుడు జీవించే జీవితానికి, ఆ జీవితానికి భూమ్యాకాశాలంత తేడా ఉంటుంది. అందుచేత వివేకవంతులమై జీవిస్తే జీవితము యొక్క ఉద్దేశ్యాన్ని నెరవేర్చుకోగలుగుతాము.

*– అఖండజ్యోతి, అక్టోబరు 2010*
*అనువాదం: శ్రీమతి వల్లీ శ్రీనివాస్*

**యుగశక్తి గాయత్రి**
**మాస పత్రిక చదవండి !**
**చదివించండి !!**

[redacted] ఇవ్వటం సులువే, పాటించటమే కష్టం.

**నావారితో నామాట : 2011 - 2012 జన్మ శతాబ్ది సంవత్సరం**

# ఇంకా 100 రోజులు మాత్రమే ఉన్నాయి

## విలక్షణమైన సౌభాగ్యము

శతాబ్ది సంవత్సరములో జరిగే మహాకుంభ సమయము దగ్గరకు వచ్చేసింది. ఆలోచనలలో పరివర్తన తీసుకువచ్చేందుకు అవతరించిన పూజ్యగురుదేవుల 100వ పుట్టినరోజును మాత్రమే కాదు మనము జరుపుకుంటున్నది, సంవత్సరమంతా జరిగే శతాబ్ది మహాపర్వములో మనము కూడా పాలుపంచుకుంటున్నాము. మనము ఎంతో అదృష్టవంతులం. ఇటువంటి అదృష్టము ఏ సద్గురు శిష్యులకూ అంత సులభంగా లభించదు. శ్రీరామకృష్ణపరమహంస జన్మశతాబ్దిలో (1963) కొంతమంది వ్యక్తులు మాత్రమే పాలుపంచుకోగలిగారు. 1911లో జన్మించి 80 సంవత్సరాలు సక్రియమైన జీవితమును గడిపిన గురుదేవుల జన్మశతాబ్దిలో మనము కూడా భాగస్వాములం అవుతున్నామంటే మనవంటి అదృష్టవంతులు ఎవరు లేరు. ఈ మహాపర్వములో గడిచిన 20 సంవత్సరాలనుండి పని చేస్తున్న ఒక గొప్ప యువశక్తి కూడా పాలుపంచుకుంటున్నది.

## ఆయన స్థాపించినవి

గురుదేవులు అన్ని ధర్మములవారికి, విద్యావంతులకు, గ్రామీణ నిరక్షరాస్యులకు, కర్మకాండలు చేసుకునే వ్యక్తులకు, నాస్తికులకు, యువకులకు, ముసలివారికి అందరికీ చెందినవారు. ఇందులో అందరూ పాలుపంచుకోవచ్చు. ఆయన 20, 21 శతాబ్దాలను రెండింటినీ సమానంగా ప్రభావితము చేశారు. 20వ శతాబ్దంలో పరాధీనతతో మ్రగ్గుతున్న భారతీయ ప్రజల మనస్సులలో ఆయన క్రొత్త ఆశలను చిగురింపచేశారు. ధర్మతంత్రమునకు శక్తివంతమైన వైజ్ఞానిక ఆధారమును అందించారు. సామాజిక, బౌద్ధిక, నైతిక క్రాంతులనే బలమైన పునాదిపై విశ్వమానవతను స్థాపించారు. శ్రీరామకృష్ణ పరమహంస, స్వామీ వివేకానంద, సద్గురు శ్రీ కబీరు, సమర్థరామదాసు మొదలు క్రాంతికారీ (విప్లవాత్మక) ఆలోచనలున్న సంఘసంస్కర్తలందరి ఆలోచనలు గురుదేవుల ఆలోచనలతో కలిసిపోతాయి. ఆయన ఆధ్యాత్మిక ఆదర్శాలను, జీవితములో ఆచరించవలసిన కళను నేర్పిస్తారు. జీవితాన్ని జీవించే కళ (ఆర్ట్ ఆఫ్ లివింగ్) ను ఆయన తన అఖండజ్యోతి పత్రిక ద్వారా 1940వ దశాబ్దంలోనే నేర్పించారు. గాయత్రీసాధనను, యజ్ఞవిజ్ఞానమును అందరికి అందించి దానిని ఒక అభియానం (యాత్ర) వలె మార్చడమే కాక దానికి సుడిగాలికున్నంత తీవ్రమైన వేగమును అందించారు. దయానందసరస్వతి ఆర్యసమాజమును స్థాపించే సమయములో 'పాఖండఖండినీ' (మూర్ఖులను ఖండించుట) అనే పతాకమును ఎగురవేసిన సమయములో ఏమి చేశారో అలాగే గురుదేవులు కూడా వక్రమైన ఆలోచనావిధానమును సరిచేయుటకు ఒక ప్రణాళికను సిద్ధం చేశారు. అప్పట్లో లక్షలాదిమంది యువకులు గాంధీగారితో కలిసి స్వతంత్రసంగ్రామములో పాలుపంచుకున్నారు. స్వాతంత్ర్యము వచ్చిన తరువాత ఒక పెద్ద యువసేన 1960 నుండి 1990 మధ్యకాలము వరకు గురుదేవులతో కలిసి నిరంతరం నడుస్తూనే ఉంది.

## ఆయన ఆలోచనలకు చికిత్స చేశారు

మనము ఆయనను ఆలోచనా పురుషుని రూపంలో స్థాపించుకున్నాము. ఈనాడు విశ్వములోని మానవులందరినీ పీడిస్తున్న అనేక సమస్యలకు ఆయన సమాధానం చూపించారు. ఒక్కోసారి ఆయన కాలాన్ని దాటి వెళ్ళారని అనిపిస్తుంది. ఆయన కలం ద్వారా వ్రాసినవి, వాక్కు ద్వారా చెప్పిన విషయాలను జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ రోజు జరుగుతున్నవి, రానున్న కాలంలో జరగబోయే ఎన్నో విషయాల గురించి ఆయన ముందుగానే చెప్పడమే కాక వాటికి పరిష్కారాలు కూడా చెప్పారు. గృహస్థ జీవితములో ఉంటూనే తపోమయజీవితమును జీవించి చూపించారు. సన్యాసులను చూసి తలవంచుకుంటూ ఆధ్యాత్మికతను వారికి మాత్రమేనని అనుకునే లక్షలాదిమంది, కోట్లాదిమంది గృహస్థులకు ఆయన మార్గము చూపించారు. దాంపత్య జీవితములో పవిత్రతను, సంయమనాన్ని ఎలా తీసుకురావాలి, స్వావలంబన ప్రక్రియ ద్వారా సమాజానికి నేతృత్వము వహించగలిగే శక్తివంతురాలిగా స్త్రీని ఎలా మార్చాలి అనే విషయాలన్నింటినీ ఆయన ఆలోచనల ద్వారా మనము తెలుసుకోవచ్చు. ఆలోచనల ద్వారా చికిత్స చేసే ఏకైక మనీషి పూజ్యగురుదేవులు. ఈనాటి సైన్సు చదువుకునే వారిని కూడా ఉపనిషత్తుల జ్ఞాన-విజ్ఞానాన్ని, వేదపురాణములను చదివి అర్థము చేసుకునేందుకు ప్రేరణ ఇచ్చారు. ఆత్మకు సంస్కృతిని తోడు

[redacted]ఖాలు బ్రతుకు నాణానికి బొమ్మ బొరుసు.

చేసి గొప్పగా ఎలా తయారవవచ్చు, దేవత్వమును ఎలా వికసింపచేసుకోవచ్చు అనే విషయాలన్నీ మనము ఆయన జీవితమునుండి నేర్చుకోవచ్చు.

## ఇది చాలా అసాధారణమైన సమయం

2011వ సంవత్సరం సాధారణమైనది కాదు. ఇది యుగమునే మార్చివేసే సంవత్సరం. ఏ సత్యయుగము గురించి మనము ఉద్ఘాటించామో దాని శుభారంభము 2011-2012 సంవత్సరములోనే జరగబోతుంది. 2011 మన గురుదేవుల జన్మశతాబ్ది సంవత్సమైతే, 2012 అఖండజ్యోతి దివ్యజ్ఞానమును ప్రకటీకరించిన హీరక్‌జయంతి (డైమండ్ జూబ్లి) సంవత్సరము. 75 సంవత్సరములనుండి అనవరతంగా పత్రికా రూపంలో ఉన్న ప్రాణపుంజము ప్రజలనందరినీ జ్ఞానచేతనా సరోవరంలో ఓలలాడిస్తున్నది. ఈ రెండు సంవత్సరాలలో సమాజములో, విశ్వములో ఈనాడు మనకు అసంభవమనిపించేవన్నీ చాలా వేగంగా మారిపోతాయి. సారం లేని ధార్మిక అంధవిశ్వాసాలనుండి దూరంచేసి మానవతావాదంతో కూడిన ఆధ్యాత్మికతను ఆచరించి చూపిస్తూ ప్రచారం చేసే ఒక కొత్త తరం ముందుకు వస్తుంది. ఇది మానవజాతికి చాలా మహత్వపూర్ణమైన విషయం. మనం సంపూర్ణ ఉత్సాహంతో ఈ 354 రోజులు (2011 ఫిబ్రవరి 8 నుండి 2012 ఫిబ్రవరి 28 వరకు) ప్రతి క్షణమును సదుపయోగము చేసుకోవాలి. అనుకున్న నిర్ణయాలను ఎంతో ఉల్లాసంగా అమలుపరచాలి. మనము సంపూర్ణ శక్తితో ఈ క్షణాలను గురుచేతనను విస్తరింపచేసేందుకు వినియోగిస్తే 2012 ప్రారంభసమయం ఖచ్చితంగా చాలా అద్భుతంగా ఉంటుంది. ఈ సమయమును సాధనామయ జీవనచర్య కొరకు వినియోగించటం యుగధర్మము.

## ఆయన ఆలోచనలను ప్రతివ్యక్తి దగ్గరకు చేర్చాలి

ఆయన అంతర్వేదనను అర్థము చేసుకొని ఆయన ఆలోచనలను అందరివద్దకు చేర్చాలి. సమారోహము ఎలాగైనా బ్రహ్మాండంగా జరుగుతుంది. కానీ ఈ సందర్భంగా ఎంతమందిలో ఆయన ఆలోచనలు లోతుగా, స్థిరంగా పాతుకున్నాయి అనేదే చాలా ముఖ్యమైన విషయము. డోలు చూడడానికి బాగానే ఉంటుంది. కానీ వాయించేటపుడే దాని సంగతి తెలుస్తుంది. అదే విధంగా ఆధ్యాత్మిక జీవితము కూడా చూడడానికి చాలా బావుంటుంది. మనోబలము తక్కువ కావడం, సరైన ఇచ్ఛాశక్తి లేకపోవడం వంటి చిన్నచిన్న బలహీనతలు ఆవైపుకు మనల్ని పోనీయవు. ఇటువంటి సమయంలోనే మహాపురుషుల ఆలోచనలు మనకు తోడుగా ఉంటాయి. అవి మనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాక మన అంతర్జగత్తులో కర్తవ్యనిష్ఠతో కూడిన కాంతిమండలాన్ని నిర్మిస్తాయి. దాని వల్ల భౌతికపరమైన సౌకర్యాలేవీ లేకపోయినప్పటికీ నిరంతరం ముందుకు సాగేందుకు ప్రేరణ లభిస్తూ ఉంటుంది. ఈ ప్రేరణల వల్ల ఉత్పన్నమైన శ్రేష్టమైన ఆలోచనల అగ్నిలో పడి ఈర్ష్య, ద్వేషము, అసూయ, అహంకారములనబడే మానవ బలహీనతలు మాడి మసైపోతాయి. రాబోయే సంవత్సరాలలో మనము నూతన ఆలోచనా ప్రవంతిని ఎంతమంది వ్యక్తుల దగ్గరకు, పీడింపబడే మానవజాతి దగ్గరకు తీసుకువెళ్ళగలమనే విషయంపై దృష్టి సారించాలి. ఇది చాలా అనుకూలమైన సమయం. ఆలోచనల ద్వారాలు మంచి, చెడు రెండింటినీ స్వీకరించేందుకు తెరవబడి ఉన్నాయి. అటువంటపుడు మనమెందుకు ఈ అవకాశము ఉపయోగించకూడదు?

## ఆలోచనలను విస్తరింపచేసేందుకు 12 విధానాలు

శతాబ్దిపురుషుని ఆలోచనలను విస్తరింపచేసేందుకు ఎన్నో మార్గాలు ఉన్నాయి. రాబోయే నెలలో వీటి మీద మనస్సు పెట్టి రకరకాల రూపాలలో క్రియాన్వితం చేసే ప్రణాళికలు వేసి కార్యరూపంలోకి తీసుకురావాలి.

1. గురుదేవుల జ్ఞానప్రవాహం 'అఖండజ్యోతి' (విభిన్న భాషలలో) యుగనిర్మాణయోజన, యుగశక్తిగాయత్రి ప్రతినెలా అచ్చువేయబడుతున్నాయి. ఈ పుస్తకాలు ప్రతినెలా దేశంలోని లక్షలమంది దగ్గరకు చేరుతున్నాయి. ఇవికాక మిషన్‌కి సంబంధించిన సమాచారానిచ్చేందుకు, సమయానుకూలంగా మార్గదర్శనం చేసేందుకు 'ప్రజ్ఞాఅభియాన్' పక్షపత్రిక కూడా ఉపయోగపడుతున్నది. ఇది ప్రతి 15 రోజులకి హిందీ, మరాఠీ, బెంగాలీ, గుజరాతీ, ఒరియా భాషల్లో విడుదలౌతుంది. ఈపత్రిక పాఠకులను పెంచాలి. అందుకొరకు ఒక ప్రణాళిక వేయాలి. శతాబ్ది సంవత్సరంలో సమయదానము-అంశదానము వంటి కొన్ని లక్ష్యాలేవైతో నిర్ధారించుకున్నామో అదే విధంగా పాఠకులను పెంచేందుకు కొన్ని లక్ష్యములు నిర్ధారించుకోవాలి. ప్రతి వ్యక్తి కనీసము 5 నుండి 10 మంది వ్యక్తులతో ఈ పత్రికను చదివించాలి.

2. ఈ పత్రికలలో వచ్చే వ్యాసాల మీద ఎవరికీ ఎటువంటి కాపీరైట్లు లేవు. ఇది యుగఋషి యొక్క ఆలోచనా ప్రవంతి. ఇది సార్వభౌమికమైనది (అందరికీ చెందినది).

[redacted]ప్పుదు మరణం, గొప్పదనానికే ఉండదు మరణం.

3. ఈ ఆలోచనలను ఆధారం చేసుకొని జరిపే చర్చలను టి.వి, రేడియో, అన్ని ఛానెల్స్‌లోనూ ప్రసారం చేయవచ్చు. ఈ విషయాలను తెలుసుకునేందుకు వారంతా మన వద్దకు వస్తారని ఆశిస్తున్నాము. లేదంటే మనమే వారి వద్దకు వెళ్ళవలసి ఉంటుంది.

4. గురుదేవుల యొక్క శాశ్వతమైన ఆలోచనలను ప్రతిబింబించే క్రాంతిధర్మీసాహిత్యం, ఆయన రాసిన 3000 చిన్న, పెద్ద పుస్తకములన్నీ ఇంగ్లీషుతో సహా అన్ని భారతీయ భాషల్లోనూ ప్రచురింపబడాలి. జేబులో పట్టే పుస్తకాలతో పాటు, ఫోల్డర్‌లు, బ్రోచర్లు, విజ్ఞాపనలను మనము ప్రతి వ్యక్తి దగ్గరకి చేర్చాలి.

5. గురుదేవుల ఆలోచనల ఆధారముగా నాటకాలు, సీరియల్స్ సాంస్కృతిక కార్యక్రమాలు, విప్లవాత్మకమైన నాటకాలను తయారుచేసి ప్రజలంతా సామూహికంగా కలిసి జరుపుకునే సభలు, వర్క్‌షాప్‌లు, జయంతి కార్యక్రమాల్లో వీటిని పెద్ద ఎత్తున ప్రదర్శించాలి.

6. స్టిక్కర్లు, గోడలపై సద్వాక్యలేఖనం, బ్యానర్స్, హోర్డింగ్స్ అనేవి తెలీకుండానే అందరితో ఒక విధమైన చిన్న స్వాధ్యాయం చేయిస్తాయి. ఇవి అందరికీ ప్రేరణనిస్తాయి. వీటిని చక్కగా అన్నిచోట్లా పకడ్బందీగా ఉపయోగించుకుంటూ దేశమంతటా విస్తరింపచేయాలి. మంచి ఆలోచనలు అందరికీ నచ్చుతాయి.

7. జ్ఞానరథానికి చిన్న మార్పులు చేసి ఉపయోగించాలి. సంచీ పుస్తకాలయాలను, సైకిల్స్, రిక్షాలు, మారుతీవ్యాన్‌లు, టాటా 408, టాటా 602 లాంటి పెద్ద వాహనాలా ఇలా అన్నింటినీ ఉపయోగించి దేశంలోని ముఖ్యమైన 400 జిల్లాల్లో కనీసం 400 జ్ఞానరథాలనైనా ఖచ్చితంగా తిప్పాలి. దానివల్ల తిరిగే పుస్తకాలయాలు కూడా అందరి దగ్గరికీ చేరతాయి. దానితో ఆలోచనలలో చేతనత్వము విస్తరిస్తుంది.

8. స్లైడ్ ప్రొజెక్టర్ల ద్వారా యుగఋషి ఆలోచనలను సినిమా హాల్స్‌లో, నెట్‌లో, రకరకాల కార్యశాలల్లో (వర్క్‌షాప్‌లు) విభిన్న విషయాలను వివరించాలి. ఈ సందర్భంలో మార్గదర్శనం కావాలనుకునే వారు శాంతికుంజ్‌ని సంప్రదించండి.

9. దేశమంతటా లైబ్రరీలు చాలా ఉన్నాయి. ఈ గ్రంథాలయాలకు మిషన్ సాహిత్యాన్ని యుగఋషి ఆలోచనలను పంపించే ప్రయత్నము చేయాలి. మిగతాపని గురుదేవులే చూసుకుంటారు.

10. దేశమంతటా సంవత్సరమంతా లెక్కలేనన్ని కార్యశాలలు నిర్వహించబడుతుంటాయి. అవకాశమున్నవారు అందులో పాల్గొని తమ పేపర్ల ద్వారా ఈ విషయాలను అందించాలి. తెలివితేటలున్నవారు ఈ ఆలోచనల ప్రవంతిని ఆశ్చర్యకరమైన రీతిలో త్వరితగతిన పట్టుకుంటారు.

11. మన లక్ష్యము భారతదేశపు యువశక్తి తప్పుమార్గాన్ని ఎంచుకోకముందే మనం మంచి ఆలోచనల ద్వారా వారిని పట్టుకోవాలి. 'సాంస్కృతిక అభియాన్' లేదా దియాకు చెందిన యువమండలులు చేసే విభిన్న కార్యక్రమాల ద్వారా దేశమంతటా ఉన్న విద్యాలయాలు, మహావిద్యాలయాలు, విశ్వవిద్యాలయాలలో ప్రవేశించవచ్చు. అలా యువశక్తిని సరైన మార్గములో నడిపించాలి.

12. మన దగ్గర 'భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష' అనే శక్తివంతమైన మాధ్యమము ఉన్నది. ప్రయత్నిస్తే ఈ సంవత్సరం పరీక్షకు కూర్చునే అన్ని భాషల విద్యార్థినీ-విద్యార్థులను, ఇంతకు ముందు ఉన్న విద్యార్థులను, సాంస్కృతిక మండలులను మన ఆలోచనా విధానములో స్థిరంగా కలుపుకోవచ్చు.

–అనువాదం : శ్రీమతి వల్లీ శ్రీనివాస్

## ప్రయోగాలన్నీ తనమీదనే

*ఇంగ్లాండుకు చెందిన ప్రసిద్ధ వైజ్ఞానికుడు డాక్టర్ డాల్టన్ ఇతర ప్రాణులమీద ప్రయోగాలు చేసి వాటిని బాధించడం మానవత్వానికి విరుద్ధమని భావించేవాడు. మానవుల ప్రాణం కంటె జంతువుల ప్రాణం తక్కువనే సంకుచితమైన ప్రతిపాదన ఆయన అంగీకరించేవాడు కాదు. అందువల్ల ప్రయోగాలు తన మీదే చేసుకునేవాడు. టిటానస్‌కు టీకాలు ఈ విధముగా ఈయన కనుక్కున్నవే. అటువంటి ప్రయోగాలు స్వయంగా తనపై చేసుకొనుట వలన మనిషికి ఎలాంటి హాని కలగదని నిరూపించాడు.*

*ఈయన మాంసాహారం కూడదనేవాడు. అందువలన అనేకమంది వీరిని హేళన చేసేవారు. ఆయన వాటిని లెక్కచేయక ధార్మిక విలువలకు ఆలవాలమైన భారతదేశానికి వచ్చి, తన ప్రయోగాలు ఇక్కడే జరిపాడు. వైజ్ఞానికులలో శిఖరాగ్ర స్థానం ఆయనది. ఇలాంటి వ్యక్తులు సిద్ధులను సునాయాసంగా పొందుతారు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

[redacted] గొప్ప సంపదే కాని సంతోషం ముందు దిగదుడుపే.

## దేవ సంస్కృతి విశ్వవిద్యాలయము

# సమయ ప్రబంధనము

వ్యక్తిత్వ నిర్మాణానికి ముఖ్యముగా కావలసింది సమయాన్ని సద్వినియోగపరచటం. ప్రకృతి మానవునికి ఇచ్చిన అత్యంతగొప్ప సంపద కాలము. దీనిని తరగని సంపద అని అంటున్నా గడిచిన కాలము తిరిగిరాదు కాబట్టి కాలాన్ని సదుపయోగము చేసుకొనుట మానవుని కర్తవ్యం. ప్రకృతి ప్రసాదించిన ఈ సంపదను సద్వినియోగపరచిన వ్యక్తులు చరిత్రలో కీర్తించబడ్డారు. **సమయ ప్రబంధనము అంటే సమయాన్ని సరిగ్గా ఉపయోగించటం.** ఈ టైం మేనేజ్‌మెంట్ ద్వారా పనులు సకాలములో చెయ్యటం జరిగి ఫలితాలు మంచిగా వస్తాయి. సమయ ప్రబంధనము ఉండాలంటే శారీరిక, మానసిక ఒత్తుడులను, అడ్డంకులను అధికమించాలి.

శ్రమ చేయటానికి శరీరము చాలా ముఖ్యము శరీరానికి సరిపడ్డ పనిని ఎంచుకోవాలి. పనికి పనికి మధ్య విశ్రాంతి సమయము ఉంచుకుంటే అలసటను అధికమించవచ్చు. ఆలోచనలే మనల్ని పని చేయటమో, చేయకుండా ఉండటమో చేస్తూ ఉంటాయి. మనిషి తను చేస్తున్న పనులు ఇతరులు ఎవరో నియంత్రిస్తున్నారు అని భావించినప్పుడు ఆ పనిని అక్కడ వదిలివేయటమో, వాయిదా వెయ్యటమో చేస్తాడు. ఈ స్థితి నుండి బయటపడటానికి ఎల్లప్పుడూ తనను తాను ఉత్తేజపరచుకుంటూ ఉండాలి. చెయ్యవలసి పనులను, చేరవలసిన లక్ష్యాలను నిరంతరము మననం చేసుకుంటూ ఉండాలి. రేపు చెయ్యవలసిన దాన్ని ఇవాళ, ఇవాళ చెయ్యవసిన దాన్ని వెంటనే చెయ్యటం వలన ఈ మానసిక అడ్డంకులను అధిగమించవచ్చు.

కొంతమంది చాలా పనులు ఒకేసారి మొదలుపెట్టి, ఏపనిని పూర్తి చేయలేక పోవటం, ఒకదానిలో సఫలత దొరకలేదని మరొకటి, దానిలో కూడా సఫలత దొరకలేదని ఇంకొకటి, ఇలా చాలా పనులు మొదలుపెడతారు. అసఫలత వారి మానసిక స్థితిపై చూపే ప్రభావము వలన వారు తాము చేసే పనులపై నియంత్రణ కోల్పోతారు. అందువలన పనులు మధ్యలోనే ఆగిపోతుంటాయి. ఇది నెగిటివ్ క్వాలిటి. దీనిని సరిచేసుకోవటానికి ప్రణాళిక చాలా ముఖ్యము. రెండవది చేస్తున్న పని గురించి కొంత రహస్యముగా ఉంచటం మంచిది. అన్నీ అందరికీ చెప్పటం వలన అడ్డంకులు కలుగవచ్చు. ఇతరులతో కలసి పనిచేసేటప్పుడు వారి సమయాన్ని, ప్రణాళికను అనుసరించి మనము నడవాలి.

పని వాయిదా వెయ్యటం, చెయ్యవలసిన పనిని సకాలములో చెయ్యక మళ్ళీ చేద్దాం చిన్నదేగా అనో, పెద్దది ఇప్పుడు చెయ్యలేము అనో వాయిదా వెయ్యటం వలన సమయం గడిచిన కొద్దీ అది మానసిక స్థితిపై ప్రభావము చూపుతుంది. సమయాభావము వల్ల పని పూర్తి చేసినా అది సంపూర్ణ ఫలితాన్ని ఇవ్వదు. ఈ టెంషన్స్ వలన బీ.పి, గుండె సంబంధించిన వ్యాధులు రావటానికి అస్కారము ఎక్కువ.

ఎవరినీ నమ్మకపోవటం ఒక మానసిక బలహీనత. దీని వలన సామర్థ్యం కలవారికి కూడా పనిని పంచరు. ఇది మనుష్యుల మధ్య దూరం పెరగటానికి కారణమౌతుంది. ఎదుటివారిని కరెక్ట్‌గా అంచనావేసి ప్రణాళిక ప్రకారం నడచినప్పుడు దీనిని అధిగమించవచ్చు. అతి విశ్వాసం వాస్తవికత నుండి దూరం చేస్తుంది. చేసే ప్రతి పని గురించి బాగా తెలుసుకుని, ఆలోచించి తగిన ప్రణాళికతో మొదలుపెట్టాలి. తాహతులేకపోయినా ప్రతి పనిలో తలదూర్చటం, అనుకున్న సమయానికి పని పూర్తిచేయలేకపోవటం వంటి విధానాలు పనిలో నాణ్యతను తగ్గిస్తాయి. చేస్తున్న ప్రతి పనిలో అన్ని మనకు అనుకూంగా ఉండవు. వాటిని సమర్థవంతంగా ఎదుర్కోగల వ్యక్తులను కలుపుకుని పోవటం వల్ల అనుకున్న సమాయానికి పనులు పూర్తి చేయవచ్చు.

నేటి కాలములో చాలా మంది సోషలైజింగ్ (సాంఘిక జీవనము)నకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వటం మనం గమనిస్తున్నాము. ఈ క్రమములో వారు బంధువులు, మిత్రులతో అధిక సమయమును గడుపుతున్నారు. ఈ క్రమములో వారు తమ పనులు ముందు నిర్ణయించుకున్న విధముగా జరుగుటకు ఏర్పాటు చేసుకుని ఇటువంటి సాంఘిక కార్యక్రమములలో పాల్గొనే విధముగా చూసుకోవాలి. అంతేకాక ఇటువంటి సందర్భాలలో ఇతరులు చేస్తున్న పనులను తప్పుపట్టడంకొరకు కాక ఉపయోగకరమైన విషయములను చర్చించటం ద్వారా సమయాన్ని వృథాపరచకుండా జాగ్రత్త పడవచ్చు.

బుద్ధిమంతులు తమ సమయాన్ని సదుపయోగపడే విధముగా విభజిస్తారు. ఆరోగ్యం కొరకు, ధన సంపాదనకు, సమాజానికి తగు విధముగా వెచ్చించి, అన్నీ సవ్యంగా జరిగేటట్లు చూసుకుంటాడు. దీని మూలముగా మనిషికి ఆత్మసంతోషం కలుగుతుంది. వ్యవస్థీకృత, శారీరక, మరియు మానసిక ఆరోగ్యాలపై మంచి ప్రభావం చూపుతుంది.

**సమయ ప్రబంధనము చేయటానికి కొన్ని మార్గాలు :**

1) ఇతరులతో సంభాషణ ప్రారంభించే ముందు వారి వద్ద సమయం ఉందా లేదా అనేది తెలుసుకోవాలి.

2) ఎదుటి వారిని కలసుకున్నప్పుడు అవసరమైన విషయాలనే చర్చించాలి. వారి సమస్యలు కూడా విని పరిష్కారములో పూర్తిగా సహకరించాలి.

3) తను చేయవలసిన పనుల లిస్టు తయారు చేసుకొని సకాలములో వానిని పూర్తి చేస్తూ ఉండాలి.

4) అతిగా సమాజిక వ్యక్తి అవకుండా, కొంత సమయం తన సొంత విషయాలు ఆలోచించటానికి ఉండాలి.

5) వీటిని పాటించటం వలన సమయ ప్రబంధనము సులభముగా చేయగలము.

[redacted]ించేది మౌనం - కల్మషాన్ని హరించేది ధ్యానం.

వార్తలు

# రాష్ట్రమంతటా జరిగిన వివిధ కార్యక్రమాలు

పండిత శ్రీరామశర్మగారి శతజయంతి సందర్భముగా 24 కుండముల గాయత్రి యజ్ఞ పరంపరలో భాగముగా మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన కార్యక్రమాలు.

## షాద్‌నగర్‌లో

మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ పట్టణంలో 01.10.2010 సాయంత్రం కలశయాత్ర కనుల పండువగా జరిగినది. 02.10.2010 నాడు ఉదయం భవానినగర్ రామమందిర్‌లో 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం అత్యంత వైభవముగా జరిగినది. శ్రీహీర్‌సింగ్ రాజ్‌పురోహిత్ శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ తోషన్ సాహు, పూల్‌సింగ్, చంద్రశేఖర్ గార్లు యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ చేతనా కేంద్ర కార్యకర్తలు, శ్రీ బి హనుమంతరెడ్డి, శ్రీమతి ప్రమీలా దేవిగార్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## పామాపురం గ్రామంలో

కొత్తకోట మండలము పామాపురం గ్రామంలో 02.10.2010 నాటి సాయంత్రం కలశయాత్ర అత్యంత వైభవముగా జరిగినది. శ్రీహనుమాన్ దేవాలయం నుంచి యజ్ఞస్థలియైన సమీప గుట్ట మీదకు పరమపూజ్య గురుదేవుల, పరమవందనీయ మాతాజీ, దాదా గురూజీ, గాయత్రీ మాత ఫోటోలతో రథయాత్ర కడు కమనీయముగా జరిగినది. మరుసటిరోజు అనగా 03.10.2010 నాడు ఉదయం పది గంటలకు 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం అత్యంత వైభవముగా జరిగినది. శాంతికుంజ్ దక్షిణ భారత సంచాలకర్తయైన శ్రీ అశ్విని సుబ్బారావుగారు విచ్చేసి చక్కటి సందేశము ఇచ్చారు. యజ్ఞం జరిగిన స్థలంలోనే గాయత్రీ మందిర నిర్మాణమునకు శ్రీహనుమాన్ విగ్రహస్థాపనకు సంకల్పం చేయబడినది. అక్కడే ఇష్టపూర్వకముగా 5 లక్షల రూపాయలకు పైగా విరాళాలు ఇస్తామని భక్తులు ముందుకొచ్చారు. కొంతవరకు నగదు కూడా వసూలైనది. యజ్ఞము తర్వాత అందరికి భోజన ప్రసాదము ఏర్పాటు చేయడమైనది.

అదే రోజు సాయంత్రం 7 గం॥లకు 1008 దీపాలతో గాయత్రీ దీప మహాయజ్ఞము అత్యంత సుందరముగా కనుల పండువగా, వైభవంగా జరిగింది.

ఈ కార్యక్రమాలన్నిటికి ప్రజలు ఈ గ్రామమునుంచే కాకుండా పరిసరగ్రామాలనుంచి విశేషంగా వందల సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాలన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమాలన్ని విజయవంతం కావటానికి గాయత్రీ పరివార్ కార్యకర్త శ్రీ నరసింహయాదవ్‌గారు, వారి సహచరులు, గ్రామస్తులు పూర్తిగా సహకరించారు.

## పెబ్బేర్ గ్రామం (మండలము)లో

పెబ్బేరు గ్రామములో ఉదయం 10 గం॥లకు 6 కుండముల గాయత్రి మహాయజ్ఞము శ్రీ రమణారెడ్డిగారి ఆధ్వర్యంలో నిర్వహించబడినది. సుమారు 150 మంది దాకా భక్తులు యజ్ఞంలో పాల్గొన్నారు. శ్రీయుతులు శ్రీనివాసులు శెట్టి, తిరుపతయ్య, హనుమంతశెట్టి, నాగభూషణం, హనుమంతరెడ్డి సహకరించారు.

## రాణిపేట గ్రామంలో

కొత్తకోట మండలము రాణిపేట గ్రామంలో 04.10.2010 నాడు సాయంత్రం 7 గం॥లకు 1008 దీపాలతో గాయత్రీ దీప మహాయజ్ఞం అత్యంత వైభవముగా జరిగినది. ఈ కార్యక్రమం కొత్తకోట విద్యాసంస్థల అధిపతి శ్రీ రాజవర్ధనరెడ్డి గారి ఆధ్వర్యంలో విజయవంతముగా జరిగినది.

## పూడూరు గ్రామం (గద్వాల మండలము)

పూడురు గ్రామంలో 04.10.2010 నాడు సాయంత్రం 7 గం॥లకు కలశయాత్ర అత్యంత కమనీయముగా జరిగినది. అధికసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. 05.10.2010 నాడు ఉదయం 10 గంటలకు గ్రామములోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో 24 కుండముల గాయత్రీ మహా యజ్ఞము అత్యంత వైభవముగా జరిగినది. యజ్ఞం తర్వాత అందరికి భోజన ప్రసాదములు ఏర్పాటు చేయబడినవి.

అదే రోజు సాయంత్రం 7 గంటలకు 1008 దీపాలతో గాయత్రీ యజ్ఞం అత్యంత కనులవిందుగా జరిగినది. పూడూరులో జరిగిన కార్యక్రమాలన్నిటికి అధిక సంఖ్య భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాలన్ని కూడా శ్రీరమణారెడ్డిగారి ఆధ్వర్యంలో జరిగింది. శ్రీలక్ష్మీకాంతరెడ్డి, నరేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి,

[redacted]చిని చూడు, చూసిచూసి మారిపోతావు ఒకనాడు.

రమేష్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, శంకర్‌గౌడ్, భాస్కర్ గౌడ్, విజయ ప్రకాశ్‌రెడ్డి, వెంకటేశ్‌రెడ్డి, ఈశ్వర్ యమ్.పి.టి.సి గార్లు కార్యక్రమాలకు సహకరించారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన పై కార్యక్రమాలన్ని శ్రీ హీర్‌సింగ్ రాజ్‌పురోహిత్, శాంతికుంజ్ ప్రతినిధి శ్రీతోషన్ సాహు, శ్రీ పూల్‌సింగ్, శ్రీ చంద్రశేఖర్, శ్రీ రఘు గార్లు నిర్వహించారు. భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష రాష్ట్ర కన్వీనర్ శ్రీ హనుమంతరెడ్డి మరియు వారి శ్రీమతి బి. ప్రమీలాదేవి గార్ల విశేష కృషితో ఈ కార్యక్రమాలన్నీ ఏర్పాటు చేయబడ్డాయి.

## విజయనగరంలో

పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది సమరోహాన్ని పురస్కరించుకుని విజయనగరంలో సెప్టెంబరు 1వ తేదీన శ్రీ వాసవి కళ్యాణ మండపంలో సాధనా శిబిరాన్ని ప్రముఖ కార్యకర్త శ్రీమతి సౌజన్యగారు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీమతి రాజ్యలక్ష్మిగారు ఆధ్వర్యం వహించారు. సాయంత్రం సహస్ర దీపయజ్ఞం నిర్వహించబడినది. స్థానిక కార్యకర్తలు శ్రీ కె. సుబ్బారావు, విశ్వేశ్వరరావుగార్లు సహకరించారు.

## విశాఖపట్నంలో

సెప్టెంబరు 22,23 తేదీలలో విశాఖపట్నంలోని శ్రీకృష్ణ మందిరంలో డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాస్టారుగారు విచార క్రాంతి అభియాన్ గురించి, సమయదానమే యుగధర్మం గురించి ప్రవచనాలు ఇచ్చారు. బీహార్ స్కూల్ ఆఫ్ యోగా శ్రీ భక్తి చైతన్యానంద స్వామి యోగనిద్ర గురించి వివరించారు. 23వ తేదీ విజయనగరం మహారాజావారి శ్రీ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణగారు ప్రసంగించారు. ఈ కార్యక్రమాలను శ్రీ సౌజన్య, శ్రీ జి. కిషోర్‌బాబు గార్లు నిర్వహించారు.

## ఎలమంచిలిలో

సెప్టెంబరు 24వ తేదీ ఎలమంచిలిలో జరిగిన సాధనా శిబిరంలో పాల్గొన్న సుమారు 1000 మందిని ఉద్దేశించి డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణగారు ప్రసంగించారు. పాల్గొన్న వారందరు గాయత్రీ మంత్ర దీక్ష తీసుకున్నారు. సాయంత్రం సహస్ర దీప యజ్ఞాన్ని శ్రీమతి రాజ్యలక్ష్మిగారు నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు శ్రీమతి సౌజన్యగారు ఆధ్వర్యం వహించగా శ్రీ బసవరాజు, క్రాంతి గార్లు, నాగేశ్వరరావు దంపతులు సహాయ, సహకారాలందించారు.

## అమలాపురంలో

సెప్టెంబరు 26,27,28 తేదీలలో శ్రీ రామానందస్వామి, శ్రీమతి కె. నాగమణిగార్ల ఆధ్వర్యంలో జరిగిన సాధనా శిబిరంలో డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణగారు మూడు రోజులు ఉదయం, సాయంత్రం మార్గదర్శక ప్రసంగాలు ఇచ్చారు. ఇంకా శ్రీమతి అమ్మాజి ఆసన ప్రాణయామముల గురించి, శ్రీమతి రాజ్యలక్ష్మి గురుదేవుల ప్రణాళిక గురించి, శ్రీమతి శ్రీలక్ష్మి సంజీవని విద్య గురించి వివరించారు. 28వ తేదీ ఉదయం 8 గంటలకు యజ్ఞోపవీత సంస్కారములు నిర్వహించబడ్డాయి.

## గోదావరి జిల్లాలలో

25.07.2010న గురుపౌర్ణమి సందర్భమున పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం అమలాపురంలోని గీతా ఆశ్రమమందు శ్రీ రామానందస్వామి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భమున జన్మదిన సంస్కాములు, అక్షరాభ్యాస సంస్కారములు నిర్వహించబడ్డాయి.

25.07.2010న గురుపౌర్ణమి సందర్భమున లక్ష్మీనరసాపురం గ్రామంలోని గాయత్రీ శక్తి పీఠమందు పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం శ్రీ రామానందస్వామి ఆధ్వర్యంలో సుభద్ర, మంగతాయారుగార్లు నిర్వహించారు. ఇదేవిధంగా రంగాపురం గ్రామమందు కూడా గాయత్రీ చరణ పీఠమందు శ్రీ ఎన్.ఆర్.కె రాజు గారిచే పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడింది.

26.07.2010 నుండి 31.07.2010 వరకు తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి, రాజానగరం, పల్లకడియం, గొల్లలమామిడాడ, కాకినాడ, అమలాపురం మండలం, కొత్రేని కోనమండలం, అల్లవరం, రాజోలు మండలములలో ప్రచార రథంతో ప్రచార కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో శ్రీ రామానందస్వామి, కె. నాగమణి, దుర్గ, సుభద్ర, గాయత్రి, కుమారి, సీతాకుమారి, రాజుగార్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

08.08.2010న అమలాపురంలోని కొంకాపల్లి ప్రాంతమందు విశ్వహిందూపరిషత్ వారి కార్యక్రమంలో భాగంగా శ్రీరామకృష్ణరావు ఆధ్వర్యంలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం దుర్గ, కుమారి గార్లు నిర్వహించారు.

**[redacted]న్ని చేరాలంటే సమస్యల వలయాన్ని ఛేదించాలి.**

19.08.2010 రంగాపురం గ్రామంలో శ్రీ జె. సత్యన్నారాయణ గారి గృహమందు పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం సుభద్ర, మంగ, రమణగార్లు నిర్వహించారు.

20.08.2010 రంగాపురం గ్రామంలో శ్రీ మోహన్‌రావుగారి నూతన గృహప్రవేశ సందర్భమున పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞ కార్యక్రమమును శ్రీ ఎన్.ఆర్.కె రాజు, సుభద్ర గార్లు నిర్వహించారు.

**ప్రచార కార్యక్రమం :** 01.08.2010 నుండి 10.08.2010 వరకు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో జరిగిన ప్రచార కార్యక్రమంలో భాగంగా యజ్ఞములు, సత్సంగములు నిర్వహించబడ్డాయి. పూజ్య గురుదేవుల సాహిత్యమును, స్టిక్కర్లను అందించి గురుదేవుల లక్ష్యములను మన బాధ్యతలను తెలియచేసి జనులలో స్పందన తీసుకురావడం జరిగింది. ఈ కార్యక్రమములలో శ్రీ రామానంద స్వామి, కె. నాగమణి, సుభద్ర, గాయత్రి గార్లు పాల్గొన్నారు.

31.08.2010 రాజానగరం మండలం పల్లకడియం గ్రామంలో శ్రీ సూర్యనారాయణ రెడ్డిగారి నూతన గృహ ప్రవేశ సందర్భమున పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞము శ్రీ రామానంద స్వామి ఆధ్వర్యంలో, కె. నాగమణి, సుభద్ర, గాయత్రి, దుర్గ, రాజుగార్లు నిర్వహించారు.

## కామారెడ్డిలో

25.07.2010న గురుపౌర్ణమి శుభ సందర్భమున కామారెడ్డిలోని శ్రీ షిర్డి సాయిబాబా మందిరమందు మందిర నిర్వాహకులు శ్రీ రాజమౌళిగారి ఆధ్వర్యంలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం శ్రీ దుర్గా మల్లిఖార్జునరావు గారు నిర్వహించారు. సుమారు 250 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 800 రూపాయల సాహిత్య విక్రయం జరిగింది.

సాయంత్రం 108 దీపాలతో దీపయజ్ఞం నిర్వహించబడింది. సుమారు 100 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజ్య గురుదేవుల గురించి, శాంతికుంజ్ కార్యక్రమాల గురించిన సందేశం ఇవ్వడం జరిగింది.

**శ్రావణ మాస ప్రచార కార్యక్రమం :** స్థానిక గాయత్రీ ప్రజ్ఞాపీఠం వారి ఆధ్వర్యంలో 11.08.2010 నుండి 10.09.2010 వరకు జరిగిన ప్రచార కార్యక్రమంలో మారుతివ్యాన్‌లో పర్యటిస్తూ కామారెడ్డి చుట్టు ప్రక్కల ప్రాంతాలలో గాయత్రీ మంత్రం గురించి, గాయత్రీ యజ్ఞం గురించి ప్రచారం నిర్వహించడమేగాక 23 ప్రాంతాలలో గాయత్రీ యజ్ఞం నిర్వహించబడింది. గాయత్రీ ప్రజ్ఞా పీఠం గురించి ప్రజలకు తెలియపరచటంలో సఫలీకృతులయ్యారు. కామారెడ్డి గాయత్రీ ప్రజ్ఞాపీఠం వారికి అభినందనలు.

## ప్రకాశం జిల్లాలో

05.09.2010న శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ప్రకాశం జిల్లా పొదిలి గ్రామంలో శ్రీ కృష్ణ గోకులాన్ని తలపింపచేసే గోశాలలో 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం శ్రీ బి. సత్యన్నారాయణ రావు దంపతులు నయానందకరంగా నిర్వహించారు. గోశాల నిర్వాహకులు శ్రీ సత్యన్నారాయణ, శ్రీ మురళి, శ్రీ నాగరాజు గార్లు ఈ కార్యక్రమమునకు కావలసిన సహాయ సహకారాలు అందించారు. 1000 రూపాయలు గురుదేవుల సాహిత్య విక్రయం జరిగింది. సుమారు 500 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తూమాడులో

14.09.2010న ప్రకాశం జిల్లా తుమాడు గ్రామంలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం శ్రీ బి. సత్యన్నారాయణ రావు గారు నిర్వహించారు. 300 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వెల్దుర్తిలో

08.09.2010న కర్నూలు జిల్లా వెల్దుర్తియందు గల శ్రీ బ్రహ్మగుండ క్షేత్రంలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం శ్రీ కె.బాలకృష్ణ గారి ఆధ్వర్యంలో కె.బి.సరోజ, సుబ్రమణ్యశెట్టి, హరినరసింహ్మానాయుడు, గురురాజరావు గార్లు నిర్వహించారు. శ్రీ చంద్రశేఖరరెడ్డి భోజన ప్రసాద ఏర్పాట్లు చేశారు. సుమారు 300 మంది పరిజనులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### పాఠకులకు ఆహ్వానం

- *"యుగశక్తి గాయత్రి" పత్రికలోని శీర్షికలు, అంశాలను గూర్చి పాఠకుల నుండి అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నాం.*
- *పాఠకులు పోస్టు కార్డుపై పది వాక్యాలకు మించకుండా వ్రాసి ప్రతినెలా 10వ తేదీలోగా పంపించాలి.*
- *ఎంపికైన లేఖలు, స్థలాన్ని బట్టి ప్రచురించగలం.*
- *ఎంపిక విషయంలో సంపాదకమండలిదే తుది నిర్ణయం.*

[redacted] శారీరక బలం కన్నా సంకల్పబలమే మిన్న.

## అక్షరాల ఆట

# పదగాయత్రి-1

నిర్వహణ : **శ్రీ సాధన నరసింహాచార్య**



### నిబంధనలు :

1. సమాధానాలు "కీ"తో సరిపోవాలి.
2. ఈ నెల 20వ తేదిలోగా కార్యాలయానికి చేరునట్లు పంపాలి.
3. పత్రికలో ఇచ్చిన పదగాయత్రి కూపన్ నింపి పంపించవలెను.
4. తెల్లకాగితాలు / జిరాక్స్ కాఫీలు అనుమతించబడవు.
5. దిద్దుబాట్లు/కొట్టివేతలు/తుడుపులు ఉండరాదు.
6. అన్ని కరెక్టు అయిన ఎంట్రీలు ఒకటి కంటె ఎక్కువ వచ్చినచో వాటిలో లాటరీపద్ధతిలో ఎంపికచేసి **మొదటి బహుమతి రూ. 100/-** **రెండవ బహుమతి రూ. 50/-** ఇవ్వబడును.
7. బహుమతుల విషయంలో తుదినిర్ణయం సంపాదకులదే. ఎలాంటి వివాదాలకు తావులేదు.
8. తపాలాశాఖవారి ఆలస్యానికి పత్రిక బాధ్యత వహించదు.

### ఆధారాలు

**అడ్డం**

1. ప్రస్తుతం మీరు చదువుతున్నది (7)
7. శ్రేష్ఠ (2)
8. చెల్లా చెదురైన ప్రయాణము (4)
9. అటు, ఇటుగా మారిన దానము (4)
10. గతి తప్పిన మార్గము (3)
11. జులుములో మధ్య అక్షరం లోపించింది (2)
12. అటునుంచి వాహిని (2)
13. గాంధీజీని పిలవండి (2)
14. కుప్పిగంతులు వేసిన హనుమత్ ప్రార్థన .............. ............. మారుత తుల్యవేగం (4)
15. నాటి సంగీత దర్శకులు (3) ............ దక్షిణా మూర్తి
16. 1 అడ్డంలో ఉన్నదాని ప్రధాన సంపాదకులు (5)
17. ముఖానికి వికృతి (2)

**నిలువు**

1. రాజుగారి కుమారుడు (4)
2. శివుడు మ్రింగినది (4)
4. చివర లోపించిన దెబ్బ (2)
5. ముత్తయిదువకు ఇచ్చేది (వరుసమారింది) (4)
6. గంగకు మరోపేరు (3)
9. ఋణం తీరాక కలిగేది (3)
10. తెలుగులో పర్ ఫెక్షన్ (6)
12. శ్రీ కృష్ణుడు పూరించినది (క్రిందనుండి) (4)
13. భాషకు వికృతి (2)
14. ఆరోహణక్రమంలో ఓంకారం (4)
15. దుఃఖానికి వ్యతిరేకం (2)

**ఎంట్రీలు పంపవలసిన చిరునామా**

**పదగాయత్రి, C/o. యుగశక్తిగాయత్రి, అశ్విని హౌస్, గాయత్రీ చేతనా కేంద్రం, మూసాపేట, హైదరాబాద్ - 500 018.**

**చివరి తేది : 20.11.2010 సమాధానాలు, విజేతల పేర్లు వచ్చే సంచికలో ప్రచురించబడును.**

[redacted]లెక్కడ దాగున్నాయి? - సంతృప్తిలో.